اِهْدِنَا الصِّرَاطَ الْمُسْتَقِيمَ

# శాంతిబాట

సంతోషమయ జీవనానికి మార్గదర్శి

సంపుటి 2 సంచిక 1 ఆగష్టు 2010 రూ. 17/-




కాఫిర్ అంటే ఎవరు?

పొరుగువారి పట్ల మన బాధ్యత ...

సూరహ్ బఖరా తఫ్సీర్ ప్రారంభం ...


visit

www.saanthibaata.net

'టెర్రరిజం' శీర్షికలో ఓ ప్రత్యేక ఇంటర్వ్యూ వివరాలు ...

وَلَوْ أَنَّمَا فِي الْأَرْضِ مِنْ شَجَرَةٍ أَقْلَمٌ وَالْبَحْرُ يَمُدُّهُ
مِنْ بَعْدِهِ سَبْعَةُ أَبْحُرٍ مَّا نَفِدَتْ كَلِمَتُ اللهِ إِنَّ اللهَ
عَزِيزٌ حَكِيمٌ

# అల్లాహ్



మహా వివేకవంతుడు

الحَكِيمُ

అల్-హకీమ్

**The Wise**

సర్వశక్తిమంతుడు

العَزِيزُ

అల్-అజీజ్

**The Almighty**

ఒకవేళ వాస్తవానికి, భూమిలో ఉన్న వృక్షాలన్నీ కలములై ఈ సముద్రం మరియు దానితోపాటు అటువంటి ఏడు సముద్రాల (నీళ్ళంతా) సిరాగా ఉన్నా అల్లాహ్ మాటలు (సూచనలు) పూర్తికావు. నిశ్చయంగా అల్లాహ్ సర్వశక్తిమంతుడు, మహా వివేకవంతుడు. (ఖుర్'ఆన్ 31:27)

**And if whatever trees upon the earth were pens and the sea [was ink], replenished thereafter by seven [more] seas, the words of ALLAH would not be exhausted. Indeed, Allah is Exalted in Might and Wise**

చెప్పు : " ఆయనే అల్లాహ్! ఒక్కడు. అల్లాహ్ ఎవరి అక్కరా లేనివాడు. ఆయనకు సంతానం లేదు మరియు ఆయన ఎవరి సంతానమూ కాడు. మరియు ఆయనతో పోల్చదగినది ఏదీ లేదు. (ఖుర్'ఆన్ 112:1-4)

షాబాన్ - రమదాన్ హి.1431

# శాంతిబాట

మాసపత్రిక రూ. 17/-

సంపుటి 2 సంచిక 1 ఆగష్టు 2010

2-8-31, కోటబజార్, సామర్లకోట 533 440

Email:velugubaata@gmail.com

**3 అరబీ భాషలో సర్వమానవాళికి అల్లాహ్ యొక్క సందేశం :** ఖుర్‌ఆన్ గ్రంథ అధ్యయనానికి ప్రోత్సాహం - సూరహ్ అల్-బఖరా తఫ్సీర్ ప్రారంభం ...

**8 ప్రపంచ శాంతిదూత 'ముహమ్మద్(స)' వారి బోధనలు, ఆచరణలు :** సమాజంలోని సమస్యలకు పరిష్కార మార్గం - ఈ నెల ప్రత్యేకం : ఉత్తమ సమాజం ...

**13 హదీస్ విజ్ఞానం :** ఉల్లేఖకుల సంఖ్య ఆధారంగా హదీస్ వర్గీకరణ ...

**15 తిరిగి గూటికి :** ఏ సృష్టి ధర్మంతో బిడ్డ జన్మించిందో, తిరిగి ఆ ధర్మానికే చేరుకున్న సోదరుడు లేదా సోదరి గురించి (వారి మాటలలో). నవముస్లిముల సమస్యలపై ప్రత్యేక వ్యాసం ...

**19 ముహమ్మద్(స) వారి జీవిత చరిత్ర :** ప్రవక్త(స)వారి జననానికి ముందు జరిగిన కొన్ని ముఖ్య సంఘటనలు ...

**22 ఖుర్‌ఆన్‌ను అర్థం చేసుకుంటూ చదువుదాం :** నెలకు 24 అరబీ పదాల చొప్పున 30 నెలలలో ఖుర్‌ఆన్‌లోని 80 శాతం పదాలను నేర్పించాలని...

**23 టెర్రరిజం :** టెర్రరిజానికి ఏ మతం పేరును అతికించకుండా, 'ఇస్లామ్'నే అతికించి ముస్లిములనే టార్గెట్‌గా ఎందుకు పెట్టుకున్నారు? కనులు మూసుకున్న మీడియా యొక్క కనులు తెరిపించే ప్రయత్నం. సెప్టెంబర్ 11, 2001 ట్విన్ టవర్స్‌పై దాడి - కారకులెవరు? దాడికి కారణం బిన్ లాడెన్ కాదు!? FBI దగ్గర ఎటువంటి సాక్ష్యం లేదు - పరిశోధనాత్మక వ్యాసం

**28 బాలబాలికలకు ప్రత్యేకం :** ఇల్మ్ (జ్ఞానం)

**30 ధర్మసందేశ ప్రచారం :** ప్రస్తుతం సమాజంలో అనుసరిస్తున్న కొత్త పోకడల గురించి .... ఖుర్‌ఆన్ మరియు సున్నత్ వెలుగులో సందేశాన్ని అందించే విధానాల పరిచయం. కాఫిర్ అంటే ఎవరు? ...

**36 ముస్లిం యువత – ఆలోచించండి! :** సహజీవనం - నయీ బీమారి ...

**39 పాఠకుల అభిప్రాయాలు**

ఎడిటర్:

**ఎమ్‌డి. అతహరుల్లా**

**ఎడ్వయిజరీ బోర్డ్:**

డా॥ సలీమ్ పాషా

డా॥ నాగిరెడ్డి శ్రీనివాసరావు

ఎమ్‌డి. అఫ్వాన్ ఉమ్రీ

**Printed by**
Md. Athaharullah

**Published by**
Md. Athaharullah

**Owned by**
Velugubaata Educational Society
(R.No. 569/2008), Samalkot-533440

and

**Printed at**
'*Akash Industries*',G-14, Industrial Estate, Samalkot - 533440

and

**Published at**
2-8-31, Kota Bazar,
Samalkot - 533440,

**Editor:** Md. Athaharullah

Phone : 9347046090,
Email: velugubaata@gmail.com
RNI Regd. No. APTEL/2009/29650

**Production Incharge**
T. Srinivasa Rao
(Zakir)

**సంవత్సర చందా :**

**రూ. 200/-**

*For online payments, Please contact Dr. N. Srinivasa Rao (Cell: 9491103017)*

M.O. చేయవలసిన చిరునామా:

**వెలుగుబాట ఎడ్యుకేషనల్ సొసైటీ**
2-8-31, కోట బజార్,
సామర్లకోట-533440

మీ పూర్తి ఎడ్రస్‌ను, ఫోన్ నెంబర్లతో సహా **M.O.** ఫారమ్‌పై వ్రాయండి.
లేదా
క్రింది నెంబర్‌కు
మీ వివరాలను **SMS** చేయండి.
**Cell : 9491103017**

ఈ పత్రికలో ప్రచురించిన వ్యాసాల గురించిగాని, లేదా ఇతర వివరాలకుగాని సంప్రదించండి

**డా॥ నాగిరెడ్డి శ్రీనివాసరావు,** *M.Sc.,Ph.D.* **Cell : 9491103017**

బిస్మిల్లాహిర్రహ్మానిర్రహీమ్ (అనంత కరుణామయుడు, అపార కృపాశీలుడు అయిన అల్లాహ్ పేరుతో)

# ప్రభావం

మానవునిపై తన చుట్టూ ఉండే పరిస్థితుల ప్రభావం బాగా పనిచేస్తుంది. ఆ ప్రభావం ఆ మనిషి యొక్క మానసిక పరిస్థితిపై, అతని జ్ఞానంపై మరియు సంస్కారంపై ఆధారపడి ఉంటుంది. మనిషిపై మంచికంటే చెడు యొక్క ప్రభావం చాలా తొందరగా పడుతుంది. అందుకనే మనిషి బలహీనతపై ఆధారపడి జరిగే వ్యాపారాలు ఎన్నో! మగవాడు వాడుకునే వస్తువులకు కూడా ఎడ్వర్‌టైజ్ చేయడానికి స్త్రీలను ఉపయోగించడానికి గల కారణం స్త్రీ విషయంలో పురుషునికి ఉండే బలహీనతను సొమ్ము చేసుకోవడానికే! ఇది అనాదిగా జరుగుతూనే ఉంది. అయితే ప్రస్తుతం అది మరింతగా దిగజారిందని, ఆ యాడ్స్‌లో స్త్రీలు ధరించే దుస్తులను బట్టి ఎవరైనా చెప్పగలరు.

మనిషి బలహీనతలపై ఆధారపడి జరుగుతున్న వ్యాపారాలలో అతి ముఖ్యమైనది - 'సినిమా' ఈ మాస్ మీడియా ప్రజలను బాగా ప్రభావితం చేస్తుంది. వీటి ప్రభావం మానసిక పరిపక్వతకు చేరుకోనివారిపై చాలా ఎక్కువగా ఉంటుంది. మితిమీరిన హింస, అశ్లీలం వీరిపై తీవ్రప్రభావం చూపుతాయి.

'మేము సినిమాలు తీసేది కేవలం వినోదం కొరకే! మేము మంచి చూపించినంత మాత్రాన ప్రేక్షకులందరూ మంచిని పాటిస్తారా? అని నిర్మాతలు, డైరక్టర్లు ఎదురు ప్రశ్న వేస్తున్నారు. వీరు ఏ విధంగా సర్దిచెప్పినాసరే, మీడియా (ప్రింట్, ఎలక్ట్రానిక్, సినిమా) యొక్క ప్రభావం ప్రజలపై చాలా తీవ్రంగా ఉంటుంది. అక్రమ సంబంధాలంటే ఎవరైనా అసహ్యించుకుంటారు. కాని ప్రేక్షకులని నవ్వించడానికి అటువంటి సంబంధాలపై కమెడియన్ల చేత జోకులు చెప్పిస్తున్నారు. ప్రేక్షకుడికి తెలియకుండానే స్లోపాయిజన్ ఇస్తూ అతనిని నైతికంగా పతన దిశ వైపు తీసుకువెళుతున్నారు.

తల్లిదండ్రులు ఉద్యోగాలు చేయడం వలన పిల్లలకు ఇంటిలో ఇవ్వవలసిన నైతిక శిక్షణ కొరకు సమయం దొరకడం లేదు. దీనికి అదనంగా 'సినిమా' వారిలో అనైతిక విలువలను పెంచి పోషిస్తుంది. అంటే 'రోగం' రాకుండా ముందు జాగ్రత్తగా వేక్సిన్ ఇవ్వడానికి బదులు, రాకూడని ఆ రోగాన్నే శరీరంలోకి ఇంజెక్ట్ చేసినట్లుంది ప్రస్తుత సమాజ పరిస్థితి.

మనిషికి సహజ బలహీనతలు ఉంటాయి. వీటిని అధిగమించే విధంగా సమాజంలో పరిస్థితులు కలుగజేయాలి. కాని దీనికి విరుద్ధంగా ఆ బలహీనతలనే సొమ్ము చేసుకోవడానికి ప్రయత్నించడం దుర్మార్గం. సినిమా సంగతిని కాస్సేపు ప్రక్కన పెట్టండి. నేడు ఎవరైనా తన భార్యబిడ్డలతో ఇంటిలో కూర్చుని ఏ టి.వి. ఛానల్‌నైనా మధ్యలో మార్చకుండా చూడగలరా?

ఈ మధ్యనే రాయలసీమ ఫ్యాక్షనిజంపై ఓ సినిమా వచ్చింది. దాని వలన ఫ్యాక్షనిజం పెరిగిపోతుందని, హింస పెరిగిపోతుందని మహిళా సంఘాలవారు మరియు ఎందరో మేధావులు టి.వి. ఛానల్స్‌లో విమర్శలు గుప్పించారు. మామూలుగా అయితే ఇది చాలా అభినందించ దగిన విషయమని చెప్పవచ్చు. కాని ఈ విమర్శకుల వ్యవహారం కూడా సినిమాలాగే ఓ షో మాత్రమే. ఎందుకంటే ఈ సినిమాకు ముందు ఎన్నో ఫ్యాక్షన్ ఓరియెంటెడ్ సినిమాలు వచ్చాయి. అంతేకాకుండా 'హింస'ను ప్రధానంగా చూపిస్తూ ఎందరో యువ హీరోలతో సినిమాలు వచ్చాయి. వాటిని ప్రజలు ఆదరించారు. మరి వీటివలన హింస, ఫ్యాక్షనిజం పెరిగిపోతాయని ఎవరూ ఎప్పుడూ మాట్లాడలేదు.

రాయలసీమ అంటే "కడపబాంబులు, కత్తులు, కొడవళ్ళు, రక్తం" అనే విధంగా అన్నిరకాల మీడియా ఇతర ప్రాంతాలవారి మనస్సులలో నాటుకునేలా చేసింది. రెండు సంవత్సరాలపాటు ఓ పరిశోధనా విషయమై అనంతపురం జిల్లా అంతా సర్వే చేయవలసి వచ్చింది. అనంతపురం జిల్లాలో మొదటిసారి అడుగుపెట్టినప్పుడు, మనస్సులో మీడియా వలన ఏర్పడిన భయాందోళనలు ఎక్కువగానే ఉన్నాయి. కాని రెండు రోజుల్లోనే అక్కడి వారి సంస్కారాన్ని చూసి ఆశ్చర్యపోవడం జరిగింది. ఆ ఆశ్చర్యానికి కారణం - ఆ ప్రాంతం వారిపై మీడియా అంత బాడ్ ఇమేజ్‌ను ఏర్పరచింది. ఓ పెద్ద బంగళా నుండి పిలుపు వచ్చింది. యూనివర్శిటీ నుండి పరిశోధన కొరకు వచ్చిన విషయం తెలుసుకుని, ఆతిథ్యమిచ్చి సగౌరవంగా సాగనంపారు. ఒకవేళ అనంతపురం జిల్లాకు వెళ్లి ఉండకపోతే, రాయలసీమ వారిపై మీడియా వలన కలిగిన అపోహ తొలగిపోకుండా జీవితంలో అలాగే ఉండిపోయేదేమో!

మీడియాకు సర్క్యులేషన్, టి.ఆర్.పి. రేటింగ్ పెరగాలి. అందుకొరకు వారు నైతిక విలువలను వదిలేసారు. ఎల్లప్పుడూ మంచినే, సత్యాన్నే వినిపించితే, విన్నవారంతా మంచివారు కాకపోచ్చు. కాని ఆ మంచిమాట/సత్యం మనస్సులలో నాటుకుని ఉంటుంది. కొందరైనా మంచిగా మారే అవకాశముంది. **అబద్ధం దుర్మార్గంవైపు, దుర్మార్గం నరకం వైపు తీసుకెళతాయని ముహమ్మద్(స)వారు బోధించారు.**

'ముస్లిమ్'ను ఓ టెర్రరిస్ట్‌గా, 'ఇస్లామ్' (శాంతిధర్మం) టెర్రరిజాన్ని ప్రోత్సహించేదిగా ప్రింట్, ఎలక్ట్రానిక్ మీడియా మరియు సినిమాల ద్వారా ప్రచారం జరుగుతూనే ఉంది. పాశ్చాత్య దేశాల ఆర్థిక సహకారంతో ఓ మతవర్గం దుష్ప్రచారం చేస్తూనే ఉంది. కాని ఏ ఒక్క ముస్లిమ్ నాయకుడుగాని, మేధావిగాని తమ ఆవేదనని వినిపించే ప్రయత్నం చేయడం లేదు.

ఓ సినిమాలో తమ మనోభావాలు దెబ్బతీశారు అని మార్వాడీలు కోర్టుకు వెళ్ళారు. ఎన్నో సామాజిక వర్గాలవారు అదే విధంగా నిరసన తెలిపారు. నిరసన తెలపని వారు ముస్లిములు మాత్రమే. ముస్లిములు కనీసం సమాచార శాఖా మంత్రిగారికి ఓ వినతి పత్రం సమర్పించవచ్చు. అందరూ సంతాకాలు పెట్టి రిక్వెస్టు చేస్తూ ముస్లిముల తరపున ఓ ప్రతినిధి మీడియావారికి ఓ లేఖను అందించవచ్చు. ఇలాచేస్తే అరెస్టులు జరుగవు. శాంతిభద్రతలకు విఘాతం కలుగదు. మన ఆవేదన అర్థం చేసుకునే వరకూ వారికి మనవి చేసుకుంటూనే ఉండాలి. **ఏదో ఒక రోజు వారిలో కూడా పరివర్తన రావచ్చు.** మనం ఎవరినీ విమర్శించడం లేదు. ఎవరిపైనైనా చర్య తీసుకోమని చెప్పడం లేదు, ఎటువంటి హెచ్చరికలు మన లేఖలో ఉండవు. మన మనోభావాలను దెబ్బతీసే ప్రచారం మరియు ప్రయత్నాలు ఏ విధంగా జరుగుతున్నాయో మాత్రమే వివరిస్తున్నాము. ఆలోచించండి! స్వయంగా శాంతిబాట టీమే ఆ పనిచేయవచ్చు కదా అని ఎవరైనా అనవచ్చు. ఇది కేవలం మా బాధ్యత మాత్రమే కాదు. ఇది అందరి బాధ్యత. ఇది సమిష్టిగా చేయవలసిన పని. మా వంతు ప్రయత్నం మేము చేస్తూనే ఉన్నాము.

- శాంతిబాట టీమ్



# అరబీ భాషలో సర్వమానవాళికి అల్లాహ్ యొక్క సందేశం

بِسْمِ اللَّهِ الرَّحْمَنِ الرَّحِيمِ

అనంత కరుణామయుడు, అపార కరుణాప్రదాత అయిన అల్లాహ్ పేరుతో

12

## ఖుర్'ఆన్ తఫ్సీర్

### 2. సూరహ్ అల్-బఖరా

(గత సంచిక తరువాయి)

దివ్య ఖుర్'ఆన్ గ్రంథంలో ఈ సూరహ్ అతి పెద్దది. మదీనాలో అవతరించబడిన తొలి సూరహ్ ఇది. కాని ఇందులోని ఆయత్‌లు ఆయా సందర్భాలలో అవతరించబడ్డాయి. ఎంతో సుధీర్ఘకాలంపాటు ఈ సూరహ్ అవతరించబడింది. ఈ సూరహ్‌లో 'వడ్డీ' నిషేధం గురించి చెప్పే ఆయత్‌లు ప్రవక్త(స)వారి చివరికాలంలో మక్కా విజయం తరువాత అవతరించబడ్డాయి.

ఈ సూరహ్‌లోని 281వ ఆయత్ ఖుర్'ఆన్ అవతరణలో చిట్టచివరిగా అవతరించబడిన ఆయత్.

**మరియు మీరు తిరిగి అల్లాహ్ సమక్షానికి చేరుకోబోయే ఆ దినానికి భయపడండి. అప్పుడు ప్రతి వ్యక్తికి తన కర్మల ప్రతిఫలం ఇవ్వబడుతుంది. వారికెలాంటి అన్యాయం జరుగదు.**
(ఖుర్'ఆన్ 2:281)

అంటే ఈ ఆయత్ అవతరణతో ఖుర్'ఆన్ పూర్తి అయింది. జుల్-హిజ్జా 10వ రోజున, హిజ్రీ 10వ సంవత్సరంలో ముహమ్మద్(స)వారు తన చివరి హజ్జ్ చేస్తున్నప్పుడు అవతరించబడింది. ఈ ఆయత్ అవతరణ తరువాత 80 లేదా 90 రోజులలో ఆయన(స) ఈ లోకాన్ని వీడారు.

ఈ సూరహ్‌లో ఉండే ఆయత్‌ల సంఖ్య 286. ఈ సూరహ్‌లో 6201 పదాలున్నాయని మరియు ఇందులో 25,500 అక్షరాలున్నాయని ఇబ్నె కసీర్‌గారు తన తఫ్సీర్ గ్రంథంలో తెలియజేశారు.

**ఈ సూరహ్ యొక్క ఘనత :**

ఈ సూరహ్ దివ్య ఖుర్'ఆన్‌లో అతి పెద్దదైన సూరహ్ మాత్రమే కాదు, ఇందులో ఎక్కువ సంఖ్యలో ఆదేశాలున్నాయి.

అబూ హురైరా(రజి) ఉల్లేఖనం: ప్రవక్త(స) చెప్పారు, 'మీ ఇండ్లను సమాధులుగా మార్చకండి. నిస్సందేహంగా, షైతాన్ సూరతుల్ బఖరా చదివిన ఇంటిలో ప్రవేశించడు.
**(తిర్మిదీ, సహీహ్, 2877, పుస్తకం 42, అధ్యా. 2, సంపుటి 5)**

నవ్వాస్ బిన్ సమాన్ ఉల్లేఖించారు : ప్రవక్త(స) చెప్పారు, "ఖుర్'ఆన్ వస్తుంది, మరియు ఈ ప్రపంచంలో దాని ప్రకారం ఆచరించిన దాని ప్రజలు వస్తారు. **సూరతుల్ బఖరా మరియు ఆలిఇమ్రాన్‌లు దాని ముందు ఉంటాయి**. నవ్వాస్ చెప్పారు, 'అల్లాహ్ యొక్క సందేశహరులు మూడు సామెతలు చెప్పారు, వాటిని నేను మరచిపోలేను.' ఆయన చెప్పారు, 'అవి వస్తాయి రెండు నీడలుగా వాటి మధ్యలో ప్రకాశవంతంగా ఉంటుంది లేదా అవి రెండు నీడనిచ్చే నల్లటి మేఘాలుగా లేదా అవి పక్షుల పంక్తులవంటి నీడలుగా తన ప్రజల తరపున వాదిస్తాయి.
**(తిర్మిదీ, సహీహ్, 2883, పుస్తకం 42, అధ్యా. 5, సంపుటి 5)**

తీర్పుదినం నాడు ప్రజలంతా నీడకోసం పరితపిస్తారు. ఈ సూరహ్‌ల పఠనం మరియు వాటి ప్రకారం ఆచరించిన వారికి ఆరోజున ఏ విధంగా నీడ లభిస్తుందో పై ఆయత్‌లో ముహమ్మద్(స)వారు వర్ణించి చెప్పారు. అంతేకాకుండా వారికొరకు అవి వాదిస్తాయని కూడా తెలుస్తున్నది.

ముస్నద్ అహ్మద్ నుండి ఇబ్నె కసీర్ తెలియజేసిన హదీస్ ప్రకారం ఈ సూరహ్ దివ్య ఖుర్'ఆన్ యొక్క శిఖరం వంటిదని ఈ సూరహ్‌లోని ప్రతీ ఆయత్ యొక్క అవతరణ జరిగినప్పుడు ఆ ఆయత్‌తో పాటు 80మంది దైవదూతలు ఉండేవారని తెలుస్తుంది.

అబ్దుల్లా బిన్ మస్'ఊద్ చెప్పారు: అల్లాహ్ ఆకాశాలలోగాని భూమిలోగాని '**ఆయతల్ కుర్సీ**' కంటే ఎక్కువ ఘనమైనదానిని సృష్టించలేదు. సుఫ్యాన్ చెప్పారు: ఎందుకంటే ఆయతల్ కుర్సీ అల్లాహ్ యొక్క ప్రసంగం, మరియు అల్లాహ్ సృష్టియైన ఆకాశాలు మరియు భూమి కంటే అల్లాహ్ యొక్క ప్రసంగం గొప్పది. **(తిర్మిదీ, సహీహ్, 2884, పుస్తకం 42, అధ్యా. 5, సంపుటి 5)**

ఉబై బిన్ కాబ్ ఉల్లేఖనం : రసూలుల్లాహ్(స) అడిగారు, 'ఓ అబూ మున్‌జిర్, అల్లాహ్ గ్రంథంలో నీవు నేర్చుకున్న వాటిలో ఏ ఆయత్ గొప్పదో నీకు తెలుసా?' నేను చెప్పాను: 'అల్లాహ్ మరియు ఆయన సందేశహరులకే బాగా తెలుసు'. ఆయన(స) అడిగారు: 'ఓ అబూ మున్‌జిర్, అల్లాహ్ గ్రంథంలో నీవు

నేర్చుకున్న వాటిలో ఏ ఆయత్ గొప్పదో నీకు తెలుసా?' నేను చెప్పాను, 'అల్లాహు లా ఇలాహ ఇల్లాహువల్ హయ్యుల్ ఖయ్యూమ్ (**ఆయతల్ కుర్సీ**)'. (అతని)ఛాతిపై ఆయన(స) తట్టి అన్నారు, 'నీకున్న జ్ఞానానికి నిన్ను అభినందిస్తున్నాను ఓ అబూ మున్‌జిర్!)**(సహీహ్ ముస్లిమ్, 1885, పుస్తకం 6, అధ్యా. 44, సంపుటి 2)**

అబూ మస్'ఊద్ అన్సారీ ఉల్లేఖనం. అల్లాహ్ యొక్క సందేశహరులు చెప్పారు : 'ఎవరైతే సూరతుల్-బఖరా చివరి రెండు ఆయత్‌లు రాత్రి యందు పఠిస్తారో, అవి అతనికి చాలు'. **(తిర్మిదీ, సహీహ్, 2881, పుస్తకం 42, అధ్యా. 4, సంపుటి 5)**

అబూహురైరా ఉల్లేఖనం : 'అల్లాహ్ యొక్క సందేశహరులు చాలా మందితో కూడిన ఓ సైనిక పటాలాన్ని పంపించారు. మరియు ఆయన ప్రతీ ఒక్కరిని అడిగారు అతడు ఖుర్'ఆన్‌లో ఏమేమి పఠించగలడోనని. కాబట్టి వారిలోని ప్రతి ఒక్కడు ఏమేమి పఠించగలడో చెప్పాడు - అర్థం అతడు ఖుర్'ఆన్‌లోని ఏమేమి *కంఠస్థం* చేశాడోనని. ఆయన యువకులలోని ఒకరి దగ్గరికి వచ్చి అడిగారు, 'ఓ ఫలానా నీవేమి కంఠస్థం చేశావు?' అతడు చెప్పాడు, 'నేను అదీ ఇదీ మరియు **సూరతుల్ బఖరా**'ను కంఠస్థం చేశాను'. ఆయన అడిగారు, 'నీవు సూరతుల్ బఖరాను కంఠస్థం చేశావా?' అతడు చెప్పాడు: 'ఔను'. ఆయన అన్నారు, 'అయితే వెళ్ళు, నీవు వారికి సైన్యాధికారిగా'. వారిలో నుండి ఓ నాయకుడు అన్నాడు: 'అల్లాహ్ సాక్షి (ఓ రసూలుల్లాహ్!) సూరతుల్ బఖరా నేర్చుకోకుండా నన్ను ఏదీ ఆపలేదు దానితో నేను (తహజ్జుద్ నమాజ్‌లో) నిలబడలేననే భయం తప్ప. రసూలుల్లాహ్(స) చెప్పారు, 'ఖుర్'ఆన్‌ను నేర్చుకోండి మరియు దానిని పఠించండి. ఎవరైతే దానిని నేర్చుకుని పఠించి దానితో (ప్రార్థనలో) నిలుచుంటాడో అతని పోలిక - కస్తూరితో నిండుగా ఉన్న సంచి వలే ఉంటుంది. దాని సువాసన చుట్టూ ఉండే ప్రదేశాన్ని నింపుతుంది. మరియు దానిని నేర్చుకుని పడుకున్నవాడు అతని జ్ఞాపకంలో అది ఉండగా, అతని సామెత కట్టివేయబడిన కస్తూరి సంచిలా ఉంటుంది.
**(తిర్మిదీ, హసన్, 2876, పుస్తకం 42, అధ్యా. 2, సంపుటి 5)**

అబ్దుల్లా ఇబ్నె మస్‌ఊద్(రజి) ఉల్లేఖనం ప్రకారం, రాత్రి సమయంలో ఈ సూరహ్‌లోని 10 ఆయత్‌లు పఠించడం వలన ఎంతో ప్రభావం కలుగుతుంది అంటే, షైతాన్ గాని జిన్‌గాని ఇంటిలో ప్రవేశించడు. కుటుంబంలో ఆ రాత్రి ఏదైనా వ్యాధిగాని లేక ఉపద్రవంగాని లేదా విచారంగాని సంభవించదు. వ్యార్థక్యపు బలహీనతతో ఉన్న వారిపై ఈ ఆయత్‌లు చదివితే, అవి అతనిని లేపుతాయి. ఆ పది ఆయత్‌లు : ఈ సూరహ్ యొక్క మొదటి 4 ఆయత్‌లు, మధ్యలోని 3 ఆయత్‌లు (అంటే ఆయతల్ కుర్సీ మరియు ఆ ఆయత్ తరువాత వచ్చే రెండు ఆయత్‌లు) మరియు సూరహ్ చివరి 3 ఆయత్‌లు. (ఈ 10 ఆయత్‌లోని తొలి 4 నాలుగు ఆయత్‌లు ఈ వ్యాసంలోనూ, మిగిలిన 6 ఆయత్‌లను ఈ సంచిక వెనుకభాగం కవర్‌పై చూడగలరు).

అందుకే అమీరుల్ మోమినీన్ ఉమర్(రజి)వారు ఈ సూరహ్‌ను నేర్చుకోవడానికి మరియు అర్థం చేసుకోవడానికి 12 సంవత్సరాల సమయం తీసుకున్నారు. ఈయన కుమారులు అబ్దుల్లా బిన్ ఉమర్ ఈ సూరహ్‌ను నేర్చుకోవడానికి 8 సంవత్సరాలు వెచ్చించారు (ఖుర్తుబీ).

**ఈ సూరహ్‌యొక్క ఘనతను తెలియజేసే విషయాలు చాలా ఉన్నాయి. వాటిని వచ్చేసంచికనుండి వీలును బట్టి ప్రత్యేకంగా ఇన్షా అల్లాహ్ అందిస్తాము.**

ఈ సూరహ్‌లోని తొలి 5 ఆయత్‌లను వాటి అర్థాన్ని ప్రక్క పేజీలో చూడండి.

## 1. అలిఫ్ - లామ్ - మీమ్

ఖుర్'ఆన్‌లో కొన్ని సూరహ్‌లు విడి అరబీ అక్షరాలతో ప్రారంభం అవుతాయి. అయితే ఆ అక్షరాలను ఎందుకు సూరహ్ ప్రారంభంలో ఉంచారో ఎవరికీ తెలియదు. అల్లాహ్‌కే తెలుసు. ఈ విడి అక్షరాలనే **ముఖత్త'ఆత్** అంటారు. వీటిని విడివిడిగానే చదవాలి.

ఈ అక్షరాలు తెలియకపోవడం వలన ఏ ముస్లిమ్‌కైనా లేదా ఏ ముస్లిమేతరునికైనా ఖుర్'ఆన్‌ను అర్థం చేసుకోవడంలో ఎటువంటి ఇబ్బందీ ఉండదు.

విద్వాంసులు ఎందరో వీటిపై వ్యాఖ్యానించారు. అవి వారి వ్యక్తిగత అభిప్రాయాలు మాత్రమే. అటువంటి తెలియని విషయాల వెనుక పడవద్దని క్రింది ఖుర్'ఆన్ ఆయత్ వారిస్తుంది.

> ఆయన(అల్లాహ్)యే నీపై (ఓ ముహమ్మద్!) ఈ గ్రంథాన్ని అవతరింప జేశాడు, ఇందులో కొన్ని స్పష్టమైన అర్థమిచ్చే ఆయత్‌లు (ము'హ్కమాత్) ఉన్నాయి. అవి ఈ గ్రంథానికి మూలాలు. మరికొన్ని అస్పష్టమైనవి (ముతషాబిహాత్) ఉన్నాయి. **కావున తమ హృదయాలలో వక్రత ఉన్నవారు, సంక్షోభాన్ని రేకెత్తించడానికి మరియు గూఢార్థాలను ఆక్షేపించి ఎల్లప్పుడూ అస్పష్టమైన వాటి వెంటపడతారు.** వాటి అసలు అర్థం అల్లాహ్‌కు తప్ప మరెవ్వరికీ తెలియదు. కానీ, పరిపక్వ జ్ఞానం గలవారు, **"మేము దీనిని విశ్వసించాము, ప్రతీ ఒక్కటీ మా ప్రభువు వద్ద నుండి వచ్చినదే!" అని అంటారు.** జ్ఞానవంతులు తప్ప ఇతరులు *వీటిని గ్రహించలేరు*" **(ఖుర్'ఆన్ 3:7)**

పై ఆయత్ చాలా స్పష్టంగా చెప్పిన తరువాత ఇక ఆ విడి అక్షరాల గురించి వ్యాఖ్యానించ వలసిన అవసరం లేదనేది స్పష్టమౌతుంది. ఈ విడి అక్షరాల వలన ఒక మేలు కూడా ఉంది. వాటి గురించి పదే పదే మనల్ని ఎవరైనా అడుగుతూ ఉంటే లేదా వాటికి ఏదో ఒక విషయాన్ని ఆపాదించాలని ప్రయత్నిస్తుంటే, వారి హృదయాలు ఎటువంటివో మనకు పై ఖుర్'ఆన్ ఆయత్ ద్వారా తెలుస్తుంది. కాబట్టి అటువంటి వారి విషయంలో మనం జాగ్రత్త పడాలని ముందుగానే తెలుసుకోగలమని మా అభిప్రాయం.

## అధ్యాయం -2 : "ఆవు"

అనంత కరుణామయుడు, అపార కరుణాప్రదాత అయిన అల్లాహ్ పేరుతో

1. **అలిఫ్ - లామ్ - మీమ్**

2. **ఇది (ఈ ఖుర్'ఆన్) ఒక దివ్య గ్రంథం, ఇందులో ఏ మాత్రం సందేహం లేదు. దైవభీతి గలవారికి ఇది మార్గదర్శకత్వము.**

3. **(వారికి) ఎవరైతే అగోచర యథార్థాన్ని విశ్వసిస్తారో, సలాత్ (నమాజ్)ను స్థాపిస్తారో మరియు మేము ప్రసాదించిన జీవనోపాధి నుండి (మా మార్గంలో) ఖర్చు చేస్తారో**

4. **మరియు ఎవరైతే (ఓ ముహమ్మద్!) నీపై అవతరింపజేయబడిన దానిని (ఈ ఖుర్'ఆన్‌ను) మరియు నీకు పూర్వం అవతరింపజేయబడిన వాటినీ (దివ్య గ్రంథాలను) విశ్వసిస్తారో మరియు పరలోక జీవితాన్ని దృఢంగా నమ్ముతారో!**

5. **అలాంటి వారే తమ ప్రభువు (చూపిన) సన్మార్గంలో ఉన్నవారు, మరియు అలాంటి వారే సాఫల్యం పొందేవారు.**

## 2. సూరహ్ అల్-బఖరా

بِسۡمِ اللّٰهِ الرَّحۡمٰنِ الرَّحِيۡمِ

الٓمّٓ ① ذٰلِكَ الۡكِتٰبُ لَا رَيۡبَ فِيۡهِ

ఇందులో | సందేహం | లేదు | (ఆ)పుస్తకం | ఇది | అలిఫ్ లామ్ మీమ్

هُدًى لِّلۡمُتَّقِيۡنَ ② الَّذِيۡنَ يُؤۡمِنُوۡنَ

విశ్వసిస్తారు | ఎవరైతే | దైవభీతి గలవారికి | మార్గదర్శకత్వము

بِالۡغَيۡبِ وَيُقِيۡمُوۡنَ الصَّلٰوةَ وَمِمَّا

మరియు దేని నుండి | సలాత్ (నమాజ్) | మరియు స్థాపిస్తారు | అగోచరంలో

رَزَقۡنٰهُمۡ يُنۡفِقُوۡنَ ③ وَالَّذِيۡنَ

మరియు ఎవరైతే | ఖర్చు చేస్తారు | మేము వారికి ప్రసాదించినది

يُؤۡمِنُوۡنَ بِمَاۤ اُنۡزِلَ اِلَيۡكَ وَمَاۤ اُنۡزِلَ

అవతరించ బడింది | మరియు ఏదైతే | నీపై | అవతరించ బడింది | ఏదైతే | విశ్వసిస్తారు

مِنۡ قَبۡلِكَ وَبِالۡاٰخِرَةِ هُمۡ يُوۡقِنُوۡنَ ④

ధృడంగా విశ్వసిస్తారు | వారు | మరియు పరలోకంలో | నీకు పూర్వం

اُولٰٓـئِكَ عَلٰى هُدًى مِّنۡ رَّبِّهِمۡ

తమ ప్రభువు | నుండి | మార్గదర్శకత్వం | మీద | వారు

وَاُولٰٓـئِكَ هُمُ الۡمُفۡلِحُوۡنَ ⑤

సాఫల్యం పొందేవారు | వారు | మరియు వారే

గమనిక : బ్రాకెట్లలో ఇచ్చిన పదాలను చదవనవసరం లేదు

**అరబీ వాక్యాలను కుడివైపునుండి ఎడమవైపుకు చదవాలి**

## సూరహ్ అల్-బఖరా పదాల అర్థాలు

| | | | | | |
|---|---|---|---|---|---|
| 1. | ఇది, (అది) | ذٰلِكَ | 13. | వారిని, వారు, వారి యొక్క | هُمْ |
| 2. | సందేహం లేదు, అనుమానం లేదు | لَا رَيْبَ | 14. | వారు ఖర్చు చేస్తారు | يُنْفِقُوْنَ |
| 3. | ఇందులో, లో, వద్ద, పై, లోపున (*preposition*) | فِيْهِ | 15. | ఏదైతే | بِمَا |
| 4. | ధర్మపరాయణులు, దైవభీతిగలవారు | مُتَّقِيْنَ | 16. | అవతరించబడింది, క్రిందికి దించబడింది | أُنْزِلَ (ن ز ل) |
| 5. | వారు విశ్వసించారు | يُؤْمِنُوْنَ (ا م ن) | 17. | నీ పై | إِلَيْكَ |
| 6. | కనిపించని, అగోచరమైనది | غَيْبُ | 18. | ఏది, ఏదైతే | مَا |
| 7. | మరియు, (మరియు కూడా) | وَ | 19. | నీకు పూర్వం | قَبْلِكَ |
| 8. | వారు స్థాపిస్తారు, వారు స్థిరంగా ఉంటారు | يُقِيْمُوْنَ | 20. | చివరిలో వచ్చేది (పరలోకం, మరణం తరువాత జీవితం) | اٰخِرَةُ |
| 9. | సలాత్ (నమాజ్ - ప్రార్థన) | الصَّلٰوةَ | 21. | వారు ధృడంగా ఉంటారు | يُوْقِنُوْنَ (ي ق ن) |
| 10. | దాని యొక్క, దాని నుండి (*preposition*) | مِمَّا | 22. | వారు / (ఆ) ప్రజలు | أُولٰٓئِكَ |
| 11. | మేము సమకూర్చాము, అనుగ్రహించాము, ఆశీర్వదించాము, జీవనోపాధితో అనుగ్రహించాము | رَزَقْنَا (ر ز ق) | 23. | మీద, పైన (*preposition*) | عَلٰى |
| | | | 24. | మార్గదర్శకత్వం | هُدًى |
| 12. | మేము, మాకు, మనయొక్క | نَا | 25. | సాఫల్యవంతులు | مُفْلِحُوْنَ (ف ل ح) |

**2. ఇది (ఈ ఖుర్'ఆన్) ఒక దివ్య గ్రంథం, ఇందులో ఏ మాత్రం సందేహం లేదు. దైవభీతి గలవారికి ఇది మార్గదర్శకత్వము.**

ఈ అల్-బఖరాకు ముందు వచ్చిన 'సూరహ్ అల్-ఫాతిహా'లోని చివరి ఆయత్‌లలో మనం అల్లాహ్‌ను ఈ క్రింది విధంగా వేడుకుంటున్నాము.

**"మాకు ఋజుమార్గం (సన్మార్గం) వైపునకు మార్గదర్శకత్వం వహించు. వారి మార్గం ఎవరిపై నీ అనుగ్రహాన్ని ప్రసాదించావో, నీ కోపానికి గురియైన వారిది కాదు, మార్గభ్రష్టులైనవారిది (వారి మార్గం) కాదు."**

మనం అల్లాహ్‌ను సన్మార్గం కొరకు పై విధంగా వేడుకున్నాము. **మన వేడుకోలు వింటే అల్లాహ్ ఏం చేస్తారు?** ఇది తెలియాలంటే ఈ సూరహ్‌లోని 186వ వాక్యాన్ని ఇక్కడ తెలియజేయవలసి ఉంది.

> ''మరియు నా దాసులు, నన్ను గురించి నిన్ను అడిగితే : ''**నేను** (వారికి) **అతి సమీపంలోనే ఉన్నాను.** పిలిచేవాడు నన్ను పిలిచినప్పుడు నేను అతని పిలుపును విని, **జవాబిస్తాను.** కాబట్టి వారు సరైనమార్గం పొందటానికి నా ఆజ్ఞలను అనుసరించాలి మరియు నాయందు విశ్వాసం కలిగిఉండాలి'' అని చెప్పు. (ఖుర్'ఆన్ 2:186)

మనం పిలిస్తే, ఆయన జవాబిస్తాను అని పై వాక్యంలో అల్లాహ్ చెబుతున్నారు. అంటే మొదటి సూరహ్‌లో మనం ఆయనను వేడు కున్నాము కాబట్టి, దానికి ఆయన ఇచ్చిన జవాబు '**ఇది ఒక దివ్య గ్రంథం**'.

ముందుగా ఏమీ చెప్పకుండా '**ఇది**' అనే పదం ఇక్కడ వాడబడింది. ఎందుకు అలా చెప్పబడిందో కొందరికి సందేహం రావచ్చు. మనం సన్మార్గం వైపునకు మార్గదర్వకత్వాన్ని అల్లాహ్ నుండి కోరుకున్నాం కదా! ఇక్కడ '**ఇది**' అంటే '**ఆ సన్మార్గం కొరకు చేసిన మార్గదర్శకత్వం**'. అంటే ఈ దివ్యగ్రంథమే మనకు సన్మార్గం వైపునకు దర్శకత్వం వహిస్తుందని అల్లాహ్ జవాబు ఇచ్చారని అర్థమౌతుంది.

మనం కేవలం సన్మార్గం కొరకు మాత్రమే మార్గదర్శకత్వాన్ని కోరలేదు. ఆ మార్గం ఎటువంటిదై ఉండాలో కూడా అర్థించాము. అల్లాహ్ యొక్క అనుగ్రహం పొందినవారి మార్గం అయివుండాలి. మరియు ఆయన కోపానికి గురియైన వారి మార్గం కాకూడదు మరియు అది మార్గభ్రష్టులైన వారి మార్గం కూడా కాకూడదు.

**కాబట్టి మన వేడుకోలుకు పూర్తిగా ఆయన ఇచ్చిన జవాబు** - ఇది (ఈ ఖుర్'ఆన్) దివ్యగ్రంథం. ఈ గ్రంథంలో ఆయన అనుగ్రహాన్ని పొందినవారి మార్గం గురించి చెప్పబడింది. ఆయన కోపానికి గురియైన వారు ఏ విధంగా నశించబడింది కూడా ఈ గ్రంథంలో చెప్పబడింది. మార్గం తప్పినవారి గురించి చెప్పబడింది.

కాబట్టి ఈ సూరహ్ అల్-బఖరా ప్రారంభం నుండి ఖుర్'ఆన్ గ్రంథంలోని చివరి వాక్యం వరకూ ఉన్న ఆయత్‌లన్నీ కూడా 'సూరహ్ ఫాతిహా' ద్వారా మనం అల్లాహ్‌ను వేడుకున్న విన్నపానికి సమాధానం అని తెలుస్తుంది.

"ఇందులో ఏ మాత్రం సందేహం లేదు"

ఇటువంటి అర్థాన్నిచ్చే మరో ఆయత్ 'సూరహ్ అస్-సజ్దా'లో చెప్పబడింది.

**"అలిఫ్-లామ్-మీమ్. నిస్సంకోచంగా, ఈ గ్రంథ (ఖుర్'ఆన్) అవతరణ సర్వలోకాల ప్రభువు తరపునుండియే ఉంది"** (ఖుర్'ఆన్ 32:1-2)

ఇది అల్లాహ్ నుండి అవతరించబడిన గ్రంథం అనే విషయంలో ఎటువంటి సందేహమూ లేదు. కొందరు విద్వాంసులు సూరహ్ అల్-బఖరాలో ఓ నిషేధముందని ప్రకటించారు. అదేమిటంటే, **'ఖుర్'ఆన్‌పై సందేహపడ కూడదు'**. కొందరు ఈ ఆయత్‌ను పఠించేటప్పుడు 'లారైబ' (సందేహం లేదు) చదివాక కాస్సేపు ఆగుతారు. ఆ తరువాత తిరిగి పఠనం కొనసాగిస్తారు.

కాని ఆగవలసింది 'లారైబ' దగ్గర కాకుండా, 'ఫీహి' పఠించిన తరువాత ఆగాలి.

**[ఇందులో ఏ మాత్రం సందేహం లేదు । దైవభీతిగలవారికి మార్గదర్శకత్వం]**

'లారైబ'తో ఆగితే క్రింది అర్థం వస్తుంది :

**[ఏమాత్రం సందేహం లేదు । ఇందులో దైవభీతిగలవారికి మార్గదర్శకత్వముంది]**

**"ఇందులో దైవభీతిగలవారికి మార్గదర్శకత్వముంది"** అని చెప్పడం సరికాదు.

స్వయంగా ఖుర్'ఆన్ గ్రంథమే - **'దైవభీతిగలవారికి మార్గదర్శకత్వం'**

'హుదల్లిల్ ముత్తఖీన్' (దైవభీతిగలవారికి మార్గదర్శకత్వం). ముత్తఖీన్ అనే పదం 'తఖ్వా' అనే పదం నుండి ఉత్పన్నమైంది. దీనికి భాషాపరమైన అర్థం - భయపడటం, దేనినుండైనా ఆత్మను నిగ్రహించుకోవడం. ఇస్లామీయ అర్థం - అల్లాహ్‌కు భయపడటం మరియు ఆయన ఆదేశాలను ఉల్లంఘించకుండా ఆత్మను నిగ్రహించుకోవడం.

## తఖ్వా గలవారికి మార్గనిర్దేశం అనుగ్రహించబడుతుంది

**హిదాయా** (హిదాయత్) - సన్మార్గ నిర్దేశనం - తఖ్వా గలవారికి మాత్రమే అనుగ్రహించబడింది. అల్లాహ్ చెప్పారు :

**"... వారితో ఇలా అను: 'ఇది (ఈ ఖుర్'ఆన్) విశ్వసించినవారికి మార్గదర్శకత్వం మరియు స్వస్థత నొసంగేది. మరియు విశ్వసించని వారి చెవులకు అవరోధం మరియు వాని కళ్ళకు ఒక గంత. అలాంటి వారి స్థితి ఎంతో దూరం నుండి పిలువబడిన వారి అరుపుల వంటిది' ".** (ఖుర్'ఆన్ 4:44)

**మరియు మేము ఈ ఖుర్'ఆన్ ద్వారా విశ్వాసులకు స్వస్థతను మరియు కారుణ్యాన్ని క్రమక్రమంగా అవతరింప జేస్తాము, కాని దుర్మార్గులకు ఇది నష్టం తప్ప మరేమీ అధికం చేయదు** (ఖుర్'ఆన్ 17:82)

పై వాక్యాల వంటివి ఖుర్'ఆన్‌లో చాలా ఉన్నాయి. ఇవన్నీ ప్రత్యేకంగా విశ్వాసులకు ఖుర్'ఆన్ నుండి పొందే మేలును సూచిస్తున్నాయి. ఎందుకంటే "స్వయంగా ఖుర్'ఆన్ గ్రంథమే మార్గ దర్శకత్వం". కాని ఈ మార్గనిర్దేశనం సన్మార్గులకు మాత్రమే అనుగ్రహించ బడింది.

**"ఓ మానవులారా! వాస్తవంగా మీ ప్రభువు తరపు నుండి మీ వద్దకు హితోపదేశం వచ్చింది మరియు ఇది మీ హృదయాలకు స్వస్థత నిస్తుంది. మరియు విశ్వసించినవారికి మార్గదర్శకత్వము మరియు కారుణ్యం** (ఖుర్'ఆన్ 10:57)

పై ఆయత్ ద్వారా ఖుర్'ఆన్ సమస్త మానవుల హితం కొరకు అవతరించ బడింది. మానవుల హృదయాలకు స్వస్థత నిస్తుంది. ఖుర్'ఆన్ - 'విశ్వసించినవారికి ఇది మార్గ నిర్దేశనమే కాకుండా కారణ్యం కూడా'.

## దైవభీతిగలవారు (అల్-ముత్తఖీన్)

ఇబ్నె అబ్బాస్ చెప్పారు, అల్-ముత్తఖీన్ అంటే అల్లాహ్ శిక్షకు భయపడేవారు, అల్లాహ్ యొక్క కారుణ్యం ఆయన అవతరింపజేసిన దానిలో ఉందని విశ్వసించేవారు. (ఇబ్నె కసీర్)

వారి గురించి ఈ సూరహ్ 3 మరియు 4 ఆయత్‌లలో చెప్పబడింది.

**3. (వారికి) ఎవరైతే అగోచర యథార్థాన్ని విశ్వసిస్తారో, సలాత్ (నమాజ్)ను స్థాపిస్తారో మరియు మేము ప్రసాదించిన జీవనోపాధి నుండి (మా మార్గంలో) ఖర్చు చేస్తారో**

**4. మరియు ఎవరైతే (ఓ ముహమ్మద్!) నీపై అవతరింపజేయబడిన దానిని (ఈ ఖుర్'ఆన్‌ను) మరియు నీకు పూర్వం అవతరింప జేయబడిన వాటినీ (దివ్య గ్రంథాలను) విశ్వసిస్తారో మరియు పరలోక జీవితాన్ని దృఢంగా నమ్ముతారో!**

**మార్గదర్శకత్వం (హిదాయత్) అనేది రెండు రకాలు :**

1. 'హుదా' అంటే మనస్సులో ఉండే విశ్వాసం మరియు దానిని తన దాసుల హృదయాలలో సృష్టించగలిగేది అల్లాహ్‌యే.

   అల్లాహ్ చెప్పారు:

   **"(ఓ ప్రవక్తా!) నిశ్చయంగా, నీవు నీకు ఇష్టమైన వారికి మార్గ దర్శకత్వం చేయలేవు, కాని అల్లాహ్ తాను కోరిన వారికి మార్గదర్శకత్వం చేస్తాడు. మరియు ఆయనకు మార్గదర్శకత్వం పొందే వారెవరో బాగా తెలుసు"** (ఖుర్'ఆన్ 28:56)

   **"(ఓ ప్రవక్తా!) వారిని సన్మార్గాన్ని అవలంబించేటట్లు చేయటం నీ బాధ్యత కాదు. కాని, అల్లాహ్ తాను కోరిన వారికి సన్మార్గం చూపుతాడు ..."** (ఖుర్'ఆన్ 2:272)

2. 'హుదా' సత్యాన్ని వివరించడం, మార్గాన్ని తెలియజేయడం మరియు దాని వైపు తీసుకెళ్ళడం.

*తఫ్సీర్‌లోని మరికొంత భాగం ఇన్షాఅల్లాహ్ వచ్చే సంచికలో ...*

ప్రపంచ శాంతి దూత

సన్మార్గ బోధకుడు
నాయకుడు
ఆదర్శనీయుడు

# ముహమ్మద్ (స) వారి

## బోధనలు ఆచరణలు

మంచిగా మానవత్వంతో బ్రతకమనే హితబోధను ప్రతి మనిషి తన ఊహతెలిసిన దగ్గరనుండి వింటూనే ఉంటాడు. అయితే ఏది మంచి? ఏది చెడు? కొంతమంది తమ దృష్టిలో ఫలానా విషయం మంచిది అని సమర్థిస్తారు. అదే విషయాన్ని మరికొందరు పూర్తి చెడుగానూ తీసుకుంటారు. అంతెందుకు, ఒకే మనిషిలో ఒకే పనిపై, తన జీవితంలోని వివిధ దశలలో వేర్వేరు అభిప్రాయాలు జనిస్తాయి. నిజంగా మంచి చెడులపై మనుషులయొక్క వ్యక్తిగత అభిప్రాయాలనే గనుక పరిగణనలోకి తీసుకుంటే, అన్ని పనులూ మంచి పనులే. అలాగే అన్నీ కూడా చెడ్డపనులే అవుతాయి.

కేజీ బరువున్న వస్తువును, ప్రపంచంలో ఎక్కడకు తీసికెళ్ళినా అది కేజీ బరువే ఉంటుంది. అలాగే కొలతలకు కూడా ప్రపంచవ్యాప్తంగా ఒకటే ప్రమాణముంది.

మరి మనిషి జీవనానికి లేదా ఆచరణకు ప్రపంచవ్యాప్తంగా అలాంటి ఓ ప్రమాణం లేదా? ప్రపంచంలోని ఏ మారుమూలనుండి ఏ వ్యక్తిని తీసుకున్నా, అతని శారీరక నిర్మాణం, అతని అవయవాల పనితీరు తదితర అంశాలన్నీ మిగతా ప్రాంతాలలోని మనుషులలాగే ఒకే విధంగా ఉంటాయి కదా!

మనిషి అనే ఈ జీవయంత్రాన్ని తయారుచేసి, దానికి అవసరమైన పోగ్రామింగ్‌ను చేసిన సృష్టికర్తకే తెలుసు - ఈ మనిషికి ఏది మంచి చేస్తుందో, ఏది చెడు చేస్తుందోనన్న విషయం.

మంచి చెడుల ప్రమాణాలు ఖుర్ఆన్‌లో ఉన్నాయి. అయితే ఆ ప్రమాణాల ప్రకారంగా ఎటువంటి సందేహానికి లోనవకుండా ఉండేందుకు ముహమ్మద్(స) మనందరి శిక్షణకై ఎన్నో విషయాలను ఆచరించి చూపారు. ఖుర్ఆన్ యొక్క ఆదేశాల ప్రకారంగా దైవప్రవక్త ముహమ్మద్ (స)ఆచరించిన పనులను మరియు ఆయన యొక్క ప్రవచనాలను హదీస్‌లు అంటారనే విషయం చాలామందికి తెలుసు. సమకాలీన పరిస్థితులను దృష్టిలో ఉంచుకుని, వేల సంఖ్యలో ఉన్న హదీసులలోని కొన్ని హదీసులను ఎన్నుకొని ఈ శీర్షిక ద్వారా ఇన్షాఅల్లాహ్ అందిస్తూ ఉంటాము.

## ఉత్తమ సమాజం

(గత సంచిక తరువాయి)


10

**"మరియు మీరు ప్రజలకు సాక్షులుగా ఉండటానికి మరియు సందేశహరుడు (ముహమ్మద్) మీకు సాక్షిగా ఉండటానికి మేము మిమ్మల్ని ఒక మధ్యస్థ (ఉత్తమ మరియు న్యాయశీలమైన) సమాజంగా చేశాము ....." (ఖుర్ఆన్ 2:143)**

"And thus we have made you a **median [i.e. just] community** that you will be witnesses over the people and the Messenger will be a witness over you ....." (Qur'an 2:143)

**"మీరే మానవజాతి (హితం) కొరకు నిలబెట్టబడిన ఉత్తమ సమాజం వారు. మీరు మంచిని ఆదేశించే (బోధించే)వారు మరియు చెడును నిషేధించే (నిరోధించే)వారు మరియు మీరు అల్లాహ్ యందు విశ్వాసం కలిగి ఉన్నవారు ..." (ఖుర్ఆన్ 3:110)**

"You are the **best nation** produced [as an example] for mankind. You enjoin what is right and forbid what is wrong and believe in ALLAH ....." (Qur'an 3:110)



క్రిందటి సంచికలో జీవనోపాధి విషయంలో ముహమ్మద్(స)వారి బోధనలను అందించాము. ఒక సమాజంలో సంపాదనాపరులు పెరగడం, ప్రతీ ఒక్కరూ ఏదో ఒక పనిచేసుకుంటూ బ్రతకడం వలన ఆ సమాజం యొక్క ఆర్థిక స్థితి బాగుంటుంది. అది అభినంద నీయమైనది. కాని కేవలం ఈ ఆర్థిక అభివృద్ధి మాత్రమే సమాజాన్ని ఉత్తమ సమాజంగా మార్చలేదు. నేడు ప్రపంచంలో ఆర్థిక అభివృద్ధి సాధించిన పాశ్చాత్య దేశాల పరిస్థితి ఎలా ఉందో మీకు తెలుసు.

కేవలం తన కోసమే ఆలోచిస్తూ, సామాజిక బాధ్యతను గాలికి వదిలేస్తే ఆ సమాజం పతన దిశగా పయనించి ప్రతి ఒక్కరూ మానసిక ప్రశాంతత కోల్పోతారు. మానవ జీవితంలో అతి ముఖ్యమైనది మానసిక ప్రశాంతత. ఇది సాధించడానికి సకలలోకాల ప్రభువు 'అల్లాహ్' తన సందేశహరుని ద్వారా బోధనలు వినిపింపజేశాడు. ఆ బోధనల ప్రకారం జీవిస్తే మనశ్శాంతిగా బ్రతుకుతూ ఉత్తమ సమాజాన్ని సునాయాసంగా నిర్మించవచ్చు.

ప్రస్తుత వ్యాసానికి సంబంధించి ఆ బోధనలు చాలా ఎక్కువ సంఖ్యలో ఉన్నందు వలన, క్లుప్తంగా వాటిలో కొన్నింటిని ఈ సంచికలో ఓ అవగాహన కొరకు అందిస్తున్నాము. ఇన్షా అల్లాహ్ తరువాయి సంచికలలో ప్రతీ అంశం విడివిడిగా పూర్తిగా వివరించ బడుతుంది.

మంచీ చెడు గురించి ఈ శీర్షిక పరిచయ వాక్యాలలో వివరించాము. మన ఏకైక ఆరాధ్యుడు తెలిపిన ఆ మంచి లక్షణాలతో ముహమ్మద్(స) వారు జీవించి మనకు ఓ సజీవ ఉదాహరణ అయ్యారు. ఆయన(స) జీవితం ప్రతి ఒక్కరికి ఆదర్శనీయం.

మంచి లక్షణం యొక్క విలువను క్రింది బోధన తెలియజేస్తుంది.

> ఆయిషా(రజి) ఉల్లేఖనం : అల్లాహ్ యొక్క సందేశహరులు(స) చెప్పగా నేను విన్నాను. రాత్రి అంతా ఉపవాసంతో మరియు ప్రార్థనతో గడిపిన వానియొక్క స్థాయిని, ఓ విశ్వాసి మంచిలక్షణాల (Good Character) ద్వారా పొందవచ్చు.
> **(అబూదావూద్, హసన్, 4798, పుస్తకం 40, అధ్యా.7, సంపుటి 5)**

మంచిగా బ్రతకడం ప్రార్థన వంటిదే. మనం మనవారి కోసం, మన పొరుగువారి కోసం ఏమి చేయాలి? వారితో మంచిగా ఎలా మెలగాలి? క్రింది బోధనలు ఈ ప్రశ్నలకు సమాధానం చెబుతాయి.

ఏ మనిషికైనా అతి ముఖ్యమైనవారు తనకు జన్మనిచ్చిన తల్లిదండ్రులు. వారి ఋణం తీర్చుకోలేనిది. వారిని మనం గౌరవించాలి.

**తల్లిదండ్రులు**

> అబూ సలామహ్ సులామీ ఉల్లేఖనం. ప్రవక్త(స) చెప్పారు, "ప్రతీ ఒక్కరూ తన తల్లిని గౌరవించాలని నేను ఆదేశిస్తున్నాను, ప్రతీ ఒక్కరూ తన తల్లిని గౌరవించాలని నేను ఆదేశిస్తున్నాను, ప్రతీ ఒక్కరూ తన తల్లిని గౌరవించాలని నేను ఆదేశిస్తున్నాను *(మూడుసార్లు)*, ప్రతీ ఒక్కరూ తన తండ్రిని గౌరవించాలని నేను ఆదేశిస్తున్నాను. ప్రతీ ఒక్కరూ తన సంరక్షకుడిని గౌరవించాలని నేను ఆదేశిస్తున్నాను, ఒకవేళ అతడు తనని కొంత బాధించినా"
> **(ఇబ్నెమాజా, హసన్, 3657, పుస్తకం 33, అధ్యా.1, సంపుటి 5)**

తల్లీ తండ్రీ లేనివారుగాని లేదా వారు ఉన్నప్పటికీ ఓ సంరక్షకుని దగ్గర పెరిగినవారు, ఆ సంరక్షకుణ్ణి కూడా గౌరవించాలి.

> అబూహురైరా (రజి) ఉల్లేఖించారు. "ఒక వ్యక్తి ప్రవక్త (స) సమక్షంలో హాజరయి అడిగాడు. 'ఓ రసూలల్లాహ్! నా అనురాగానికి ఎక్కువ అర్హులు ఎవరు?" ఆయన, 'నీ తల్లి' అని పలికారు. అతను మళ్లీ అడిగాడు 'ఆ తరువాత ఎవరు?' అని. 'నీ తల్లి', తర్వాత ఇంకెవరు? 'నీ తల్లి', 'ఆ తర్వాత' 'నీ తండ్రి' అని ఆయన (స) అన్నారు.
> **(సహీహ్ బుఖారీ, 5971, పుస్తకం 78, అధ్యా.2, సంపుటి 8)**

**ప్రేమగా చూసుకోవడంలో ఎక్కువ ప్రాధాన్యత తల్లికే ఇవ్వబడింది.**

ఎన్నో వేల సంవత్సరాలనుండి 'బానిసలు' సమాజంలో ఉన్నారు. ముహమ్మద్(స)వారు జీవించినప్పుడు కూడా వారున్నారు. ఈ బానిసత్వాన్ని సమాజం నుండి సమూలంగా నాశనం చేయడానికి ముహమ్మద్(స)వారు పునాది వేశారు. ఈనాడు బానిసత్వం లేకపోవడానికి కారణం కూడా అదే. ఈ 'బానిస విమోచన' ఎంత గొప్పదో క్రింది బోధన తెలియజేస్తుంది. 'తండ్రి ఋణం తీర్చుకోవడం సంతానానికి సాధ్యం కాదు'. కాని బానిసత్వంలో మగ్గుతున్న తన తండ్రిని స్వేచ్ఛ దొరికేలా చేస్తే అది సాధ్యమౌతుందని చెప్పడం జరిగింది.

> అబూహురైరా(రజి) ఉల్లేఖనం. అల్లాహ్ యొక్క సందేశహరులు(స) చెప్పారు, 'ఏ బిడ్డ తన తండ్రి ఋణం తీర్చుకోలేడు, తన తండ్రిని బానిసగా చూచి, అతనిని కొని మరియు అతనికి స్వేచ్ఛ కలిగించితే తప్ప'.
> **(ఇబ్నెమాజా, సహీహ్ 3659, పుస్తకం 33, అధ్యా.1, సంపుటి 5)**

తల్లిదండ్రులను దూషించకూడదని ప్రవక్త(స)వారు బోధించినప్పుడు, తల్లిదండ్రులను ఎవరైనా దూషిస్తారా? అని అనుచరులు ఆశ్చర్య పోయారు. ఈ దూషించడమనే మహాపాపం గురించి :

> అబ్దుల్లా బిన్ అమ్ర్ ఉల్లేఖనం. 'రసూలుల్లాహ్(స) చెప్పారు : 'మహాపాపాలలో కెల్లా చెడ్డది ఏమిటంటే ఒకడు తన తల్లిదండ్రులను తిట్టడం (శపించడం)'. ఇలా అడగబడింది 'ఓ రసూలల్లాహ్! ఒకడు ఎలా తన తల్లిదండ్రులను తిట్టగలడు? ఆయన(స) చెప్పారు, 'అతడు మరో వ్యక్తి తండ్రిని తిట్టినప్పుడు, మరియు ఆ వ్యక్తి ఇతని తండ్రిని తిడతాడు లేదా అతని తల్లిని తిట్టినప్పుడు ఆ వ్యక్తి ఇతని తల్లిని తిడతాడు'.
> **(అబూదావూద్, సహీహ్, 5141, పుస్తకం 40, అధ్యా. 119,120, సంపుటి 5)**

కాబట్టి మన తల్లిదండ్రులను గౌరవించి, ప్రేమించడమే కాకుండా, ఎదుటివారి తల్లిదండ్రులను దూషించకుండా ఉండాలి. ఆ విధంగా దూషణ చేయకపోతే అది కూడా పరోక్షంగా మన తల్లిదండ్రులను గౌరవించినట్లే అవుతుంది.

> ఇబ్నె ఉమర్(రజి) ఉల్లేఖనం. రసూలుల్లాహ్(స) చెప్పారు, 'మంచి పనులలో ఉత్తమమైనది ఒక వ్యక్తి తన తండ్రి మరణించాక, తన తండ్రి స్నేహితులతో సంబంధాలను నిలబెట్టగలగడం'
> **(అబూదావూద్, సహీహ్, 5143, పుస్తకం 40, అధ్యా. 119,120, సంపుటి 5)**

కాకి పిల్ల కాకికి ముద్దు అంటారు. సంతానం అంటే తల్లిదండ్రులకు ఎంతో ముద్దు.

**సంతానం**

ఆయిషా(రజి) ఉల్లేఖనం. కొందరు పల్లెటూరి వ్యక్తులు ప్రవక్త(స)వారి వద్దకు వచ్చి చెప్పారు, 'మీ పిల్లలను మీరు ముద్దాడుతారా?' ఆయన చెప్పారు, 'ఔను'. వారు అన్నారు, 'కాని మేము, అల్లాహ్ సాక్షి, ఎప్పుడూ (మా పిల్లలను) ముద్దు పెట్టుకోలేదు'. ప్రవక్త(స) చెప్పారు: 'అల్లాహ్ మీనుండి కరుణను తీసేసుకున్నట్లయితే, నేనేమి చేయగలను?'

**(ఇబ్నెమాజా, సహీహ్, 3665, పుస్తకం 33, అధ్యా.3, సంపుటి 5)**

ఇంతవరకూ బాగానే ఉంది. కాని మనదేశంలో బిడ్డ పుట్టగానే, ఆ బిడ్డ మగబిడ్డా లేక ఆడబిడ్డా అని కొందరు తల్లిదండ్రులు విపరీతమైన టెన్షన్‌కి గురి అవుతారు. ఈ మధ్యనే విశాఖపట్నంలో ఓ తండ్రి నెల కూడా నిండని తన కూతురుని బ్రతికుండగానే మట్టిలో పూడ్చేశాడు. ఇటువంటి పనే 1400 సం॥ల క్రితం ఇస్లామ్ ప్రారంభానికి పూర్వం అరేబియాలో కొందరు అరబ్బులు చేశారు.

కాని వారి సంకల్పం వేరు. ఈ విషయాన్ని ముహమ్మద్(స)వారి జీవిత చరిత్ర శీర్షికలో స్పష్టంగా వివరించాము. ఆడపిల్ల పుడితే ఈ రోజుల్లో వివాహం చేయడం తల్లిదండ్రులకు ఓ పెద్ద ఆర్థిక సమస్య అయిపోయింది.

నిజానికి ఇది చాలా చిన్న సమస్య. అందరూ అనుకుని కట్నాలను నిషేధించుకుంటే ఈ టెన్షన్‌లు ఎందుకుంటాయి? కట్నాలు ఇస్లామ్‌లో నిషేధం. స్త్రీకి పురుషుడే కొంత సొమ్ము 'మహర్'గా ఇవ్వాలి.

ఇస్లామ్ గురించి ఇంకా అవగాహనకు రాని ఎందరో భారతీయ ముస్లిములు కూడా ఈ కట్నాల ఊబిలో ఉన్నారు.

ముస్లిముల గమ్యం పరలోక జీవితం. వారు ఎన్ని త్యాగాలు చేసినా, ఎన్ని కష్టాలు భరించినా సరే అది కేవలం శాశ్వతమైన ఆ 'స్వర్గం' కొరకే. ఇహలోక జీవితం అశాశ్వతమని వారికి స్పష్టంగా తెలుసు. ఎవరైనా ఏదైనా చేసేటప్పుడు సులభంగా పనిపూర్తయ్యే షార్ట్‌కట్ విధానం గురించి ఆలోచిస్తారు. అటువంటి ఓ షార్ట్‌కట్ :

సా'స'ఆ తన బాబాయి అహ్నఫ్ నుండి ఉల్లేఖించారు. "ఆయిషా(రజి) దగ్గరకు ఓ స్త్రీ తన ఇద్దరు కుమార్తెలతో వచ్చారు మరియు ఆమె (ఆయిషా) ఆమెకు (ఆ స్త్రీకి) మూడు ఖర్జూరాలు ఇచ్చారు. (ఆ స్త్రీ) తన ఒక్కొక్క కూతురుకి ఒక్కొక్క ఖర్జూరాన్ని ఇచ్చారు, తరువాత ఆమె చివరి దానిని వారి మధ్య భాగాలు చేశారు. ఆమె (ఆయిషా) చెప్పారు, 'తరువాత ప్రవక్త(స) వచ్చారు మరియు నేను ఆయనకి ఆ విషయం గురించి చెప్పాను. ఆయన(స) అన్నారు, 'ఎందుకు నీవు ఆశ్చర్య పోతున్నావు? దానివలన ఆమె స్వర్గంలో ప్రవేశించింది".

**(ఇబ్నెమాజా, సహీహ్, 3668, పుస్తకం 33, అధ్యా.3, సంపుటి 5)**

ఉఖ్బా బిన్ అమ్ర్ ఉల్లేఖనం : "రసూలుల్లాహ్(స) చెప్పగా విన్నాను, 'ఎవరికైతే ముగ్గురు కుమార్తెలుండి, వారి కొరకు అతను సహనం వహిస్తాడో, వారిని పోషిస్తాడో, వారికి త్రాగడానికి ఇస్తాడో మరియు అతని సంపద నుండి వారికి వస్త్రాలను ధరింపజేస్తాడో, అతని కొరకు వారు పునరుత్థాన దినం నాడు నరకాగ్ని నుండి తెరగా ఉంటారు.

**(ఇబ్నెమాజా, సహీహ్, 3669, పుస్తకం 33, అధ్యా.3, సంపుటి 5)**

ఇబ్నె అబ్బాస్ ఉల్లేఖనం. రసూలుల్లాహ్(స) చెప్పారు, 'తనకు యుక్త వయస్సుకు చేరుకున్న ఇద్దరు కుమార్తెలుండి, వారు తనతో ఉన్నంతకాలం మంచిగా ప్రవర్తిస్తే, అతనికి స్వర్గ ప్రవేశాన్ని లభించకుండా ఉండదు.

**(ఇబ్నెమాజా, సహీహ్, 3670, పుస్తకం 33, అధ్యా.3, సంపుటి 5)**

ఆడపిల్ల తల్లిదండ్రులకి ఎంత మంచి అవకాశం ఉందో పై హదీస్‌లు తెలియజేస్తున్నాయి. తాము కోరుకునేది సులభంగా లభిస్తుందని తెలిశాక సంతోషపడవలసింది పోయి, ఆడపిల్ల పుట్టిందని విచారంపడటంలో అర్థం లేదు.

మన ఇల్లు ప్రశాంతంగా ఉంటే సరిపోతుందా? మన ఇంటి చుట్టూ ఉండే పరిసరాలు కూడా అదే విధంగా ఉండాలి. మనదేశంలో పండుగలకు కొదవలేదు. ఒక ఇంట్లో 'హార్ట్ పేషంట్' ఉంటే, పండుగ వస్తుందంటే ఆ ఇంటివారికి టెన్షనే. ఎందుకంటే భారీ స్పీకర్లు ఏర్పాటు చేసి వారు వినిపించే శబ్దాన్ని వారు తట్టుకోలేరు. ఆ ఇంట్లోనివారు సదరు వ్యక్తుల దగ్గరకెళ్ళి 'బాబూ! కొద్దిగా సౌండ్ తగ్గించండి. మా ఇంటిలో హార్ట్ పేషంట్ ఉన్నారు' అని బ్రతిమాలుకోవాలి. వినకపోతే బ్రతిమాలినవారు సీరియస్ అవుతారు. వారు సౌండ్ పెంచుతారు.

మరి మనశ్శాంతి ఎక్కడ నుండి వస్తుంది? కాబట్టి ఇరుగుపొరుగు కోసం ఇస్లామ్ ఏం చెబుతుందో ప్రవక్త(స)ఆరి బోధనల ద్వారా తెలుసుకుందాం.

**ఇరుగు పొరుగు**

ఆయిషా(రజి) నుండి అమ్రా ఉల్లేఖించారు. రసూలుల్లాహ్(స) చెప్పారు: "పొరుగువారి గురించి జిబ్రాయీల్(అ) ఆదేశిస్తూ ఉండేవారు, పొరుగువారిని వారసులుగా చేసేస్తారేమోనని నేను అనుకునేటంతగా".

**(అబూదావూద్, సహీహ్, 5151, అధ్యా. 122,123, సంపుటి 5)**

ముహమ్మద్ బిన్ అజ్‌లాన్ తన తండ్రి నుండి ఉల్లేఖించారు. అబూ హురైరా(రజి) చెప్పారు : "ఓ వ్యక్తి ప్రవక్త(స)వారి వద్దకు వచ్చి తన పొరుగువాని గురించి ఫిర్యాదు చేశాడు. ఆయన(స) చెప్పారు, "వెళ్ళి సహనంతో ఉండు". అతను రెండు లేదా మూడుసార్లు వచ్చాడు. అప్పుడు ఆయన(స) చెప్పారు, "వెళ్ళు, నీ సామాన్లను వీధిలో ఉంచు". కాబట్టి అతడు తన సామాన్లను వీధిలో బయట ఉంచాడు. మరియు ప్రజలు అతడిని (ఏమి జరిగిందని) అడగడం ప్రారంభించారు. అతడు వారికి జరిగిన వృత్తాంతాన్ని చెప్పాడు, ప్రజలు (ఆ పొరుగువానిని) 'అల్లాహ్ అతనికి ఫలానా ఫలానా చేయుగాక!" అని చెబుతూ తిట్టడం ప్రారంభించారు. అతని పొరుగువ్యక్తి అతని దగ్గరకి వచ్చి చెప్పాడు, "వెనక్కి వచ్చెయ్యి, నీకు ఇష్టం కానిది ఏదీ నా నుండి ఇక చూడవు". **(అబూదావూద్, హసన్, 5153, అధ్యా. 122,123, సంపుటి 5)**

అబూహురైరా(రజి) ఉల్లేఖనం. అల్లాహ్ యొక్క సందేశహరులు చెప్పారు, 'ఎవరైతే అల్లాహ్‌ను మరియు పరలోకాన్ని విశ్వసించారో, అతడు తన అతిథిని గౌరవించాలి, ఎవరైతే అల్లాహ్‌ను మరియు పరలోకాన్ని విశ్వసించారో, అతడు తన పొరుగువారిని బాధించకూడదు. ఎవరైతే అల్లాహ్‌ను మరియు పరలోకాన్ని విశ్వసించారో, అతడు మంచిని మాట్లాడాలి లేకపోతే నిశ్శబ్దంగా ఉండాలి''.

**(అబూదావూద్, సహీహ్, 5154, అధ్యా. 122,123, సంపుటి 5)**

తల్హా ఉల్లేఖనం. ఆయిషా(రజి) చెప్పారు, ''నేను అడిగాను, 'ఓ రసూలుల్లాహ్(స), నాకు ఇద్దరు పొరుగువారున్నారు. నేను ఎవరితో ప్రారంభించాలి.' ఆయన(స) చెప్పారు, 'నీకు ఎవరి ద్వారం దగ్గరగా ఉందో వారితో (మొదలుపెట్టు)' ''

**(అబూదావూద్, సహీహ్, 5155, అధ్యా. 122,123, సంపుటి 5)**

ఇంటి పొరుగువారితో ఎలా ప్రవర్తించాలంటే, చూసేవారికి వారు పొరుగువారిలా కాకుండా, వారి వారసులు అనుకునేటంతగా. ఇక్కడ ఓ అతి ముఖ్య విషయం కూడా ఉంది. పొరుగువారి విషయంలో కూడా పక్షపాతం చూపకుండా ఉండేలా, ఎవ్వరూ నిష్ఠూరమాడని విధంగా ఎంత గొప్ప విధానాన్ని బోధించారంటే, తన ఇంటి తలుపుకి దగ్గరగా ఎవరైతే ఉన్నారో, ఆ పొరుగువాని ఇంటి నుండే ప్రారంభించాలి అన్నారు.

అంటే మనం స్వీట్లు పంచాలనుకుంటే, మనకు బాగా ఇష్టమైన పొరుగువారికో లేదా పూర్వం మనకు బాగా ఎవరైతే మర్యాదలు చేశారో వారికి కాకుండా, మనకు బాగా దగ్గరగా నున్నవారికి ముందుగా పంచాలి.

ఈ విధానం ఎటువంటి ఆరోపణలకు అవకాశమివ్వదు.

కేవలం పొరుగువారే కాకుండా, పొరుగువారి పశువుల విషయంలో కూడా మంచిగానే ప్రవర్తించమని ముహమ్మద్(స)వారు చెప్పారు :

సురాఖా బిన్ జు'షుమ్ ఉల్లేఖనం. ''నేను రసూలుల్లాహ్(స) వారిని తప్పిపోయిన ఓ ఒంటె గురించి అడిగాను. అది నా స్వంత ఒంటెల కొరకు ఏర్పాటు చేసుకున్న నీటి తొట్టెల దగ్గరకు వచ్చింది - దానికి త్రాగడానికి నేను కొంత నీటిని ఇచ్చినట్లయితే నేను ప్రతిఫలం పొందుతానా? ఆయన(స) చెప్పారు, 'ఔను. ప్రతి జీవిలోనూ ప్రతిఫలం ఉంది'

**(ఇబ్నెమాజా, సహీహ్, 3686, పుస్తకం 33, అధ్యా.8, సంపుటి 5)**

ఇప్పటివరకూ తల్లిదండ్రులు, పొరుగువారి కోసమే చెప్పుకున్నాం. అయితే తల్లిదండ్రులు మరియు ఇల్లులేని అనాథలు కూడా సమాజంలో ఉన్నారు. వారి విషయంలో మన బాధ్యత ఏమిటి?

సహ్లా ఉల్లేఖనం. ప్రవక్త(స)వారు చెప్పారు, 'నేను మరియు ఒక అనాథ బాధ్యతను తీసుకున్నవాడు స్వర్గంలో ఈ రెండింటి వలే ఉంటాము, ఆయన తన చూపుడు వ్రేలు మరియు మధ్య వ్రేలును కలిపి ఉంచి'.

**(అబూదావూద్, సహీహ్, 5150, పుస్తకం 40, అధ్యా. 121,122, సంపుటి 5)**

ప్రవక్త(స)వారితో పాటు స్వర్గంలో ఉండటం అంటే అది సామాన్య విషయమా? ప్రవక్త(స)వారిని ప్రేమించే ప్రతి ఒక్కరూ ఆ అవకాశాన్ని ఏమాత్రం వదులుకోరు. ఆ విషయంలో కూడా 'అల్లాహ్' తన దాసులకు ఓ మంచి అవకాశం ఇచ్చారు. 'అనాథ'ల బాధ్యతలను స్వీకరించి, వారికి మేలుచేసి ఈ సదవకాశాన్ని ఎవరైనా ఉపయోగించుకోవచ్చు.

ప్రవక్త(స)వారు జీవించి ఉన్నప్పుడు ఆ మహనీయుని సాన్నిహిత్యంలో బ్రతికిన 'సహాబా'లు ఆయన(స)ను ఎంతగానో ప్రేమించారు. ప్రవక్త(స)వారి జీవితం గురించి తెలిసిన ప్రతీ ఒక్కరూ, ఆ మహనీయునితో మనం ఉండి ఉంటే ఎంత బాగుండేదోనని విచార పడటం చాలా సహజం. ఆ కోరిక తీరాలని అనుకున్నవారికి 'అనాథ'ల బాధ్యత ఓ వరం వంటిది.

అబూహురైరా(రజి) ఉల్లేఖనం. అల్లాహ్ యొక్క సందేశహరులు చెప్పారు, ''ఓ అల్లాహ్! నిస్సందేహంగా నేను ఇద్దరు బలహీనుల హక్కులకు సంబంధించి హెచ్చరించాను : అనాథలు మరియు స్త్రీలు.'' **(ఇబ్నెమాజా, హసన్, 3678, పుస్తకం 33, అధ్యా. 6, సంపుటి 5)**

అనాథలు, స్త్రీలను బలహీనులుగా చెప్పడమంటే, వారి అసహాయతను తమకు అనుకూలంగా చేసుకుంటున్నారని. అంతేగాని వారు శారీరకంగా బలహీనులని కాదు. వారి విషయంలో వారి పట్ల మనకున్న బాధ్యతలను సక్రమంగా నిర్వర్తించాలి. వారు అన్యాయానికి గురవుతున్నారని, అందుకే అనాథలకు, స్త్రీలకు అన్యాయం జరగకుండా చూడాలని హెచ్చరించారు.

**కరుణ చూపాలి**

మనకు కరుణ కావాలంటే మనం కరుణ చూపాలి.

అబ్దుల్లా బిన్ అమ్ర్ ఉల్లేఖనం. కరుణ చూపినవారికి అనంత కరుణా మయుడు కరుణ చూపుతాడు. భూమిపై నున్నవారిపై కరుణ చూపు మరియు ఆకాశాలపై నున్నవాడు నీపై కరుణ చూపుతాడు''

**(అబూదావూద్, హసన్, 4941, పుస్తకం 40, అధ్యా. 58, సంపుటి 5)**

అబ్దుల్లాహ్ బిన్ అమ్ర్ ఉల్లేఖనం. ప్రవక్త(స) చెప్పారు, ''ఎవరైతే మన పిల్లలపై కరుణ చూపరో మరియు మన పెద్దవారిని గౌరవించరో, అతడు మనలోనివాడు కాదు.''

**(అబూదావూద్, హసన్, 4943, పుస్తకం 40, అధ్యా. 58, సంపుటి 5)**

మన పొరుగువారి గురించి, పొరుగువారి పశువుల గురించి చెప్పుకున్నాం. అనాథల గురించి చెప్పుకున్నాం. మరి ఇతర జంతువుల (పెంపుడు కానివి) గురించి ఏం చెప్పారో చూద్దాం.

అబూహురైరా(రజి) ఉల్లేఖనం: ప్రవక్త(స) చెప్పారు, 'ఓ కుక్క బావి చుట్టూ తిరుగుతూ ఉంది మరియు దాహంతో చనిపోయేలా ఉండగా, బనీ ఇస్రాయీల్‌కు చెందిన ఓ వేశ్య దానిని చూసింది మరియు ఆమె తన బూటు (నూతి నుండి నీరు తీయడానికి బూటు ఉపయోగించింది) తీసి దానికి నీరు త్రాగించింది. ఆ పని వలన అల్లాహ్ ఆమెను క్షమించారు.

**(బుఖారీ, 3467, పుస్తకం 60, అధ్యా. 54, సంపుటి 4)**

సమాజంలో ఇంకా చాలామంది ఇతర ప్రజలు ఉన్నారు. వారి బాధ్యత కూడా మనపై ఉంది.

ఒకొక్కసారి చిన్న విషయమే మనకు చాలా పెద్ద ప్రతిఫలాన్ని ఇస్తుంది.

అబూహురైరా(రజి) ఉల్లేఖనం. ప్రవక్త(స) చెప్పారు, 'ప్రజలకు ఇబ్బంది కలిగించే ఓ చెట్టుకొమ్మ రోడ్డుపై ఉంది. ఓ వ్యక్తి దానిని తొలగించాడు, దాని వలన అతడు స్వర్గంలో ప్రవేశింపబడ్డాడు'.
**(ఇబ్నెమాజా, సహీహ్, 3682, పుస్తకం 33, అధ్యా.7, సంపుటి 5)**

కాబట్టి చిన్న విషయమని అశ్రద్ధ చేయకూడదు. దాని వలన ఎంతో మేలు జరగవచ్చు. కీడు కూడా జరగవచ్చు. గ్యాస్ సిలిండర్ కొనడం, గ్యాస్ స్టౌవ్ కొనడం, వాటిపై వంట చేయడంతో పోల్చితే, గ్యాస్ స్టౌవ్ ని ఆపివేయడానికి బటన్ తిప్పడం చిన్న పనే. అది చిన్నపని కదా అని ఆపడం మానివేస్తే, చాలా పెద్ద ప్రమాదమే జరుగవచ్చు. కాబట్టి చిన్న విషయాలని చులకన చేయవద్దు.

అబూ దర్ర్ ఉల్లేఖనం. ప్రవక్త(స) చెప్పారు, ''నా జాతి నాకు చూపించబడింది వారు చేసిన మంచి పనులు మరియు చెడ్డ పనులతో. వారు చేసిన మంచి పనులలో మార్గంలోనుండి హాని కలిగించే వస్తువును తీసివేయడాన్ని చూశాను. మరియు వారు చేసిన చెడ్డపనులలో మస్జిద్‌లో ఉమ్మిని చూశాను అది తొలగించబడలేదు'.
**(ఇబ్నెమాజా, సహీహ్, 3683, పుస్తకం 33, అధ్యా.7, సంపుటి 5)**

మన తోటివారికి నష్టం కష్టం కలిగించకూడదని ఇప్పటికే స్పష్టమైంది. అయితే వారికి మన వలన పరోక్షంగా ఎదురయ్యే మరొక కష్టముంది. అదేమిటంటే,

మిఖ్దాద్ బిన్ అమ్ర్ ఉల్లేఖనం. 'రసూలుల్లాహ్(స)వారు ఇతరులను పొగిడేవారి ముఖాలపై మన్ను విసరమని మమ్మల్ని ఆదేశించారు'
**(ఇబ్నెమాజా, సహీహ్, 3742, పుస్తకం 33, అధ్యా.7, సంపుటి 5)**

ముఆవియా ఉల్లేఖనం. ''రసూలుల్లాహ్(స)వారు చెప్పగా నేను విన్నాను, 'ఒకరినొకరు పొగుడుకోవడంలో జాగ్రత్త పడండి, అది (ఒకరినొకరు) చంపుకోవడమే' ''
**(ఇబ్నెమాజా, హసన్, 3743, పుస్తకం 33, అధ్యా.7, సంపుటి 5)**

అబ్దుర్రహ్మాన్ బిన్ అబూ బక్రా తన తండ్రిగారి నుండి ఉల్లేఖించారు. రసూలుల్లాహ్(స)వారి సమక్షంలో ఒక వ్యక్తి మరియొక వ్యక్తిని పొగిడాడు. రసూలుల్లాహ్(స)వారు చెప్పారు. 'నీపై శాపం పడుగాక! నీవు నీ సహచరుని మెడను కోశావు' చాలాసార్లు(అన్నారు). తరువాత ఆయన(స) చెప్పారు, 'మీలో ఎవరైనా తన సోదరుడిని పొగడవలసి వస్తే, అతనిని ఇలా చెప్పనీయండి. 'అతను ఇలా ఉంటాడని నేను అనుకుంటున్నాను. కాని నేను అల్లాహ్ ముందు ఎవరిని పవిత్రంగా పరిగణించలేను'.
**(ఇబ్నెమాజా, సహీహ్, 3744, పుస్తకం 36, అధ్యా.7, సంపుటి 5)**

మా వర్గం వారు కదా అని, వారు తప్పు చేసినా మద్దతివ్వకూడదు. అటువంటి పనిని ఇస్లామ్ ఖండించింది.

ముహమ్మద్(స)వారి బోధనను అబ్దుర్రహ్మాన్ బిన్ అబ్దుల్లాహ్ బిన్ మస్'ఊద్ తన తండ్రి చెప్పగా విన్నారు. ''సత్యంపై ఆధారపడి కాకుండా ఎవరైతే తన ప్రజలకు సహకరిస్తారో (మద్దతిస్తారో), అతడు నూతిలో పడిన ఒంటెను దాని తోకతో బయటకి లాగిన వాడిని పోలి ఉంటాడు.
**(అబూదావూద్, సహీహ్, 5117, పుస్తకం 40, అధ్యా.111, సంపుటి 5)**

ప్రజలతో మృదువుగా మాట్లాడాలి. ప్రజల వలన మేలు పొందినప్పుడు కృతజ్ఞుడుగా మెలగాలి.

జరీర్ బిన్ అబ్దుల్లాహ్ బజలీ ఉల్లేఖనం. అల్లాహ్ యొక్క సందేశహరులు చెప్పారు, 'ఎవరిలో అయితే మృదుత్వం లేదో, అతనిలో మంచితనం లేదు'
**(ఇబ్నెమాజా, సహీహ్, 3687, పుస్తకం 33, అధ్యా.9, సంపుటి 5)**

అబూహురైరా(రజి) ఉల్లేఖనం. ప్రవక్త(స) చెప్పారు, 'ప్రజలకు కృతజ్ఞుడు కానివాడు, అల్లాహ్‌కు కృతజ్ఞుడు కాడు'.
**(అబూదావూద్, సహీహ్, 4811, పుస్తకం 40, అధ్యా.11, సంపుటి 5)**

## అల్లాహ్ కొరకే ప్రేమించడం

అనస్ బిన్ మాలిక్ ఉల్లేఖనం. ప్రవక్త(స)వారితో ఒక వ్యక్తి ఉన్నారు. మరొక వ్యక్తి అటువైపు వెళ్తున్నప్పుడు అతడు చెప్పాడు. 'ఓ రసూలుల్లాహ్! నేను ఈ వ్యక్తిని ప్రేమిస్తున్నాను' ప్రవక్త(స) అతనితో అన్నారు, 'అతనికి నీవు చెప్పావా?' అతను చెప్పాడు, 'లేదు'. ఆయన(స) అన్నారు : ''అతనికి చెప్పు''. కాబట్టి అతడు ఆ వ్యక్తిని కలిసి చెప్పాడు, ''అల్లాహ్ కొరకు నేను నిన్ను ప్రేమిస్తున్నాను''. అతడు చెప్పాడు, ''ఎవరి కొరకు నీవు నన్ను ప్రేమించావో, ఆయన కూడా నిన్ను ప్రేమించుగాక!''.
**(అబూదావూద్, హసన్, 5125, పుస్తకం 40, అధ్యా.112, సంపుటి 5)**

అబ్దుల్లా బిన్ సామిత్ ఉల్లేఖనం. అబూ దర్ర్ అడిగారు, 'ఓ రసూలుల్లాహ్(స)! ఒక వ్యక్తి ప్రజలను ప్రేమిస్తున్నాడు. వారు చేస్తున్న పనులు అతను చేయలేక పోయినప్పటికీ''. ఆయన(స) చెప్పారు, ''ఓ అబూ దర్ర్, నీవు ఎవరిని ప్రేమిస్తావో వారితో ఉంటావు''. అతను చెప్పాడు, ''నేను అల్లాహ్‌ను మరియు ఆయన సందేశహరుణ్ణి ప్రేమిస్తున్నాను''. ఆయన(స) చెప్పారు, ''నీవు ఎవరిని ప్రేమిస్తున్నావో వారితోనే ఉంటావు'' అబూ దర్ర్ అదే విషయం మరలా అడిగారు మరియు అల్లాహ్ యొక్క సందేశహరులు మరలా అదే చెప్పారు.
**(అబూదావూద్, సహీహ్, 5126, పుస్తకం 40, అధ్యా.112, సంపుటి 5)**

ముహమ్మద్(స)వారిని ప్రేమించిన అనుచరులు ప్రవక్త(స)వారి ఆదేశాలను ఎంతో విధేయతతో అమలు పరిచేవారు. ప్రవక్త(స)వారి విధానం ప్రకారం జీవించడానికి ఎంతో పోటీ పడేవారు.

మరి ప్రవక్త(స)వారిని ప్రేమిస్తున్నామని భావిస్తున్న నేటి ముస్లిమ్‌లు, ముహమ్మద్(స)వారి ఆదేశాల ప్రకారం, ఆయన చూపిన మహోన్నత జీవన విధానం ప్రకారం జీవిస్తున్నారా?

ఓ సారి మనమందరం ఆత్మ పరిశీలన చేసుకోవాలి!

# Science of Hadith
# హదీస్ విజ్ఞానం

(గత సంచిక తరువాయి)

3

### ఇస్నాద్ యొక్క ప్రతీ దశలో ఉన్న హదీస్‌ను తెలియజేసేవారి సంఖ్యను బట్టి వర్గీకరణ

ఈ నెల వ్యాసంలో 'దశ' అనే పదం ఉపయోగించబడింది. ఇక్కడ దశలు అంటే అవి 'సహాబీ', 'తాబయీ', 'తబే తాబయీ', 'ముహద్దిస్'.

**ముతవాతిర్** మరియు **అహద్**

సనద్‌లో ప్రతీ దశలో హదీస్‌ను తెలియజేసేవారి యొక్క సంఖ్యను బట్టి, హదీస్‌లను ముఖ్యంగా రెండు కేటగిరిలుగా వర్గీకరించారు.

**1. ముతవాతిర్**

ఒక హదీస్‌ను తెలియజేసినవారి సంఖ్య అధికంగా ఉండి ఉంటే, ఆ హదీస్‌ను ముతవాతిర్ హదీస్ అంటారు. వారి సంఖ్య ఎంత ఎక్కువగా ఉంటుందంటే ఆ హదీస్‌ను అబద్ధమని చెప్పడం అసాధ్యమౌతుంది. ఈ విధంగా అన్ని దశలలోనూ చాలా ఎక్కువ మంది తెలియజేసిన హదీస్ - 'ముతవాతిర్' హదీస్. అంటే ఈ హదీస్‌ను ఎంతో మంది సహాబీలు మరియు ఎంతో మంది తాబయీలు, ఎంతో మంది తబే తాబయీలు మరియు ఎంతో మంది ముహద్దిస్‌లు తెలియజేశారని తెలుసుకోవాలి.

ఒక్కొక్క దశలో ఎక్కువమంది అని చెప్పడం జరిగింది. అంటే ఒక్కొక్క దశలో కనీసం ఎంతమంది ఉండాలి? ఈ విషయంలో ప్రత్యేకంగా ఎటువంటి నిర్వచనం లేదు. నలుగురా? 5? 7?...40?, 70 మంది? వీటిలో ఏదైనా కనీసంగా తీసుకోవచ్చు.

రోజుకి 5 సార్లు సలాత్(నమాజ్) చేయడం, రమదాన్ నెలలో ఉపవాసం ఉండటం, జకాత్ మరియు హజ్జ్ మరియు ఖుర్'ఆన్ పఠనం గురించి తెలిపే హదీస్‌లు ముతవాతిర్ హదీస్‌లకు ఉదాహరణలుగా చెప్పవచ్చు. ఎందుకంటే ఇటువంటి హదీస్‌లను ప్రవక్త(స)వారి దగ్గరి నుండి ఎందరో విన్నారు. ఆ విన్నవారి నుండి మరెందరో విన్నారు. పైన చెప్పిన విషయాలు ముస్లిమ్‌లకు సర్వసామాన్యమైన విషయాలు.

క్రింది హదీస్‌ను 62మంది ప్రవక్త(స) అనుచరులు తెలియజేశారు. అంతేకాకుండా ఈ హదీస్ తరతరాలుగా ముస్లిమ్‌లకు బాగా తెలిసినదే.

> **"ఎవరైతే ఓ అబద్ధాన్ని కల్పించి దానిని నాకు ఉద్దేశ్యపూర్వకంగా ఆపాదిస్తారో, అతని చోటు నరకం"**
> **(ఇబ్నెమాజా, సహీహ్, 37, పుస్తకం1, సంపుటి 1)**

'ముతవాతిర్'కు ఉదాహరణలుగా ఎన్నో చెప్పుకోవచ్చు. పరలోకంలోని 'కౌసర్' గురించి చెప్పే వర్ణన, ఖుర్'ఆన్ గ్రంథం 7 విధాలుగా అవతరించడం మరియు మత్తు కలిగించే ప్రతీదానిపై నిషేధం మొదలైన వాటిని తెలిపే హదీస్‌లన్నీ 'ముతవాతిర్' హదీస్‌లే.

**'ముహమ్మద్(స)వారిపై ప్రపంచవ్యాప్తంగా జరుగుచున్న దుష్ప్రచారం'** పుస్తకంలో ముహమ్మద్(స)వారు దూరంగా వెళ్ళడాన్ని తట్టుకోలేక మస్‌జిద్‌లోని ఓ మ్రాను ఏడ్వడం గురించి తెలియజేసే హదీస్‌ను అందించాము. ఆ హదీస్ కూడా ముతవాతిర్ హదీస్. ఆ సంఘటనకు అత్యధిక సంఖ్యలో సాక్షులున్నారు.

**2. అహద్**

ముతవాతిర్‌లో తెలియజేసినట్లు కాకుండా, హదీస్‌ను తెలియజేసిన వారి సంఖ్య తక్కువగా ఉంటే ఆ హదీస్‌లను **'అహద్'** హదీస్‌లు అని అంటారు. అయితే ఈ కేటగిరిని మరలా **గరీబ్, అజీజ్** మరియు **మష్‌హూర్**గా వర్గీకరించవచ్చు.

**(i) గరీబ్** : ఏదైనా ఓ దశలో ఇస్‌నాద్‌లో ఒకరు మాత్రమే ఉంటే, ఆ హదీస్‌ను గరీబ్ హదీస్ అంటారు. ఉదాహరణ:

**"ప్రయాణం కష్టంలో ఒక భాగం"**

పై హదీస్ యొక్క సనద్ ఇలా ఉంది :

**మాలిక్ → యహ్యాబిన్ సాలిహ్ → అబూహురైరా → ప్రవక్త(స)**

సనద్‌ను బట్టి పై హదీస్ సహీహ్.

చాలావరకు గరీబ్ హదీస్‌లు బలహీనమైనవి (దయీఫ్). ఒక విద్వాంసుడు ఇలా అభిప్రాయపడ్డారు, 'గరీబ్ హదీస్‌లను వ్రాయకండి. ఎందుకంటే అవి ఆమోదయోగ్యమైవి కావు. మరియు వాటిలో ఎక్కువ హదీస్‌లు బలహీనమైనవే'.

గరీబ్ వంటివే మరో రకం హదీస్‌లను **ఫర్ద్** అంటారు. ఇవి మూడు విధాలుగా తెలుస్తాయి.


1. 'గరీబ్' హదీస్ వంటిదే, (అంటే బాగా తెలిసిన ఇమామ్ దగ్గర నుండి ఒక వ్యక్తే ఉంటారు)
2. సనద్‌లో ఉన్నవారంతా ఒకే ప్రాంతానికి చెందినవారు.
3. ఉల్లేఖించినవారు ఒక ప్రాంతానికి చెందినవారైతే, దానిని తెలియజేసినవారు మరో ప్రాంతానికి చెందినవారు. అంటే మదీనాకు చెందిన వారు ఉల్లేఖిస్తే, మక్కాకు చెందినవారు తెలియజేశారు.

**(ii) అజీజ్ :** సనద్‌లోని ఏ దశలోనైనా ఇద్దరు ఉంటే, ఆ హదీస్‌ను అజీజ్ (అరుదు, బలమైనది) అని పిలుస్తారు.

ఉదాహరణకు అనస్(రజి)వారు ఉల్లేఖించారు: రసూలుల్లాహ్(స)

చెప్పారు, **"మీలో ఎవరైనా తన తండ్రికంటే, తన కుమారుని కంటే మరియు ప్రజలందరి కంటే ఎక్కువగా నన్ను ప్రేమించనంత వరకు విశ్వాసి కారు".**

అనస్(రజి)వారి నుండి **ఖతాదా** మరియు **అబ్దుల్ అజీజ్ బిన్ షు'ఐబ్** ఈ హదీస్‌ను రిపోర్ట్ చేశారు. మరలా వారిద్దరిలో, ఒక్కొక్కరి నుండి మరో ఇద్దరు ఉల్లేఖించారు. ఖతాదా నుండి (1) **షు'ఐబ్** మరియు (2) **స'ఇద్** మరియు అబ్దుల్ అజీజ్ నుండి (1) **ఇస్మాయీల్ బిన్ ఉలయ్యా** (ఇబ్నె ఉలయ్యా) మరియు (2) **అబ్దుల్ వారిస్** ఉల్లేఖించారు. మరలా వీరి నుండి ఆ హదీస్‌ను చాలామంది రిపోర్ట్ చేయడం జరిగింది.




పై పటాన్ని బట్టి క్రింద చెప్పిన విధంగా ఈ హదీస్ 4 ఉల్లేఖకుల చైన్లతో హదీస్ గ్రంథాలలో లభ్యమౌతుంది.

1. సు'ఐబ్ - ఖతాదా - అనస్ - ప్రవక్త(స)
2. స'ఇద్ - ఖతాదా - అనస్ - ప్రవక్త(స)
3. **ఇబ్నె ఉలయ్యా - అబ్దుల్ అజీజ్ - అనస్ - ప్రవక్త(స)**
   (సహీహ్ బుఖారీ, 15, సంపుటి 1)
4. అబ్దుల్ వారిస్ - అబ్దుల్ అజీజ్ - అనస్ - ప్రవక్త(స)

**(iii) మష్‌హూర్ :** ఒక హదీస్ **'అజీజ్'**గాను మరియు అదే సమయంలో అదే హదీస్ '**మష్‌హూర్**'గాను తెలిసే అవకాశం ఉంది. అంటే ఒక హదీస్ యొక్క 'సనద్'లో ఏదైనా దశలో ఇద్దరు ఉల్లేఖకులే ఉన్నారు. అయితే ఇతర దశలలో మాత్రం ఎక్కువమంది ఉన్నారు.

**"మనం చివరివారమేగాని పునరుత్థాన దినమున అందరికంటే ముందు ఉంటాము" (సహీహ్ బుఖారీ, 3486, పు. 60, అ.54, సం.4)**

ఈ హదీస్ మొదటి దశలో **'అజీజ్'** హదీస్ అవుతుంది. ఎందుకంటే మొదటి దశలో **హుజైఫా బిన్ అల్-యమన్** మరియు **అబూహురైరా** మాత్రమే దీనిని ఉల్లేఖించారు. అంటే ఆ దశలో ఇద్దరు సహాబాలు ఉన్నారు. ఆ తరువాత ఈ హదీస్ మష్‌హూర్ అయింది. ఏ విధంగానంటే, అబూహురైరా వారి నుండి 7గురు దీనిని తెలియజేశారు. అంటే ఈ రెండవ దశలో 7గురు ఉన్నారు.

ఈ హదీస్ వర్గీకరణలను రెండు మూడుసార్లు చదవవలసిన అవసరం ఉంది. అధ్యయనం చేయవలసి ఉంది. ఈ శీర్షికలో ప్రచురించిన ముందరి వ్యాసాలు కూడా మరలా రిఫర్ చేయడం వలన అర్థం చేసుకోవడం సులభం అవుతుంది.

చాలామంది సోదరులకుగాని, సోదరీమణులకుగాని హదీస్‌ల విషయంలో, ఆ హదీస్ **సహీహ్, దయీఫ్** మరియు **మౌదూ** అనే పేర్లను మాత్రమే బాగా విని ఉంటారు. అటువంటి వారు ఖుద్సీ, మర్ఫూ, ముస్నద్, ముర్సల్, మున్‌ఖతి, ముతవాతిర్ మొదలైన పేర్లు వినగానే, ఇన్ని రకాల హదీస్‌లు ఉన్నాయా? అని కంగారుపడవచ్చు.

సగటు ముస్లిమ్‌ను దృష్టిలో ఉంచుకుని ఓ ఉదాహరణ ద్వారా ఈ వర్గీకరణల గురించి, వాటి ప్రాముఖ్యత గురించి ఇక్కడ వివరించ దలిచాము.

మానవజాతిని వర్గీకరించవలసి వచ్చినప్పుడు ముఖ్యంగా రెండు రకాలుగా వర్గీకరిస్తారు. 1. పురుషుడు  2. స్త్రీ

అంటే ఎవరైనా ఓ మనిషిని 'పురుషుడు' అని గాని లేదా 'స్త్రీ' అని గాని చెబుతాము. కేవలం పురుషుడు అని చెప్పినంత మాత్రాన మనకు ఆ వ్యక్తిపై ఓ పూర్తి ఐడియా అంటూ ఏదీ ఏర్పడదు. అందుకని 'పురుషుడు' కేటగిరిని మరలా వర్గీకరిద్దాము.

1. తెల్లగా ఉన్నవారు 2. నల్లగా ఉన్నవారు 3. చామన ఛాయలో ఉన్నవారు. ఈ వర్గీకరణ పురుషుల రంగును బట్టి చేయడం జరిగింది.

అదే విధంగా (1) ఎత్తు 5 మరియు 6 అడుగులు మధ్యలో ఉన్న పురుషులు (2) ఎత్తు 4 మరియు 5 అడుగుల మధ్యలో ఉన్న పురుషులు. ఈ వర్గీకరణ ఎత్తును బట్టి చేయడం జరిగింది. ఈ విధంగా ఒకొక్క లక్షణంతో ఒకొక్క వర్గీకరణ చేయవచ్చు.

అయితే ముఖ్యమైన వర్గీకరణ పురుషుడు మరియు స్త్రీ అనే రెండు కేటగిరులు మాత్రమే.

ఒక మనిషి *పురుషుడు మరియు అతడు తెల్లగా ఉంటాడు మరియు అతని ఎత్తు 5 మరియు 6 అడుగుల మధ్యలో ఉంటుంది మరియు అతడు బలంగా ఉంటాడు* అని చెబితే మనకు ఆ వ్యక్తి గురించి ఓ స్పష్టమైన ఐడియా వస్తుంది.

ఇదే విధంగా 'హదీస్'లను ఎన్నో రకాలుగా వర్గీకరించారు. ప్రతీ వర్గీకరణకు ఓ పేరును పెట్టడం జరిగింది. ఈ వర్గీకరణ వలన ఈ హదీస్ గురించి ఓ సంపూర్ణమైన అభిప్రాయం మనలో ఏర్పడుతుంది. అయితే ఆ హదీస్‌ను స్వీకరించే విషయంలో చివరికి అది **సహీహ్?** లేదా **దయీఫ్?** లేదా **మౌదూ?** అని నిర్ణయించుకోవలసి ఉంటుంది.

ఎన్నో లక్షలమంది రోజూ న్యూస్ పేపర్ చదువుతారు. కాని అందరూ అన్ని వార్తలూ చదవరు. కొందరికి సినిమాల పేజీపై ఆసక్తి ఉంటే, కొందరికి స్టాక్ మార్కెట్, మరికొందరికి స్పోర్ట్స్ పై ఆసక్తి ఉంటుంది. కాబట్టి వారు వారి అభిరుచిని బట్టి ఆయా వార్తలనే చదువుతారు. కాబట్టి అన్ని వివరాలు ఇస్తేనే అది సంపూర్ణమైన న్యూస్ పేపర్ అవుతుంది.

ఇదే విధంగా శాంతిబాటలో మేము అందించే శీర్షికలన్నీ అందరికీ అవసరం కాదని ఎవరికైనా అనిపించవచ్చు. కాని ఈ శీర్షిక మీకు ప్రారంభంలో గజిబిజిగా అనిపించినా సరే, రెండు మూడు సార్లు చదివి అర్థం చేసుకుంటే, ఇన్షా అల్లాహ్ ఆసక్తి పెరుగుతుంది. ఇది చాలా ముఖ్యమైన సబ్జక్టు. కాబట్టి ఈ శీర్షిక విషయంలో మీకున్న సందేహాలను మాకు తెలియజేయండి. మీ సందేహాలను దృష్టిలో ఉంచుకుని ఈ శీర్షికను అందించడానికి, ఇన్షా అల్లాహ్ ప్రయత్నిస్తాము.

**(ఇన్షా అల్లాహ్ మరో వర్గీకరణ వచ్చే సంచికలో)**

# తిరిగి గూటికి

ప్రారంభంలో చెప్పుకున్నట్లు, దైవధర్మం అనేది ఏ ఒక్కరి సొత్తో కాదు. ప్రకృతిలాగే ఇది అందరికీ చెందుతుంది. ఈ వాస్తవాన్ని ఆలస్యంగానైనా సరే చాలా మంది తెలుసుకుంటున్నారు. ప్రస్తుతం ఇస్లాం (శాంతి) ధర్మం ప్రపంచంలో అత్యంత వేగంతో విస్తరిస్తుంది. ఈ ధర్మంపై బురద చల్లడానికి పాశ్చాత్యులు చేస్తున్న కృషి వలన, ఈ ధర్మవ్యాప్తి తగ్గడానికి బదులు దీని వేగం మరింత పెరుగుతూ వస్తుంది. ప్రస్తుతం అమెరికాలో ప్రతీ సంవత్సరం సగటున 20,000 మంది ఇస్లాం ధర్మంలో ప్రవేశిస్తున్నారు. మన దేశంలో, మన రాష్ట్రంలో కూడా ఈ దైవ ధర్మాన్ని చాలామంది తెలుసుకుని, ఈ ధర్మంలో ప్రవేశిస్తున్నారు. ఈ ధర్మాన్ని ఆచరించడం అనేది 'మత మార్పిడి' ఎంత మాత్రం కాదు. దారి తప్పిన సోదరి లేదా సోదరుడు తిరిగి తన పయనించవలసిన దారిని చేరుకోవడం లాంటిది. ఇలా తిరిగి గూటికి చేరుకున్న ఓ సోదరి గురించి గాని, ఓ సోదరుని గురించి గాని ఈ శీర్షికలో పరిచయం చేయబడుతుంది.

ఇస్లాం ధర్మంలో అడుగిడిన వీరిని కొత్త ముస్లింలు లేదా నవముస్లింలు లేదా నౌ ముస్లింలుగా అభిమానంతో తోటి ముస్లిం సోదరసమాజం పిలుస్తుంది. అయితే ఇస్లాం పట్ల అవగాహన లేని కొంతమంది 'ముస్లిం' సోదరులుగాని, విద్వాంసులుగాని ఈ నవముస్లింల పట్ల ప్రవర్తించే తీరు కొంతమేర అభ్యంతరకరంగానూ, ప్రియ ప్రవక్త ముహమ్మద్ (స) వారి సాంప్రదాయానికి వ్యతిరేకంగానూ ఉంటుంది. ఇస్లాం పట్ల అవగాహన ఉన్నవారు వీరిని ఆప్యాయంగా అక్కున చేర్చుకుంటున్నారు. దారి తప్పిన తమ సోదరుడు లేదా సోదరి తిరిగి తన గూటికి చేరుకున్నారన్న ఆనందోత్సాహం వారిలో స్పష్టంగా కనిపిస్తుంది.

ఇస్లాం ధర్మాన్ని అవగాహన చేసుకుంటే, ఏ ధర్మానికి చెందినవారైనా సరే, ఇది ఖచ్చితంగా దైవధర్మమనే విషయాన్ని అంగీకరిస్తారు. కాని ఈ ధర్మాన్ని ఆచరించడానికి మనో ధైర్యం కావాలి. దైవ భీతికలవారికి ఇది సునాయాసంగా లభిస్తుంది. కుటుంబానికో, సమాజానికో భయపడటం వల్లనో లేదా ఇతరత్రా కారణాల వల్లనో దైవధర్మానికి చాలామంది దూరంగా ఉన్నారు.

అలాగే కొత్తగా దైవధర్మంలోకి వచ్చిన వారికి చాలా సందేహాలుంటాయి. ఒక్కసారిగా అన్ని పుస్తకాలనూ వారు చదవలేరు. ధర్మావగాహనకు కూడా కొంత సమయం పడుతుంది. అనుభవజ్ఞుల వివరణలు వీరికి చాలా అవసరం. ఇంతకు ముందరి జీవితంలోని కొన్ని అభ్యంతరకరమైన అలవాట్లు నుండి దూరం కావడానికి మరికొందరికి సమయం పడుతుంది. వారు ప్రారంభంలో ఓ ప్రత్యేకావస్థకు గురై ఉంటారు. వారికి ప్రవక్తగారి సాంప్రదాయ ప్రకారం సౌమ్యంగా, సహనంతో అన్ని విషయాలను ఆకళింపు చేసుకొనేలా చేయడం, వారికి తోడుగా ఉండడం మనందరి బాధ్యత.

ఈ శీర్షిక ద్వారా వీలుని బట్టి నవ ముస్లిం సోదరులకు ఎదురయ్యే ఇబ్బందులు, వాటిని సునాయాసంగా అధిగమించడానికి ఖుర్ఆన్, హదీసుల వెలుగులో పరిష్కారాలను కూడా అందించే ప్రయత్నం జరుగుతుంది.

**నవ ముస్లిముల సమస్యలపై ప్రత్యేక వ్యాసం**

*బిడ్డ పుట్టిన వెంటనే నడవలేదు. తనకు సంబంధించిన అతి చిన్న పనులు కూడా స్వయంగా చేసుకోలేదు. ఆ బిడ్డకు అన్నీ దగ్గరుండి చూసుకునే వారొకరు కావాలి. ఆ బిడ్డ కాస్త పెద్దదై జ్ఞానాన్ని పొందిన తరువాత, ఇన్షా అల్లాహ్, ఓ మంచిబాటలో నడవగలుగుతుంది. అయితే ఇక్కడ గమనించవలసిన అతి ముఖ్యమైన విషయం ఏమిటంటే బిడ్డ పుట్టుకకు మరియు ఆ బిడ్డ జ్ఞాన సంపాదనకు మధ్య కాలంలో అవసరమయ్యే 'చేయూత' గురించి.*

*సున్నితమైన ఆ చిన్నారికి ఏ చిన్న కష్టమైనా సరే దానికి అది చాలా పెద్దదే కదా! చూసే మనకు మాత్రం అది కష్టంలా అనిపించదు. ఎందుకంటే మనం ఆ స్థాయిని ఎప్పుడో దాటిపోయాము కనుక. అయినాసరే, ఆ బిడ్డకు ఏ కష్టం కలుగకుండా బిడ్డ తొలిరోజులలో చాలా అపురూపంగా చూసుకోబడుతుంది. తన బిడ్డను ఓ తల్లి అపురూపంగా చూసుకోవడంలో ఆశ్చర్యమేమీలేదు. కాని ఏ తల్లి అయినా సరే, తన బిడ్డనే కాదు నెలలు నిండని ఏ బిడ్డ విషయంలోనైనా సరే సున్నితంగానే ప్రవర్తిస్తుంది. ఏడిస్తే లాలిస్తుంది. తను చేయగలిగినవన్నీ చేస్తుంది. ఎటువంటి వారైనా సరే సాధారణంగా పసిబిడ్డ వ్యవహారంలో కఠినంగా ప్రవర్తించరు.*

*ఇదే విధంగా అల్లాహ్ అనుగ్రహంతో 'ఇస్లామ్'ని స్వీకరించిన కొత్త ముస్లిమ్ (నౌముస్లిమ్) పరిస్థితి కూడా దాదాపు అప్పుడే పుట్టిన ఓ పసిబిడ్డ మాదిరిగానే ఉంటుంది.*

*ఏకైక ఆరాధ్యుడు 'అల్లాహ్'యేనని విశ్వసించి, ముహమ్మద్(స)వారిని ఆయన సందేశహరుడుగా విశ్వసించిన నవముస్లిములకు ముందుగా ఓ సున్నితమైన శిక్షణ కావాలి. ఈ శిక్షణ అందరికీ ఒకే విధంగా ఉండక పోవచ్చు. కొందరికి తక్కువ సమయం పడితే, మరికొందరికి ఎక్కువ కాలం శిక్షణ ఇవ్వవలసి ఉంటుంది. ఆ తరువాత వారు ఖుర్ఆన్ మరియు ముహమ్మద్(స)వారి బోధనల వెలుగులో స్వీయ శిక్షణను, ఇన్షా అల్లాహ్ పొందగలుగుతారు.*

*తల్లి బిడ్డకు జన్మనిస్తుంది. 9 నెలలు గర్భంలో మోసిన తరువాత బిడ్డ జన్మించాక ఆ బిడ్డను అలా వదిలేసి వెళ్ళిపోతే, ఆ బిడ్డ అనాథ అయిపోతుంది.*

కొత్తగా ఇస్లామ్‌లో ప్రవేశించిన వారి పరిస్థితి కూడా పసిబిడ్డ వంటిదేనని చెప్పుకున్నాం. మనస్ఫూర్తిగా ఇస్లామ్ స్వీకరించిన వారి జీవితంలో అప్పటివరకూ జరిగిన పాపాలు క్షమించబడతాయి. పుణ్యాలు మాత్రం మిగిలి ఉంటాయి. కాబట్టి అప్పుడే పుట్టిన పసిబిడ్డ ఖాతాలో ఏ విధంగానైతే పాపాలు ఉండవో, అదే విధంగా నవముస్లిమ్ జీవితం కూడా ఓ పసిబిడ్డలా పాపరహితంగా ప్రారంభ మౌతుంది.

మరి ఈ నవముస్లిమ్‌ని మనం అనాథగా వదిలేయకూడదు. అల్లాహ్‌కు మరియు ఆయన ప్రవక్తకు విధేయులైన విశ్వాసులు వారికి తోడుగా ఉండాలి. కాని నేడు సమాజంలో ఆ పరిస్థితి అన్ని ప్రాంతాలలోనూ లేదు. కేవలం కొందరు మాత్రమే ఈ నవముస్లిములకు తోడుగా ఉంటున్నారు.

ఇస్లామ్ అంటే కనీస అవగాహన లేని మెజారిటీ ముస్లిమ్ సమాజం ఇస్లామ్(శాంతి) బాటలో అడుగు తీసి అడుగు వెయ్యలేని పరిస్థితిలో ఉంటే, ఇక ఈ కొత్తవారి చేయి పట్టుకుని ఎలా నడిపించ గలుగుతుంది?

నిజమే! స్వయంగానే నడవలేనివారు, మరొకరు నడవడానికి చేయూత ఎలా ఇవ్వగలరు?

ఈ నవ ముస్లిముల విషయాన్ని ఆలిమ్‌లు అందరికీ తెలియజేయాలి. కాని దురదృష్టవశాత్తు ఆలిమ్‌లలో చాలామంది పరిస్థితి దీనంగా ఉంది. వారికి తమ బాధలు చెప్పుకోవడానికే అవకాశం లేదు. వారికి సరియైన విధంగా జీతభత్యాలను ఏర్పాటు చేయకుండా ఆలిమ్‌ని ఓ తక్కువస్థాయి వ్యక్తిగా సమాజం అగౌరపరస్తున్న నేటి పరిస్థితులలో, ప్రజలకు ఏది ఇష్టమో, దాని గురించి మాత్రమే మాట్లాడ వలసిన పరిస్థితి ఆలిమ్‌కి ఏర్పడింది.

మా శ్రేయోభిలాషి 'అబ్దుల్ అజీమ్ మదనీ'గారు ముస్లిమ్ యువతకు శిక్షణ ఇవ్వడానికి విశాఖపట్నం వచ్చినప్పుడు, శిక్షణలో భాగంగా 'అన్సార్ మరియు ముహాజరీన్'ల విషయాన్ని చెబుతూ, ఇస్లామ్ కొరకు సమస్తమూ వదులుకుని కట్టుబట్టలతో మదీనా చేరిన ముస్లిములకు (ముహాజరీన్‌లకు), అక్కడి ముస్లిములు (అన్సారులు) ఏ విధంగా ఆదరించారో స్పష్టంగా వివరించారు.

''అన్సారులు ఆదరించినట్లే నేటి ముస్లిములు నవ ముస్లిములను ఎందుకు ఆదరించడం లేదు?'' అని ప్రశ్నించారు. అన్సారులు ముహాజరీన్‌లకు తమ ఆస్తిలో సగభాగం ఇచ్చారు, వివాహాలు చేశారు. మరి నేటి నవ ముస్లిములకు మనం ఏ స్థాయిలో సహకరిస్తున్నామో ఆలోచించాలి? ఇక్కడ ఆస్తిలో భాగమివ్వమని కాదు. మన ప్రేమానురాగాలు వారిపై ఏ స్థాయిలో ఉన్నాయో ఆలోచన చేయమని మాత్రమే.

అయితే ఇక్కడ మరో చీకటి కోణం కూడా ఉంది. దానిని ఇక్కడ చెప్పకపోతే వాస్తవాన్ని కప్పిపుచ్చినట్లు అవుతుంది. ఈ వ్యాసం చివర అందించిన కొన్ని సమస్యల గురించి పాఠకులకు అర్థం కావాలంటే ఇది తప్పనిసరిగా తెలియజేయవలసి ఉంది.

**నిజం కొందరికి చేదుగానే ఉంటుంది.** ఏదైనా వ్యాధి బారిన పడిన వారికి చేదు మాత్ర ఇస్తే, **అది చేదుగా ఉన్నా మింగాలి**, తప్పదు. చేదు మాత్ర ఇవ్వడం ద్వారా మన సోదరుణ్ణి బాధపెడుతున్నామనే భావన ఏ ఒక్కరిలో ఎంతమాత్రము ఉండదు.

## చీకటి కోణం

నేడు 'దావత్' పేరుతో ఓ పూజారి వ్యవస్థ ప్రారంభమైంది. ఆ పూజారులు (దాయీలు) తమ సంపాదన కొరకు తప్పుడు దారిలో ఇహలోక ప్రయోజనాలు చూపించి కొందరిని నవ ముస్లిములుగా చేస్తున్నారు. నిజానికి వారు మనస్ఫూర్తిగా ఇస్లామ్ స్వీకరించినవారు కాదు. అటువంటివారి ఫొటోలను, వీడియోలను సాక్ష్యంగా పంపించి ఫండింగ్ ఏజెన్సీల నుండి దాయీలు డబ్బు పొందుతున్నారు. డబ్బు అందగానే వారి పని అయిపోయినట్లే. వారికి రావలిసిన డబ్బు ముట్టింది. వారు తయారుచేసిన నవముస్లిములను గాలికి వదిలేస్తున్నారు. ఇటువంటి వారి ప్రవర్తన చూసిన తరువాత, ఒరిజినల్ నవముస్లిములను కూడా తోటి ముస్లిమ్ సోదరులు అనుమానించే పరిస్థితి ఏర్పడింది.

ఇదే సమయంలో ఓ మతవర్గం వారితో చేతులు కలిపి నకిలీ ముస్లిమ్ సంస్థలు నవముస్లిములను ఉత్పత్తి చేసే ఫ్యాక్టరీలు ఏర్పాటు చేశాయి. ఈ ఉత్పత్తిని ఇస్లామ్‌కి వ్యతిరేకంగా వాడుతున్నారు. ఇదంతా డబ్బు కొరకే.

ముస్లిమ్ సమాజంలో ఐక్యతను నాశనం చేసి, వారికి జ్ఞానం అందకుండా చేయడం ద్వారా, ఇటువంటి దుర్మార్గులు (నకిలీ సంస్థ స్థాపకులు) ఎందరో తమ స్వార్థ ప్రయోజనాల కోసం సమాజంలో సమస్యలు సృష్టిస్తున్నారు.

ఈ చీకటి కోణపు వ్యాపారం మనరాష్ట్రంలోనే ఎక్కువుగా జరుగుతున్నట్లు తెలుస్తుంది. **ఈ చీకటి కోణం గురించి ఇక్కడ చెప్పడానికి గల కారణం ఈ వ్యాసం చివరిలో తెలియజేశాము.**

## శిక్షణ

నవముస్లిములకు శిక్షణ ఇవ్వాలి. ముహమ్మద్(స)వారు ఇస్లామ్ స్వీకరించిన కొత్తవారికి వెంటనే శిక్షణ కొరకు ఏర్పాటు చేసేవారు. వారికి నైతికంగా సహకారాన్ని అందించాలి. వారిపై మనం చూపే ఆప్యాయత కూడా కేవలం అల్లాహ్ కొరకు చేస్తున్నామని తెలుసుకోవాలి. అల్లాహ్ మార్గంలోకి వారు వచ్చేసినంత మాత్రాన సరిపోదు. ఆచరణ ముఖ్యంగా ఉండాలి. **మార్గం తెలిసిపోయిందని కూర్చుంటే, ఆ మార్గంలో నడవకుండా మనం గమ్యాన్ని ఎలా చేరుకుంటాము?**

ఇప్పటికే ప్రపంచంలో 150 కోట్లమంది ముస్లిములున్నారు. సంఖ్య చాలా ఎక్కువేగాని సంఖ్య ముఖ్యం గాదు. ఈ 150 కోట్లలో ఎందరికి ఇస్లామ్ గురించి తెలుసు? **ఎంతమంది ఇస్లామ్ ప్రకారం జీవిస్తున్నారు?** కేవలం అల్లాహ్ మార్గం వైపు పిలిచి లేదా అల్లాహ్ మార్గంవైపు స్వయంగా వచ్చిన వారితో ముస్లిముల సంఖ్య పెంచుకుంటే సరిపోతుందా?

నవముస్లిములకైనా, ముస్లిమ్ కుటుంబంలో పుట్టిన వారికైనా ధార్మిక శిక్షణ తప్పనిసరి.

**సమస్యలు :**

ఇస్లామ్ స్వీకరించిన వారికి కొన్ని సమాజాలలో చాలా సమస్యలు ఎదురవుతున్నాయి. ఈ వ్యాసం వ్రాసిన వారిలో మరో ధర్మం నుండి ఇస్లామ్ స్వీకరించినవారు ఒకరున్నారు. కాని ఇస్లామ్ స్వీకరించడం వలన అతనికి సమాజంనుండి ఏ చిన్న సమస్య కూడా ఉత్పన్నం కాలేదు. అదే విధంగా మా టీమ్‌లోని నవముస్లిములకు కూడా చెప్పుకోదగ్గ సమస్యలేమీ ఎదురు కాలేదు.

అయితే తీవ్రమైన సమస్యలకు గురియైన నవముస్లిములు చాలామందే ఉన్నారు. అయితే వారు వాటిని అల్లాహ్ అనుగ్రహంతో అధిగమించి గౌరవించబడ్డారు. '**శాంతిబాట**'లో ఈ శీర్షిక కొరకు ఎందరో సోదరీమణుల జీవితాల గురించి అధ్యయనం చేసేటప్పుడు, 'అమినా అస్సిల్మి'గారి జీవితం గురించి తెలిసింది. ఆమె గురించి చదువు తున్నప్పుడు కన్నీరు ఆగలేదు. ఆ సోదరికి ఎదురైన కష్టాలతో పోలిస్తే, ఏ కష్టమైనా తక్కువే అనిపించింది. కాబట్టి 'శాంతిబాట' ప్రారంభ సంచికలో ఆమె గురించే తెలియజేయాలని ఎంతోకాలం పాటు ఆమె ఎడ్రస్ కొరకు ఆమె అనుమతి కొరకు ప్రయత్నించాము. ఎట్టకేలకు ఆమె అనుమతి లభించింది. మొదటి సంచికలో ఇదే శీర్షికలో ఆమె వృత్తాంతాన్ని ప్రారంభ వ్యాసంగా అందించాము. ఆమె అమెరికన్.

ఆమె 'ఇస్లాం' స్వీకరించి నందువలన ఆమెను భర్త వదిలేశాడు. వృత్తిరీత్యా ఎంతో పేరున్న ఆమె బురఖా వేయగానే ఉద్యోగం నుండి తీసివేశారు. "పిల్లలు కావాలా? ఇస్లామ్ కావాలా?" తేల్చు కోవాలని కోర్టు ఆమెకు కేవలం 30 నిమిషాల సమయం ఇచ్చింది. అందరూ ఆమెకు దూరమయ్యారు. రకరకాల మాటలతో ఆమెకు బాధ కలిగించారు. అల్లాహ్ కొరకు అన్ని కష్టాలను భరించడానికే ఆ సోదరి సిద్ధపడ్డారు. అల్లాహ్ అనుగ్రహం ఆమెలో ఆ ధైర్యాన్ని కలిగించింది.

ఆమె నుండి దూరమైన వారందరూ తిరిగి ఆమెకు దగ్గరయ్యారు. ముందరికంటే ఎంతో గౌరవంతో, ప్రేమతో ఆమెకు దగ్గరయ్యారు. ఆమెను పిచ్చాసుపత్రిలో జాయిన్ చెయ్యాలని వ్యాఖ్యానించినవారు సైతం ఆ తరువాత 'అమెరికాలోనే నిజమైన స్వేచ్ఛగల స్త్రీవి నీవే'అని ఆ సోదరిని అభినందించారు.

ఆమెకు బోన్ కాన్సర్ అని తెలిసింది. ఆ కష్టాన్ని కూడా అల్లాహ్ అనుగ్రహంగానే ఆ సోదరి స్వీకరించారు. ఒక సంవత్సర కాలంలో చనిపోతారని డాక్టర్లు చెప్పారు. కాని ఆ తరువాత ఓ 16 సంవత్సరాల కంటే ఎక్కువ కాలం, ఇస్లామ్ ధర్మం గురించి అందరికీ తెలియజేస్తూ ప్రపంచంలో ఎందరికో ప్రేమ పాత్రురాలయ్యారు.

ఆమె అనుమతితో 'శాంతిబాట'లో ఆమె జీవితం గురించి ప్రచురించాక, రాష్ట్రం నలుమూలలనుండి విశేషంగా స్పందన వచ్చింది. ఆమె జీవితం గురించి చదివిన వారందరికి కన్నీరు ఉబికింది. 'ఆమె కష్టాలకు మించి ఇంకేమి కష్టాలుంటాయి, మన కష్టాలు ఆమె కష్టాల ముందు ఏమీకాదు' అనే భావనను పాఠకులు వ్యక్తం చేశారు.

ఆమె ఇస్లామ్ గురించి పలికిన పలుకులు మా హృదయాలలో అలాగే ఉన్నాయి. అవి జ్ఞాపకమొచ్చిన ప్రతీసారి కన్నీరు వస్తుంది. ఈ కన్నీరే ఆమెపై అల్లాహ్ అనుగ్రహం ఎంత ఉందో తెలుపుతుంది.

'ఇస్లామ్'కు సంబంధించి ఓ కార్యక్రమానికి హాజరవడానికి, ఆమె తన కుమారునితో కారులో బయలుదేరారు. రాత్రివేళ ఆ కారుకు యాక్సిడెంట్ అయి ఆమె మరణించారు. మన రాష్ట్రంలోని రెండు మస్‌జిద్‌లలో మేము ఈ విషయాన్ని చెప్పగానే ఆమె గురించి దువా చేశారు. 'శాంతిబాట' పాఠకులెందరో దువా చేశారు.

**సమస్యలు వస్తాయి. ఇస్లామ్‌ని అర్థం చేసుకుంటే వాటిని తృణ ప్రాయంగా ఎదిరించగలిగే ధైర్యమూ వస్తుంది.**

రెండవ సంచికలో మరో సోదరి రుబా డి.ఖేవర్ గారి గురించి తెలిపాము. ఆమెను కుటుంబ సభ్యులు కొట్టారు. ఆమె చాలా అవమానాలకి కూడా గురి అయ్యారు. కాని ముహమ్మద్(స)వారికి జరిగిన అవమానాలతో పోలిస్తే, తనకు జరిగింది ఏమీ కాదని ఆమె ఆ అవమానాలను కొట్టిపారేశారు.

తల్లిదండ్రులపై ఆధారపడిన కొందరు నవముస్లిములకి, కొన్ని సమాజ పరిస్థితులలో జీవిస్తున్న నవముస్లిములకి, చిన్న వయస్సులో ఈ ధర్మాన్ని స్వీకరించిన వారికి నేడు ఎన్నో సమస్యలు ఎదురౌతున్నాయి.

పై సోదరీమణుల వలే ఇస్లామ్‌ని వారు అధ్యయనం చేయనప్పుడు, సమస్యలను చూసి వారు చలించవచ్చు. **అటువంటి వారికి మన ఆప్యాయత, సహకారం చాలా అవసరం.**

అందుకొరకు నవముస్లిముల కొరకు ప్రత్యేక మస్‌జిద్‌లు, తెలుగు మాట్లాడేవారికి ప్రత్యేక మస్‌జిద్‌లు ఏర్పాటు చేయవలసిన అవసరం ఎంతమాత్రం లేదు. అలా చేస్తే వారిని వేరు చేసినట్లే అవుతుంది. వారు మనవారే! మనతోనే ఉండాలి. మనమంతా ఒకే మస్‌జిద్‌లో భుజం భుజం కలిపి సలాత్ చేయాలి.

మాకొక ఈ మెయిల్ అందింది. దానిలో నవముస్లిముల సమస్యల గురించి ఓ సోదరుడి ఆవేదన ఉంది. ఆ నవముస్లిమ్ సోదరుడు తెలియజేసిన సమస్యలను ఇక్కడ అందిస్తున్నాము.

ఆ సమస్యలను చదివి, ఆ సమస్యల పరిష్కారం కొరకు మీరు కూడా ఒకసారి ఆలోచించండి!

ఆ సమస్యలపై ఇస్లాం చూపించిన పరిష్కారమార్గంపై ఓ ప్రత్యేక వ్యాసాన్ని ఇన్షాఅల్లాహ్ వచ్చేసంచికలో అందిస్తాము.

**క్రింద పేర్కొన్న సమస్యలు ఓ సోదరుడు అందించినవి మాత్రమే. శాంతిబాట స్వంతంగా వ్రాసినవి కావు**

**ప్రారంభం**

- ప్రారంభంలో దావా కోసం చాలా ఆసక్తి చూపుతారు. వారి పని అయిపోగానే మరలా కనిపించరు. నవముస్లిములకు ముఖ్యమైన సహాయ సహకారాలను అందించడం మర్చిపోతారు.
- సత్యాన్ని స్వీకరించిన వ్యక్తి, అకస్మాత్తుగా తాను ఎన్నో కష్టాలతో యుద్ధరంగంలో నిలబడినట్లు భావిస్తాడు. అంటే ప్రారంభ దశలోనే,

**విశ్వాసం ఇంకా బలపడకుండానే** అతను ఒంటరివాడై పోతున్న భావన. అందువలన కొందరు దుర్మార్గుల చేతిలో పడిపోవచ్చు మరియు అల్‌హమ్‌దులిల్లాహ్ వారు తిరిగి సత్యం వైపుకు రావచ్చు.

**ధర్మాన్ని నేర్చుకోవడం మరియు దానిని ఆచరించడం**

- మంచి గురువుల చేతుల్లో పడినప్పుడు, ఇతర ముస్లిమ్ సోదర సోదరీమణులు సహకరించడం వలన ధర్మం గురించి తెలుసుకునే పుస్తకాలు లభ్యమౌతున్నాయి లేకపోతే వాటి కొరకు ఇబ్బంది పడక తప్పదు. ఇంటర్‌నెట్ ద్వారా కొంత సమాచారం దొరుకుతుంది.
- ఇస్లామీయ పుస్తకాల పట్ల మరియు ఇస్లామీయ శిక్షణపట్ల వారికి చాలా ఆసక్తి ఉంటుంది. కాని వాటిని కొనుక్కోవడం కొందరికి ఆర్థికంగా ఇబ్బందే. అంతేకాకుండా అటువంటి పుస్తకాలను ఇంట్లో తెలియకుండా ఉంచాలి. ఎందుకంటే, వారిలో చాలామంది కాలేజీలో చదువుకునే కుర్రాళ్ళే. వారి పాకెట్‌మనీ కూడా అంతంత మాత్రమే.

**కుటుంబ జీవితం**

- చాలామంది నౌముస్లిములు కొత్తలో వారి ఆచరణను రహస్యంగా ఉంచుతారు. వారిలో కొందరు ఇంకా విద్యార్థులే. కొందరు జీవితంలో ఇంకా స్థిరపడాలి. కొందరికి ఇంకా పెళ్లి కావలిసి ఉంటుంది. బయట ఒక వ్యక్తిలా లోపల మరో వ్యక్తిలా రెండు వ్యక్తులుగా జీవించడం వారికి ఒక్కొక్కసారి నిరాశకు కారణ మవుతుంది.

**రహస్యంగా సలాత్**

- ఇంటిలో తనకు ఓ ప్రత్యేకగది ఉంటే ప్రార్థనకు సమస్య లేదు. కాని ఇంట్లో పెద్దవారితో ఒకే గదిలో కలిసి ఉన్నట్లయితే సమస్యే. వుజూ చేసేటప్పుడు ఇంట్లో వారికి ఒకొక్కసారి తెలిసి పోవచ్చు. అయితే ఇవి ఇంట్లో ఉండే సౌకర్యాలపై ఆధారపడి ఉంటుంది.
- లేకపోతే సలాత్ (నమాజ్) చేసుకోవడానికి తగిన సమయం దొరికే వరకూ వెయిట్ చెయ్యాలి.
- ఇటువంటి నిరీక్షణ వలన అశాంతిగా ఉంటుంది.
- అంటే ప్రశాంతంగా సలాత్ చేసుకోవడం కష్టంతో కూడుకున్న పని.

**ఉపవాసం**

- ఇంటినుండి పనికోసమో లేక ఇతరత్రా బయటికి వెళ్ళగలిగేవారు అదృష్టవంతులే.
- ఇంటిలోనే ఉంటే రమదాన్ నెలలో రోజా ఉపవాసంతో ఇంటివారికి తెలియకుండా వ్యవహరించడం చాలా కష్టమైన పని.
- రమదాన్ నెల అంతా ఉపవాసమున్న సరే, అందరిలాగే పండగ సెలబ్రేట్ చేసుకునే వీలుండదు.

**హిజాబ్ ధరించడం**

- సిస్టర్స్ అయితే ఎక్కడో రహస్యంగా హిజాబ్ ధరించి, ఇంటి సమీపంలోకి వచ్చేసరికి వాటిని తీసివేయడం. కాని ఇతరుల ముందు ఇలా తీసేయడం వారికి ఎంత కలవరంగా ఉంటుందో!
- బంధువులు ఇంటికి వస్తారు. వారికి తెలియదు మన పద్ధతి మారిందని. మహ్రామ్ పురుషుడు కాకపోతే ఏకాంతంగా మాట్లాడ కూడదు. కాని ఇలా జరుగుతున్నప్పుడు లోపల ఆవేదన కలుగుతూ ఉంటుంది.

**పుస్తకాలు**

- మనం చదివింది ప్రామాణికమా? కాదా? అనేది కూడా సందేహం కలుగుతుంటుంది.

**తెలిసాక జరిగే పరిణామాలు**

- ఇస్లామ్ స్వీకరించామని తెలిసిపోతే మొదట్లో జోక్‌గా భావిస్తారు.
- కాని అది ధృవపడితే, ఎవరితో మాట్లాడ నివ్వకుండా ఇంటిలో నిర్బంధిస్తారు.
- మా మొబైల్‌ను లాక్కుంటారు.
- సలాత్ చేసుకోనివ్వరు
- మా చదువులను ఆపివెయ్యవలసిన పరిస్థితి ఎదురవుతుంది.
- ముస్లిమేతరులను వివాహం చేసుకోడానికి బలవంత పెడతారు (నవ ముస్లిమ్ సిస్టర్స్‌కి ఇది చాలా కష్టమైన వ్యవహారం)
- మానసికంగా, శారీరకంగా, భావోద్వేగంతో, సైకలాజికల్‌గా కూడా మాపై దాడి జరుగుతుంది.
- మేమెందుకు శిక్షించబడతున్నామో అర్థం కాదు. ఈ ఆధునిక ప్రపంచంలో **బిడ్డ వ్యభిచారం చేస్తే తల్లిదండ్రులు క్షమించవచ్చు** గాని, అదే **బిడ్డ నిజాయీతీగా, ధర్మపరాయణుడైతే ఎందుకు తట్టుకోలేక పోతున్నారు?**

**తప్పించుకోవడం**

**ఇవి తట్టుకోలేక బయటకి వచ్చేస్తే**

- మా దగ్గర డబ్బు, ఉండడానికి ఇల్లు లేవు. ఒంటరిగా ఉండాలి.
- **ముస్లిమ్‌ల దగ్గరికి వెళితే, వారు మా విశ్వాసం నిజమా? కాదా? అని సందేహ పడుతున్నారు.** (ఈ విషయం గురించి అర్థం కావడానికే చీకటి కోణం గురించి ముందుగా ఈ వ్యాసంలో చెప్పవలసి వచ్చింది)
- ఎమోషనల్ బ్లాక్‌మెయిల్ కూడా మొదలవుతుంది. కుటుంబ సభ్యులు ఆత్మహత్య చేసుకుంటామంటారు.

**వివాహం**

- కొత్తలో ఎక్కువమంది ముస్లిములతో సంబంధమేర్పడదు. అందరూ కొత్తే!
- సరియైన జీవిత భాగస్వామి దొరకడం కష్టం.
- ముస్లిములు తమ సంతానాన్ని నవముస్లిములకు ఇవ్వడానికి ముందుకు రారు.

**ఏ విధంగా మీరు మాకు సహాయం చేస్తారు?**

ఓ నవముస్లిమ్ సోదరుని ఆవేదన చదివారు కదా!

**నవముస్లిముల సమస్యలను దూరం చేసే విషయంలో మీరేమీ చేయాలనుకుంటున్నారో ఆలోచించండి. మా స్పందన మరియు పరిష్కార మార్గాన్ని ఇన్షా అల్లాహ్ వచ్చే సంచికలో అందిస్తాము.**




సల్లల్లాహు అలైహి వసల్లమ్ (అల్లాహ్ నుండి మీపై శుభాశీస్సులు మరియు శాంతి కలుగుగాక!)

## సకల లోకాలకు కారుణ్యం (రహమతల్లిల్ ఆలమీన్)

4

**ప్రవక్త(స)వారి జననానికి ముందు జరిగిన కొన్ని ముఖ్య సంఘటనలు**

ఇవి ఇస్లామ్‌తో ప్రత్యక్ష సంబంధమున్న సంఘటనలు. ఇస్లామ్ పూర్వపు అజ్ఞాన కాలపు చీకటి రోజులలో, అరేబియాలో మరియు మొత్తం ప్రపంచంలో జరగబోవు పెనుమార్పుకు సంకేతంగా ఈ సంఘటనలను చెప్పుకోవచ్చు.

నిజంగా భూమి అంధకారంలో మునిగి ఉన్న కాలమది. కాని ఈ విశ్వానికి సంబంధించి అల్లాహ్ యొక్క విధానాలేమిటంటే, కష్టం తరువాత సుఖం, చీకటి తరువాత వెలుగు మరియు ఆపద తరువాత ఉపశమనం.

### 1. జమ్ జమ్ బావి

క్రిందటి సంచికలో హాజిరా వారి త్యాగం గురించి జమ్‌జమ్ నీటి గురించి తెలియజేశాము. అల్లాహ్ యొక్క అనుగ్రహం జమ్‌జమ్ నీరు. మాతృమూర్తి హాజిరావారి విశ్వాసాన్ని మరియు త్యాగాన్ని జమ్‌జమ్ నీరు గుర్తు చేస్తూనే ఉంటుంది. తరువాయి తరాలలో కొందరు దుర్మార్గంతో ఈ జమ్‌జమ్ నీటి బావిని (నుయ్యి-well) కప్పివేశారు. అబ్దుల్ ముత్తలిబ్ గారి కాలంలో మరలా ఈ నూతిని తవ్వడం జరిగింది.

అబ్దుల్ ముత్తలిబ్ గారు ముహమ్మద్(స)వారి తాతయ్యగారు.

అలీ బిన్ అబీతాలిబ్(రజి) ద్వారా తెలియజేయబడిన విషయం: **అబ్దుల్ ముత్తలిబ్** చెప్పారు, "నేను అల్-హిజ్ర్ దగ్గర నిద్రపోతుండగా (ఉత్తర దిశగా ఉండే కాబా యొక్క భాగం), ఎవరో నా దగ్గరకి వచ్చి చెప్పారు, "**తైబా**ని తవ్వు" (తైబా అనే పదం తయ్యబ్(మంచి) అనే పదం నుండి వచ్చింది). 'తైబా అంటే ఏమిటి?' నేను అడిగాను. కాని అతను వెళ్ళిపోయాడు.

ఆ తరువాత రోజు తిరిగి నేను పడుకునే చోటు(అల్-హిజ్ర్)కి వచ్చాను. నేను అక్కడ నిద్ర పోయినప్పుడు, అతను (మరలా) నా దగ్గరకు వచ్చి చెప్పాడు, "**బర్రా**ని తవ్వు" (బర్రా అనే పదం 'బిర్ర్' నుండి వచ్చింది. దానర్థం మంచి మరియు స్వచ్ఛం). 'బర్రా ఏమిటి?' నేను అడిగాను. కాని అతను (మరలా) వెళ్ళిపోయాడు.

ఆ తరువాతి రోజు, నేను పడుకునే చోటుకి వెళ్ళాను. మరియు నేను అక్కడ నిద్రలో ఉన్నప్పుడు, అతను నా దగ్గరకొచ్చి చెప్పాడు, "**అల్-మద్‌నూనహ్**ని తవ్వు". కాని అతను వెళ్ళిపోయాడు (మరలా నాకు సమాధానం చెప్పకుండానే). ఆ తరువాయి రోజు, తిరిగి నేను పడుకునే చోటుకి వచ్చాను.

నేను అక్కడ పడుకున్న తరువాత, అతను నా దగ్గరికి వచ్చి చెప్పాడు, "**జమ్‌జమ్**ని తవ్వు". 'మరి జమ్‌జమ్ ఏమిటి?' నేను అడిగాను. అతను చెప్పాడు, "అది ఎన్నటికీ ఎండిపోని(బావి) మరియు అది అవమానింప బడదు (అంటే అది ఎప్పుడూ తాజాగా మరియు మంచిగా ఉంటుంది). అది గొప్ప యాత్రికుల పానీయం (హజ్జ్ కొరకు వచ్చే యాత్రికులకు). మరియు అది రక్తానికి మరియు పేడకు మధ్యలో ఉంటుంది. (కాబట్టి వెళ్ళి వెతుకు), అల్-ఆసిమ్ కాకి కంటి రంధ్రంలో (అల్-ఆసిమ్ కాకి అంటే కాళ్ళలో తెలుపు ఉన్న కాకి), చీమల ఊరి దగ్గర.

జమ్‌జమ్ బావి యొక్క ప్రాముఖ్యత మరియు దాని చోటు గురించి తెలిశాక గొడ్డలితో దాని కొరకు అన్వేషణ ప్రారంభించారు. ఆయన తనతో పాటు హారిస్ బిన్ అబ్దుల్ ముత్తలిబ్‌ను కూడా తీసుకెళ్ళారు. హారిస్ ఆ సమయంలో అబ్దుల్ ముత్తలిబ్‌గారి యొక్క ఏకైక కుమారుడు. అబ్దుల్ ముత్తలిబ్ బావి యొక్క అంచును చూడగానే, 'అల్లాహు అక్బర్' (అల్లాహ్ గొప్పవాడు) అని గట్టిగా అల్లాహ్‌ను కీర్తించారు.

అతని మాటల శబ్దం వినగానే ఖురైషీయులకు అర్థమైపోయింది. అతను వెతుకుతున్నది అతను కనుగొన్నారని. కాబట్టి వారు అతని దగ్గరకి వెళ్ళారు.

వారు అన్నారు, "ఓ అబ్దుల్ ముత్తలిబ్! వాస్తవానికి ఈ బావి మన తండ్రి ఇస్మాయీల్(అ)వారిది. మాకు కూడా దీనిపై హక్కు ఉంది. కాబట్టి ఇందులో మమ్మల్ని కూడా భాగస్వాములుగా చేసుకోండి" (ఇస్మాయీల్(అ) వీరందరికీ పితామహుడు. అందుకే ఇది ఆయనొక్కరికే స్వంతం కాకుండా తమను కూడా భాగస్వాములుగా చేసుకోవాలని)

ఆయన చెప్పారు, "నేను ఆ విధంగా చేయను. ఈ విషయం కొరకు నేను ప్రత్యేకంగా ఎన్నుకోబడ్డాను, మీరు కాదు".

వారు అన్నారు, "మాకు న్యాయం చెయ్యి, లేదంటే నిన్ను ఒక్కరినే వదలము, బదులుగా దాని విషయంలో మీతో గొడవ పడతాము".

అతను అన్నారు, "అయితే మీరు ఎవరిని అయితే ఇష్టపడతారో అతనిని నియమించుకోండి. మనం ఈ విషయాన్ని తీర్పు కొరకు అతని ముందు ఉంచుదాం."

వారు అన్నారు, "బనూ సాద్ బిన్ హుద్హైమ్‌గారి జ్యోతిష్యుడు". అతను చెప్పారు, "అలాగే". వారు ఎన్నుకున్న ఆ వ్యక్తి అష్షామ్ సరిహద్దు ప్రాంతాలలో నివశిస్తుండేవాడు. (అష్షామ్ అంటే సిరియా మరియు దాని పొరుగు భూభాగాలు కలిసిఉన్న ప్రాంతం).

తన తెగ (అబ్దె మనాఫ్)లోని కొంతమందితో షామ్‌కి అబ్దుల్ ముత్తలిబ్ ప్రయాణం ప్రారంభించారు. వారితో పాటు ఖురైష్‌కు చెందిన ప్రతీ తెగ నుండి వచ్చినవారు బయలుదేరారు. వీరి బయలు దేరిన ప్రాంతానికి మరియు వారు చేరవలసిన గమ్యానికి మధ్య విశాలమైన ఎడారి ప్రాంతం ఉంది, ఎటువంటి గ్రామాలుగాని పట్టణాలు గాని లేని ప్రాంతం, కాబట్టి ఆ ప్రయాణం సులభమైనదేమీ కాదు. వాస్తవానికి ఒకచోట ఈ ప్రయాణం చాలా కష్టమనే విషయం బుజువైంది.

అబ్దుల్ ముత్తలిబ్ మరియు అతని అనుచరుల దగ్గర నీరు అయిపోయింది. వారు దాహంతో చాలా దూరం అలాగే ఉన్నారు. ఇక చావు తప్పదని అనుకున్నారు. ఇతర ఉపతెగల దగ్గర కొంత నీరు ఉంది. కాని అబ్దె-మునాఫ్ సంతానం వారిని కొంత నీరుకోసం అడిగితే వారు ఇలా చెబుతూ తిరస్కరించారు. "మనం ఎడారిలో ఉన్నాము, మరియు మీకు జరిగిందే మాకూ జరుగుతుందని భయపడుతున్నాము".

అబ్దుల్ ముత్తలిబ్ తన అనుచరులతో చెప్పారు, "మీలోని ప్రతీ ఒక్కరూ తన స్వంత సమాధిని తవ్వుకోండి, తనలో ఇంకా మిగిలి ఉన్న శక్తి నుపయోగించి. మీలో ఏ మనిషైనా చనిపోగానే, ఇతరులు అతనిని గోతిలోకి తోసి మట్టితో కప్పివేస్తారు, చివరికి ఒక్క మనిషే మిగిలే వరకూ. ఎందుకంటే మొత్తం సమూహం నాశనం కావడం కంటే ఒక్కడే (సమాధి కాకుండా) నాశనం కావడం మేలు.

వారు అన్నారు, "మీరు మాకిచ్చిన ఆదేశమే వాస్తవానికి మంచిది".

వారిలోని ప్రతీవ్యక్తి అతని సమాధి కొరకు తవ్వాడు. మరియు తమ చావు కొరకు నిరీక్షిస్తూ క్రింద కూర్చున్నారు. కాని అప్పుడు వారితో అబ్దుల్ ముత్తలిబ్ అన్నారు. "అల్లాహ్ సాక్షి, ఈ విధంగా మనం స్వయంగా చనిపోవడం ఎందుకు? ఈ భూమిపై (గౌరవం) లభించదు మరియు ఈ విధంగా మనం బలహీనం కాకూడదు. బహుశా ఏదో ప్రాంతంలో (ముందు ముందు) అల్లాహ్ మనకు నీటిని ప్రసాదించవచ్చు. కాబట్టి వెళ్ళడానికి సిద్ధం కండి". వారు ఆ ప్రాంతాన్ని వదలడానికి సిద్ధపడు తున్నారు. అబ్దుల్ ముత్తలిబ్ తన ఒంటెను నిలబెడుతుండగా, ఒంటె కాలిగిట్టల క్రింది నుండి మంచినీరు ఉబికింది. అబ్దుల్ ముత్తలిబ్ మరియు అతని అనుచరులు గట్టిగా అన్నారు 'అల్లాహు అక్బర్' (అల్లాహ్ గొప్పవాడు).

వారంతా నీటిని త్రాగారు మరియు తమ నీటి తిత్తులను నింపుకున్నారు.

తరువాత వారు ఖురైష్‌లోని ఇతర ఉపతెగలను ఆహ్వానించారు. వారందరూ వీరియొక్క ప్రతీ కదలికను గమనిస్తూనే ఉన్నారు. అబ్దుల్ ముత్తలిబ్ చెప్పారు, "ఈ నీటి దగ్గరకు రండి, వాస్తవానికి మనకు త్రాగడానికి అల్లాహ్ నీటిని ప్రసాదించారు". వారు వచ్చి త్రాగారు మరియు తమ నీటి తిత్తులను నింపుకున్నారు.

తరువాత వారు చెప్పారు, "అల్లాహ్ సాక్షి, మేమెన్నటికీ మరలా జమ్‌జమ్ గురించి మీతో గొడవపడము. ఎవరైతే ఇటువంటి బీడు భూమిలో ఈ నీటిని త్రాగడానికి మీకిచ్చారో, ఆయనే(అల్లాహ్) వాస్తవంగా నీకు జమ్‌జమ్ నిచ్చారు త్రాగడానికి. కాబట్టి సరియైన మార్గాన్ని పొందిన నీ నీటి దగ్గరకే వెళదాం."

ఇక బనూ సాద్ జ్యోతిష్యుడు దగ్గరకు వెళ్ళడంలో అర్థం లేదు. వారంతా మక్కాకు తిరిగి వచ్చేశారు, మరియు జమ్‌జమ్ బావిపై పూర్తి నియంత్రణ కలిగే అబ్దుల్ ముత్తలిబ్ హక్కు విషయంలో ఎవరూ ఎటువంటి వాదనకు దిగలేదు.

ఈ ఉల్లేఖనాన్ని చెప్పిన తరువాత, ఇబ్న్ ఇష్‌హాఖ్ ఇలా వ్రాశారు, "ఇది అలీ బిన్ అబీ తాలిబ్ (రజి) నుండి నాకు చేరింది".

జమ్‌జమ్ యొక్క ఘనతను తెలిపే ఉల్లేఖనాలు ఎన్నో ఉన్నాయి. వీటి గురించి ఇన్షా అల్లాహ్ వచ్చేసంచికలో అందిస్తాము.

ఇబ్నె అబ్బాస్ (రజి) వారి నుండి దారుల్‌ఖుత్నీ మరియు హాకిమ్ ఉల్లేఖించిన దాని ప్రకారం ప్రవక్త(స) చెప్పారు, ఏ ఉద్దేశ్యంతో అయితే అది తీసుకోబడుతుందో దానిని జమ్‌జమ్ నెరవేరుస్తుంది. దానిని మీరు నయం కొరకు త్రాగితే, అల్లాహ్ మీకు నయం చేస్తారు. మీకు కడుపు నిండాలని త్రాగితే, అల్లాహ్ మీ కడుపునిండేలా చేస్తారు, మీ దాహం పోవడానికి త్రాగితే, అల్లాహ్ చేస్తారు. అది జిబ్రీల్ యొక్క హజ్మా (అంటే అతని రెక్కతో లేదా మడమతో నేలను కొట్టిన ఫలితం), మరియు ఇస్మాయిల్(అ)వారి కొరకు అల్లాహ్ అనుగ్రహించిన పానీయం.

హాకిమ్ ఈ హదీస్‌ను ప్రామాణికమైనదిగా ప్రకటించారు.

## 2. ఏనుగు ప్రజలు

ఈ వృత్తాంతం ఖుర్ఆన్ మరియు హదీస్‌లలో ఉంది. దీని వివరాలు చరిత్ర పుస్తకాలలో కూడా లిఖించబడ్డాయి. ఖుర్ఆన్‌లో అల్లాహ్ చెప్పారు:

**సూరహ్ అల్-ఫీల్**

అనంత కరుణామయుడు అపార కరుణాప్రదాత అయిన అల్లాహ్ పేరుతో

ఏమీ? ఏనుగు వారి (సైన్యంతో) నీ ప్రభువు ఎలా వ్యవహరించాడో నీకు తెలియదా? ఏమీ? ఆయన వారి కుట్రను భంగం చేయలేదా? మరియు ఆయన వారిపైకి పక్షుల గుంపులను పంపాడు. అవి (ఆ పక్షులు) వారి మీద మట్టితో చేసి కాల్చిన కంకర రాళ్ళను (సిజ్జీల్) విసురుతూ పోయాయి. ఆ విధంగా ఆయన వారిని (పశువులు) తినివేసిన పొట్టుగా మార్చివేశాడు. **(ఖుర్ఆన్ 105:1-5)**

అస్-సీరహ్ అన్-నబవియ్యాలో అబూ హాతిమ్ ఏనుగు ప్రజల గురించి కొంత వివరంగా తెలియజేశారు. ఆ సమాచారాన్ని క్లుప్తంగా ఇక్కడ అందిస్తున్నాము.

యమన్ రాజు ఓ ఏనుగుని పట్టుకుని మచ్చిక చేసుకున్నాడు. ఆ ఏనుగే ఈ సంఘటనలో చాలా ముఖ్యమైనది. అతనిది నిజానికి అబిసీనియా దేశం. అతని పేరు అబ్రహా.

సినాయ్‌లో అతనొక చర్చ్ నిర్మించాడు. దానిపేరు అల్-ఖులైస్. అతను చెప్పేదేమిటంటే అరబ్ యాత్రికులందరూ మక్కాలోని కాబా దగ్గర కాకుండా ఇతను నిర్మించిన చర్చ్ దగ్గర చేరేలా చేయగలనని ప్రకటించాడు.

అందుకొరకు ముందుగా తన చర్చ్‌కు పోటీగా ఉందని భావించి కాబాను నాశనం చేయాలనుకున్నారు. కాబట్టి కాబా దగ్గరకు వెళ్ళి దానిని కూల్చివేయాలని ఒట్టు పెట్టుకున్నాడు.

హిమ్యార్ రాజులలో ఒకరైన జుహ్ నఫర్ అబ్రహాతో యుద్ధం చేయడానికి వచ్చాడు. అబ్రహా అతనిని ఓడించి యుద్ధ ఖైదీగా చేశాడు. అబ్రహా దగ్గరికి అతడు తీసుకు రాబడినప్పుడు, జుహ్ నఫర్ చెప్పాడు, "ఓ రాజా, నన్ను చంపకు, నన్ను చంపడం కంటే నన్ను జీవించి ఉంచి నట్లయితేనే నీకు మేలు." అబ్రహా చంపకుండా వదిలినప్పటికీ, అతనిని కట్టివెయ్యమన్నాడు. తరువాత అతని సైన్యంతో బయలుదేరాడు కాబాకు వెళ్ళాలన్న స్పష్టమైన సంకల్పంతో.

దారి వెంట, ఖత్'అమ్ భూభాగాన్ని అబ్రహా చేరినప్పుడు నుఫైల్ బిన్ హబీబ్ ఖతామీ మరియు నుఫైల్‌కు మద్దతిచ్చే కొన్ని యమన్ తెగల నుండి ప్రతిఘటన ఎదురైంది. అబ్రహా సైన్యానికే విజయం వరించింది. నుఫైల్ బందీ అయ్యాడు. నుఫైల్ చెప్పాడు, "ఓ రాజా! నాకు అరబ్బు భూభాగాలపై ఎక్కువ జ్ఞానముంది, కాబట్టి నన్ను చంపకు". ఇవిగో నా రెండు చేతులు, వాటితో నేను ప్రతిజ్ఞ చేస్తున్నాను మా ప్రజలంతా విధేయులుగా ఉంటారు. అబ్రహా అతనిని చంపకుండా వదిలాడు. అతడు అబ్రహాకు ఇప్పుడు కొత్త మార్గదర్శి అయ్యాడు.

సైన్యం తాయిఫ్‌ని చేరుకున్నప్పుడు, మక్కాకు సమీపంలో మస్'ఊద్ బిన్ ము'అత్తిబ్ మరియు తఖీఫ్ తెగవారు కొందరు అబ్రహాను కలవడానికి వచ్చారు. మస్'ఊద్ చెప్పారు, "ఓ రాజా! మేము నీ బానిసలం. నీకు మాతో ఎటువంటి గొడవ లేదు మరియు నీవు కోరేది మాతో లేదు. నువ్వు కోరేది మరేమీ కాదు మక్కాలో ఉన్న దైవగృహం.

మేము నీతోపాటు ఒక వ్యక్తిని పంపుతాము అతను మీకు కాబాకు మార్గాన్ని చూపెడతాడు. "వారు తమ బానిసలలో నుండి అబూ రుఘాల్ అనే బానిసను పంపారు. కాని అబూ రుఘాల్ అబ్రహాకు ఏ విధంగా ఉపయోగ పడలేదు ఎందుకంటే దారిలో అల్-మఘ్మాస్ దగ్గర చనిపోయాడు. అతని సమాధి అందరికీ తెలుసు, ప్రజలు అక్కడకు వెళతారు రాళ్ళతో ఆ సమాధిని కొట్టడానికి.

అల్-మఘ్మాస్ నుండి అబ్రహా అల్-అస్వద్ బిన్ మఖ్సూద్ అనే పేరుగల వ్యక్తిని సైన్యం ముందుకు పంపాడు. అల్-అస్వద్ మరియు అతనితో ఉన్నవారు మక్కాలో నివశించేవారిని కలిశారు మరియు అబ్దుల్ ముత్తలిబ్ గారికి చెందిన 200 ఒంటెలను స్వాధీనం చేసుకున్నారు.

అబ్రహా తరువాత 'హునాతహ్ అల్-హుమైరీ'ని మక్కా ప్రజల దగ్గరకు కొన్ని ఆదేశాలిచ్చి పంపాడు :

"వారిలో ఎక్కువ గౌరవనీయుడు ఎవరో అడుగు, తరువాత అతనికి తెలియజెయ్యి. నేను యుద్ధం చేయడానికి రాలేదు, కేవలం (కాబా) గృహాన్ని కూల్చడానికే వచ్చాను."

హునాతహ్ మక్కా ప్రవేశించగానే, అతను అబ్దుల్ ముత్తలిబ్‌ను కలిసి చెప్పాడు, "నిస్సందేహంగా, నన్ను మీ దగ్గరకు రాజుగారు పంపారు మీరు యుద్ధం చేస్తే తప్ప, ఆయన యుద్ధం చేయడానికి రాలేదు. కేవలం ఆ (కాబా) గృహాన్ని కూల్చడానికే వచ్చాడని తెలియజేయడానికి. అతని పని ఎంత త్వరగా పూర్తి అయితే అంత త్వరగా మిమ్మల్ని వదిలి వెళతాడు."

అబ్దుల్ ముత్తలిబ్ చెప్పారు, "మేము ఆయనతో యుద్ధం చేయము. అతనికి మరియు గృహానికి మధ్య నున్నది అంతా తీసివేస్తాము (అంటే అతని మార్గానికి మేము అడ్డురాము మరియు కొంత కాలం మక్కాను వదిలేస్తాము).

అతని మార్గంలో అతనిని కాబా చేరకుండా ఆపడానికి ఏదీ ఉంచకుండా ఉంటే, అల్లాహ్ సాక్షి అతనికి వ్యతిరేకంగా ఏ బలం లేనట్లే!

హునాతహ్‌తో కలిసి అబ్దుల్ ముత్తలిబ్ అబ్రహా సైన్యం విడిది చేసిన చోటుకి వచ్చారు. జుహ్ నఫర్ అబ్దుల్ ముత్తలిబ్ స్నేహితుడు. కాబట్టి సైన్యం విడిదికి ముందరి భాగం దగ్గరకు ఆయన చేరుకోగలిగారు. అక్కడ జుహ్ నఫర్ ఆయనను కలిశాడు.

"ఓ జుహ్ నఫర్", అబ్దుల్ ముత్తలిబ్ ప్రారంభించారు, "మా మీద పడిన దీని (ఈ ఉపద్రవం)నుండి నీవు ఏమైనా సహాయం చేయగలవా?"

"ఓ ఖైదీ ఏమి సహాయం చేయగలడు అతనే ఉదయమో సాయంత్రమో ఏ సమయంలోనైనా చంపబడవచ్చు అతనే క్షేమం కానప్పుడు?" జుహ్ నఫర్ అన్నాడు.

"కాని ఏనుగు మావటి యైన అనీస్‌కు కబురు పంపుతాను. రాజుగారితో అతను చేయగలిగింది చేయమని మరియు నీ స్థాయిని అతని దగ్గర పెంచడానికి అతనిని ఆదేశిస్తాను."

అనీస్‌కు కబురు పంపబడింది. అతను రాగానే జుహు నఫర్ అతనితో చెప్పాడు, "ఈయన ఖురైషీయుల నాయకుడు, మక్కా బిడారుకి ఈయనదే. ఆ బిడారమే మైదానంలో ఉన్న ప్రజలకు మరియు పర్వతాలలో ఉన్న పశువులకు పోషణ కల్గిస్తుంది. అతని 200 ఒంటెలను రాజుగారు తీసుకున్నారు. నీవేమైనా ఆయనకి ప్రయోజనం చేయగలిగితే చేయి, ఎందుకంటే అతడు నా స్నేహితుడు కనుక."

**(మరికొంత భాగం ఇన్షా అల్లాహ్ వచ్చే సంచికలో...)**

# ఖుర్'ఆన్‌ని అర్థం చేసుకుంటూ చదువ్వదాం - 13

## బంధువులు ...

رشتہ دار — Relatives ...

| తెలుగు | English | اردو | ఉచ్చారణ | عربي |
|---|---|---|---|---|
| తల్లి | mother | ماں | = (ఉమ్మున్) | أُمٌّ (أُمَّهَات pl) |
| తండ్రి | father | باپ | = (అబున్) | أَب، |
| భార్య, భర్త | wife, husband | شوہر، بیوی | = (జౌజ్) | زَوْج (أَزْوَاج pl) |
| పురుషుడు | man | مَرد | = (రజుల్) | رَجُل (رِجَال pl) |
| స్త్రీ | woman | عورت | = (ఇమ్రఅతున్) | اِمْرَأَة (نِسَاء pl) |
| బిడ్డ | child | لڑکا یا لڑکی | = (వలద్) | وَلَد (أَوْلَاد pl) |
| తండ్రి | father | باپ | = (వాలిదున్) | وَالِد |
| వారసులు, పిల్లలు | descendents, children | اَولاد | = (జుర్రియ్యహ్) | ذُرِّيَّة |
| కుమారుడు | son | | = (ఇబ్న్) | اِبْن |
| కుమారులు | sons | بیٹے | = (బనూన్) | بَنُون،(بَنِين، أَبْنَاء pl) |
| సోదరుడు | brother | بھائی | = (అఖున్) | أَخ (أَخُو، أَخَا، أَخِي) |
| సోదరులు | brothers | | = (ఇఖ్వాన్) | اِخْوَان pl |

## స్వంతం (శరీర భాగాలు ...)

خود ( جسم کے حصّے ) — Self (body parts ...)

| తెలుగు | English | اردو | ఉచ్చారణ | عربي |
|---|---|---|---|---|
| ముఖం | face | چہرہ | = (వజ్హ) | وجه (وُجُوه pl) |
| కన్ను | eye, spring | آنکھ، چشمہ | = (అయ్న్) | عَيْن (أَعْيُن pl) |
| దృశ్యాలు, చూపు | sights,vision | نگاہیں | = (అబ్సార్) | أَبْصَار pl |
| నోళ్ళు | mouths | منہ | = (అఫ్వాహ్) | أَفْوَاه pl |
| నాలుక, భాష | tongue, language | زبان | = (లిసాన్) | لِسَان (أَلْسِنَة pl) |
| హృదయం | heart | دل | = (ఖల్బున్) | قَلْب (قُلُوب pl) |
| ఛాతీ | breast | | = (సద్ర్) | صَدْر (صُدُور pl) |
| చేయి | hand | ہاتھ | = (యద్) | يَد (أَيْدِي pl) |
| పాదం | foot | پَیر | = (రిజ్లున్) | رِجْلٌ (أَرْجُل pl) |
| ఆత్మ | soul | جان | = (నఫ్సున్) | نَفْس (أَنْفُس pl) |
| ఆత్మ | soul, spirit | رُوح | = (రూహున్) | رُوح |
| శక్తి, బలం | power, strength | قوّت | = (ఖువ్వతున్) | قُوَّة |

ఖుర్'ఆన్‌లో మొత్తం పదాల సంఖ్య = సుమారు 77,800.

*ఈ 10 నెలలలో నేర్చుకున్న ఖుర్'ఆన్ పదాల శాతం : 56.8*

ఈ నెల నేర్చుకున్న పదాలు 1482 (అంటే ఈ 24 పదాలు ఖుర్'ఆన్‌లో 1482 చోట్ల చూడవచ్చు)

*source: www.emuslim.com*

ఏ ధర్మాన్ని కించపరిచే ఉద్దేశ్యం మాకు లేదు. అన్ని ధర్మాలను గౌరవిస్తున్నాం

# టెర్రరిజం

- క్రైస్తవ టెర్రరిజం ?
- సిఖ్ఖు టెర్రరిజం ?
- యూదు టెర్రరిజం ?
- కమ్యూనిస్ట్ టెర్రరిజం ?
- హిందూ టెర్రరిజం ?
- ఇస్లామిక్ టెర్రరిజం ?

తీవ్రవాదానికి, మత ధర్మానికి ఏ విధమైన సంబంధం లేదు. ✓

**టెర్రరిజం అనేది ముస్లిములకే స్వంతమన్నట్లు, మీడియా ఎందుకు ముస్లిములనే టార్గెట్‌గా పెట్టుకుంది?**

తీవ్రవాదాన్ని 'ముస్లిము'లుగా మేము ఖండిస్తున్నాం. మానవులకు అపకారాన్ని తలపెట్టే ఏ పనినైనా మేం వ్యతిరేకిస్తాం. మానవులందరూ ఒకే జంట యొక్క వారసులని, ఖుర్'ఆన్ ద్వారా తెలుసుకుని ప్రపంచ ప్రజలందరినీ వారు హిందువులైనా, క్రైస్తవులైన లేక మరే ధర్మానికి చెందిన వారైనా సరే, వారిని మా సోదరులుగానే భావిస్తున్నాం. మా సోదరులపై జరిగే ఎటువంటి హింసనైనా నిర్ద్వందంగా ఖండిస్తున్నాం. కాని మీడియా వారి రెండు నాలుకల ధోరణిని వివరించాలనేది ఈ శీర్షిక యొక్క ప్రధానోద్దేశం కాబట్టి ఈ శీర్షికలో మీడియా భాషనే వాడుతున్నాం. మా భాష మాత్రం కాదు. వేరే ధర్మం వారి ఎవరికైనా బాధ కలిగితే, మీడియా వారి వలన ముస్లిములకు కూడా అంతే బాధ కలిగిందని అర్థం చేసుకుని, కొంత మంది ప్రోద్భలంతో మీ తోటి ముస్లిం సోదరులపై అనాగరికంగా వ్రాస్తున్న మీడియా వ్రాతలను ఖండించమని కోరుతున్నాం.

13

సెప్టెంబర్ 11, 2001 అమెరికా ట్విన్ టవర్స్‌పై దాడి

దాడికి కారణం బిన్‌లాడెన్ కాదు!?

FBI దగ్గర సాక్ష్యం లేదు

## కారకులెవరు? - 2

(గత సంచిక తరువాయి)

**"ముఖ్రేకర్ రిపోర్ట్"** ఎడిటర్ మరియు వ్యాసకర్త వ్రాసిన వ్యాసం ఇంటర్‌నెట్‌లో ఉంది. ఆయన వ్రాసిన వ్యాసం టైటిల్ : "FBI says, it has "No hard evidence connecting Bin Laden to 9/11". జూన్ 18, 2006 ముఖ్రేకర్ రిపోర్ట్‌లోని కొన్ని ఆసక్తికరమైన ముఖ్యాంశాలను ఈ సంచికలో మా పాఠకులకు అందిస్తున్నాము. 2005 సంవత్సరానికి గాను సివిల్ జస్టీస్ ఫౌండేషన్ అవార్డు గ్రహీత ఐన పాల్ వి. షెరిడన్ ఓ ఈ-మెయిల్ 'ముఖ్రేకర్ రిపోర్ట్'కి పంపించారు. ఆ ఈ-మెయిల్‌లో ఉన్న విషయం - అమెరికా FBI వారి పోస్టర్ గురించి. FBI మోస్ట్ వాంటెడ్ పోస్టర్‌ను క్రిందటి సంచికలో ప్రచురించాము.

FBI, అమెరికా విడుదల చేసిన 'మోస్ట్ వాంటెడ్' పోస్టర్‌లో 2001 సెప్టెంబర్‌లో అమెరికాలో ట్విన్ టవర్స్‌పై జరిగిన దాడికి ప్రత్యక్షంగా గాని, పరోక్షంగా గాని బిన్‌లాడెన్‌కి సంబంధమున్నట్లు లేదు.

తేది: జూన్ 5, 2006. FBI హెడ్ క్వార్టర్స్‌ని ముఖ్రేకర్ రిపోర్ట్ వ్యాస కర్త మరియు ఎడిటర్ ఈ విషయమై సంప్రదించారు. FBI యొక్క ఇన్వెస్టిగేటివ్ పబ్లిసిటీ ఛీఫ్ Rex Tombతో మాట్లాడారు. వారు విడుదల చేసిన పోస్టర్‌లో టవర్స్ కూల్చిన ప్రస్తావన ఎందుకు పొందు పరచలేదని ఆయనని అడగడం జరిగింది. FBI దగ్గర గట్టి సాక్ష్యమేమీ లేదని ఆయన సమాధాన మిచ్చారు.

అటువంటి విస్మయం కల్గించే స్టేట్‌మెంట్ FBI దగ్గర నుండి రావడంతో ఆశ్చర్యపోయారు.

FBI సాక్ష్యాలను సేకరించి, వాటిని 'డిపార్ట్‌మెంట్ ఆఫ్ జస్టిస్'కు పంపిస్తుంది. సాక్ష్యాలను బట్టి నిర్ణయం చేసేది ఆ డిపార్ట్‌మెంటే. ఆ తరువాత ఆ సాక్ష్యం 'ఫెడరల్ గ్రాండ్ జ్యూరీ'కి పంపడానికి సరిపోతుందా? లేదా? అని నిర్ణయం అక్కడే జరుగుతుంది.

అమెరికా ప్రభుత్వం దగ్గర సాక్ష్యం లేనప్పుడు, ఆఫ్ఘనిస్తాన్ దేశాన్ని అమెరికా ఎందుకు ముట్టడించింది? పొగబెట్టి లాడెన్‌ను గుహలోనుండి బయటికి తీసుకురావడానికేగా ఈ దండయాత్ర. బిన్ లాడెన్‌ని, తాలిబన్లను ఆఫ్ఘనిస్తాన్‌లో సమూలంగా నాశనం చేయడానికే అమెరికా ప్రభుత్వం యుద్ధం చేసింది.

ప్రజల శతృవులలో నంబర్ వన్ 'బిన్ లాడెన్' అని వర్ణించి, దాదాపు 3000 మంది చావుకు ఇతడే కారణమని చెప్పిన బుష్ పాలనా యంత్రాంగం, దాడి జరిగిన 5 సంవత్సరాల తరువాత 'సాక్ష్యం లేదు' అని చెబుతుంది. (మూలం: ముఖ్రేకర్ రిపోర్ట్)

అమెరికా ప్రభుత్వం ఆడిన డ్రామాలోని మరొక ముఖ్యాంశం : Confession Video (బిన్ లాడెన్ నేరం చేసినట్లు ఒప్పుకున్న వీడియో). డిశంబర్ 13, 2001 న అమెరికా ప్రభుత్వం ఈ వీడియో టేపుని విడుదల చేసింది. ఈ వీడియో ఎక్కువమంది అమెరికన్లకు గుర్తుండే ఉంటుంది. ఈ వీడియోలో బిన్ లాడెన్ అతని అనుచరులు కొందరితో సంతోషంగా మాట్లాడినట్లు చూపించబడింది.

**ఖుర్'ఆన్ గ్రంథ అవతరణ మొదలైన తరువాత 1380 సం॥ల వరకూ 'ఇస్లామిక్' తీవ్రవాదం అనే పదం ఎక్కడా ఉపయోగించ బడలేదు. గత 20 సంవత్సరాలుగా ఈ పదాన్ని ఉపయోగిస్తున్నారు. 'ఇస్లాం'కి తీవ్రవాదానికి అసలు సంబంధమే లేదని వివేకం గలవారికి సులభంగా అర్థమౌతుంది.**

అమెరికన్ డిఫెన్స్ విభాగం ఈ వీడియోను పత్రికలకు విడుదల చేసింది.

డిఫెన్స్ సెక్రటరీ డోనాల్డ్ రమ్స్‌ఫెల్డ్ చెప్పారు : "ఈ వీడియో టేప్‌ను కనుగొనక ముందే, జరిగిన దాడికి బిన్ లాడెన్ బాధ్యుడు అని చెప్పడంలో ఎటువంటి సందేహం లేదు." అంటే ఈయన చెప్పిన మాటలను బట్టి ఈ దాడి వెనుక మాస్టర్ మైండ్ 'బిన్ లాడెన్' అని తమకు ఈ confession video కంటే ముందే తెలుసు. ఈ టేప్ కేవలం వారి నమ్మకాన్ని ధృవీకరించినట్లుగా చెప్పుకున్నారు.

**BBC న్యూస్ ఆర్టికల్** : ఈ వీడియో టేప్‌ను విడుదల చేయడానికి అప్పటి అమెరికా అధ్యక్షుడు 'బుష్' సంశయించాడట. ఎందుకంటే ప్రజలకు జరిగిన తీవ్ర నష్టాన్ని మరలా గుర్తు చేసినట్లు అవుతుందని. అది ఒక devastating declaration అని ఆయనకి తెలుసట. మేము అతనిని పట్టుకుంటాము సజీవంగాగాని లేదా నిర్జీవంగాగాని. ఇవీ బుష్‌గారి మాటలు.

**CNN న్యూస్ ఆర్టికల్** : ఈ వీడియో టేప్ విషయంలో న్యూయార్క్ మేయర్ Rudy Giuliani ఇలా చెప్పారు : బిన్ లాడెన్‌ను మరియు అతని అనుచరులను లక్ష్యంగా చేసుకున్న అమెరికా తన సైనిక చర్యను బాగా సమర్థించుకోవడానికి ఈ టేప్ ఎటువంటి సందేహం లేకుండా చేసింది.

సెనేట్ ఇంటెలిజెన్స్ కమిటీ చైర్మన్ అయిన సెనేటర్ రిచర్డ్ షెల్బీ, ఇలా చెప్పారు : ఈ వీడియో టేప్ విడుదల ప్రధానమైనది - బయటి ప్రపంచపు ప్రజలు ఎవరైతే సెప్టెంబర్ 11 దాడులలో బిన్ లాడెన్ ప్రమేయాన్ని నమ్మడం లేదో వారికి చెప్పడానికి". ఈ టేప్ చూశాక కూడా వారు ఎలా ఒప్పుకోవడం లేదో నాకైతే తెలియడం లేదని ఈయన వ్యాఖ్యానించారు. బావుంది, సెనేటర్ షెల్బీగారు FBI వారిని నమ్మించలేక పోయారు. కాబట్టి మీరెందుకు నమ్మించాలి?

అమెరికా ప్రభుత్వం నుండి 'బిన్ లాడెన్ కన్ఫెసన్ వీడియో' ప్రామాణికతపై వివరాలను సంపాదించడానికి ముక్రేకర్ రిపోర్ట్ ప్రయత్నించింది. ప్రయోజనం లేదు.

అయినప్పటికి బుష్ పాలనా యంత్రాంగం మరియు యు.ఎస్. కాంగ్రెస్ వారి డెడ్ స్ట్రీమ్ మీడియాతో ఈ వీడియోని ప్రామాణికం అన్నట్లుగా ప్రదర్శించారు.

**కాని దీనిని FBI సాక్ష్యంగా పరిగణించడం లేదు. ఎందుకని? ఎందుకంటే అది నిజమైన వీడియో కాదు. బహుశా హాలీవుడ్ స్టుడియోలో షూటింగ్ చేసి తయారుచేసి ఉంటారు.**

FBI దగ్గర సాక్ష్యం లేదని రెక్స్ టోంబ్ చెప్పడం ప్రపంచవ్యాప్తంగా ప్రతీ న్యూస్ పేపర్‌లో మొదటి పేజీ హెడ్‌లైన్ కావాలి. కాని అలా జరగలేదు. అలా ఎందుకు జరుగలేదో పాఠకుల ముందున్న సవాల్.

అమెరికన్ మీడియా గుడ్డిగా అమెరికా ప్రభుత్వం వ్రాసిచ్చిన స్క్రిప్ట్‌నే ఎందుకు చదివింది? 9/11 దాడుల గురించి ఎక్కువ సమాచారం కొరకు మీడియా పరిశోధిస్తుంది. కాని అలా జరుగలేదు. ఈ Big Media Conglomeration గవర్నమెంట్ స్టోరీనే గుడ్డిగా అనుసరించింది. కంప్యూటర్ మౌస్‌ని కొన్ని క్లిక్స్ చేస్తే చాలు - పరిశీలించడానికి ఎంతో విలువైన సమాచారం లభిస్తుంది.

**బిన్ లాడెన్ ప్రమేయం ఉందని మీడియా చెబుతుంది.**

**అలా చెప్పడానికి అమెరికా దేశపు FBI తమ దగ్గర సాక్ష్యం లేదంటుంది.**

పై విషయాలను బట్టి అమెరికా మీడియాపై పూర్తి కంట్రోల్ ఆ దేశ ప్రభుత్వానికి ఉందని స్పష్టంగా తెలుస్తుంది. ఇక మీడియాకు ఆ దేశంలో స్వేచ్ఛ ఉందని ఎలా చెబుతున్నారు? లేదా అక్కడ మీడియా కూడా నైతిక విలువలు లేనిదై ఉండాలి.

**బిన్ లాడెన్‌ను ప్రపంచంలోనే నెం.1 తీవ్రవాది అని ప్రపంచ ప్రజలందరినీ నమ్మేలా చేశారు. కాని వారి FBI నమ్మలేదు.**

**అమెరికాను నమ్మిన వారంతా గొర్రెలయ్యారు.**

అమెరికా తన రాక్షస కోర్కెలను తీర్చుకోవడానికి, మత దురభిమానంతో 'ఇస్లామ్'పై విషం కక్కుతూ ఇంకా ఎటువంటి మోసాలు చేయనుందో!

ప్రజలు అమెరికాను నమ్మారు. ఇంత జరిగినా కూడా ఇంకా వారినే నమ్ముతున్నారు.

**బిన్ లాడెన్ నిజంగా ఏమి చేశాడో మాకు తెలియదు. మీడియాను నమ్మడానికి మేము ధైర్యం చేయలేము.**

ఒక వ్యక్తి ఓ దాడి చేసాడో, లేదో ఎటువంటి ఆధారం లేకుండా కేవలం ఊహలతో, తప్పుడు సాక్ష్యాలను సృష్టించి కథనాలు ప్రచారం చేయడం చూశాక 'నాగరిక ప్రపంచం' అని భావించే **నేటి సభ్య సమాజం సిగ్గుతో తలదించుకోవాలి. పశ్చాత్తాప పడాలి.**

మన రాష్ట్రంలోని మక్కా మస్జిద్ బాంబ్ దాడులతో ఓ జాతీయ రాజకీయ పార్టీ అనుబంధ సంస్థలకు సంబంధముందని స్పష్టమైంది.

**ఏ రాక్షసకృత్యాన్ని ప్రపంచంలో ఎవరు చేసినా, అది ఎక్కడ జరిగినా, నింద మాత్రం ముస్లిములపైనే!**
**ఇది నాగరికమా?**

విశ్వసనీయత లేని నాయకులు పరిపాలిస్తున్నారు. విశ్వసనీయత లేని వారు మీడియా సంస్థలను నడుపుతున్నారు.

అసత్యాల మధ్య బ్రతికే ప్రజలకు సత్యం విలువను తెలియజేయాలని అల్లాహ్‌ను వేడుకుంటున్నాము (ఆమీన్)

**అమెరికా డ్రామాలోని ఒక అసత్య ఆరోపణ నిగ్గు తేల్చడం ఇన్షా అల్లాహ్, వచ్చే సంచికలో...**

రాహుల్ వ్యాఖ్య: గమనిక: ఈ వ్యాసంలో మా గురి కేవలం రాజకీయ పార్టీలపై మాత్రమే. మత ధర్మాలపైకాదు

## నానాటికీ పెరిగిపోతున్న హిందూ మత సంస్థల అతివాద ధోరణి దేశానికి లష్కరే తోయిబావంటి ఉగ్రవాద సంస్థల కంటే కూడా పెద్ద ముప్పుగా పరిణమిస్తోంది.

ఈ సంస్థలు మతపరమైన ఉద్రిక్తలతో పాటు ముస్లిమ్ సమాజంతో రాజకీయ సంఘర్షణలను కూడా సృష్టిస్తున్నాయి *

## ఇప్పుడు ముల్లు గుచ్చుకుంది. గుచ్చుకున్నాక బాధ తెలుస్తుంది.

**ఇంతకాలం ముస్లిములను తీవ్రవాదులుగా చిత్రీకరించడానికి ప్రయత్నించిన వారికి ఇన్నాళ్ళకి ముల్లు గుచ్చుకుంది. ఇప్పుడిప్పుడే నొప్పి తెలిసి వస్తుంది. ముస్లిములను మానసికంగా ఎంత ఆవేదనకు గురి చేశారో వారికి ఇప్పటికైనా అర్థమౌతుందని ఆశిద్దాం.**

**125 సం॥ల చరిత్ర కలిగిన కాంగ్రెస్‌లో ఎందరో సీనియర్ నాయకులు, అనుభవజ్ఞులు ఉన్నారు. అయినప్పటికీ, వారు కూడా రాహుల్‌ని పి.యమ్. చేయకుండా నిద్రపోయేలా లేరు. భావి భారత ప్రధానిగా విశేషంగా ప్రచారం పొందుతున్న అతనిలో అంత సమర్థత, వివేకం, దేశ పరిస్థితులపై మరియు విదేశాంగ విధానాలపై మంచి అవగాహన ఉందని వారంతా నమ్మిఉంటారు కాబట్టే అతనిని భావిప్రధాని చేయాలని ఉవ్విళ్ళూరుతున్నారని అనుకుందాం. మరి అటువంటి బాధ్యతగల వ్యక్తి వ్యాఖ్యలు చేశారంటే ఆధారాలు లేకుండా చేయడు కదా! అతని వ్యాఖ్యలు నిజమే కావచ్చు.**

### అమెరికన్ ఇంటెలిజెన్స్

భారతీయులు నమ్ముతారు

మనదేశంలో దాడులు జరుగుతాయని అమెరికన్ ఇంటెలిజెన్స్ సమాచారం ఇస్తుంది. అమెరికాది రాక్షసనీతి అని తెలిసినా ఎవ్వరూ అమెరికాను అనుమానించరు. సరే! వారి ఇంటెలిజెన్స్ చాలా పవర్‌ఫుల్ అనుకుందాము. (అంత పవర్‌ఫుల్ అయితే వారి దేశంలో టవర్స్‌పై జరిగిన దాడి గురించి ఎందుకు తెలుసుకోలేక పోయారని మాత్రం అడగకండి. వారి ఇంటెలిజెన్స్ ప'**వార్**'ఫుల్)

### ఇండియన్ ఇంటెలిజెన్స్

భారతీయులు నమ్ముతారా?

గౌరవనీయులైన హోమ్ మినిస్టర్ చిదంబరం గారు '**కాషాయ తీవ్రవాదం**' గురించి వ్యాఖ్యలు చేశారు. మన ఇంటెలిజెన్స్ రిపోర్ట్ ముందుగా ఆయనకే తెలుస్తాయి. వాటిపై ఆధారపడే ఆయన ప్రకటించి ఉంటారు. మరి చిదంబరం గారి మాటలను మాత్రం ఎందుకు నమ్మరు? అమెరికన్ మంత్రి చెబితే నమ్మవచ్చుగాని, మన భారతీయ మంత్రి చెబితే ఎందుకు నమ్మడం లేదు?

రాహుల్ గాంధీగారు వ్యాఖ్యలుచేసినా, చిదంబరంగారు వ్యాఖ్యలు చేసినా వెంటనే స్పందించేది మరియు భుజాలు తడుముకునేది బిజెపి పార్టీయే!

'ఇస్లామిక్ తీవ్రవాదం' మరియు ముస్లిములు తీవ్రవాదులంటూ దుష్ప్రచారాన్ని చేసిన ఈ పార్టీవారు మాలెగావ్ పేలుళ్ళ విషయంలో ఉగ్రవాది దాడిలో ప్రాణాలు కోల్పోయిన మాజీ ఏటిఎస్ ఛీఫ్ హేమంత్ కర్కరేగారు సాధ్వి ప్రజ్ఞాసింగ్ ఠాకూర్‌ను అరెస్ట్ చేయగానే ఉలిక్కిపడ్డారు. ఎక్కడ 'హిందూ ఉగ్రవాదం' అని ప్రచారం జరిగిపోతుందోనని, వెంటనే ఆ పార్టీ నాయకుడు వెంకయ్యానాయుడుగారు 'ఇస్లామిక్ తీవ్రవాదం' అనే పదం కరెక్ట్ కాదని, మతానికి తీవ్రవాదానికి సంబంధం లేదని స్టేట్‌మెంట్ ఇచ్చుకోవలసి వచ్చింది.

చిదంబరంగారు '**కాషాయ తీవ్రవాదం**' విషయంలో తన వ్యాఖ్యలకే కట్టుబడి ఉన్నారు.

ఇటీవల ఆంధ్రప్రదేశ్ అసెంబ్లీలో మజ్లిస్ నాయకుడు, మక్కా మస్జిద్ బాంబ్ బ్లాస్ట్‌తో ఆరెస్సెస్, భజరంగదళ్, అభినవ్ భారత్‌కు సంబంధాలు ఉన్నాయని ఆ సంస్థలను నిషేధించాలని, మక్కా మస్జిద్‌లో బాంబు దాడులకి బలయ్యినవారు ముస్లిములేనని, పోలీస్ కాల్పులకు గురయ్యింది కూడా ముస్లిములేనని, అరెస్ట్ కాబడినవారు కూడా ముస్లిములేనని, వారిని తీవ్రంగా టార్చర్ చేశారని ఆవేదన వ్యక్తం చేశారు.

**పాకిస్తాన్ దేశంతో శతృత్వం ఉంటే, పాకిస్తాన్ గురించి మాట్లాడండి. పాకిస్తాన్ తీవ్రవాదం గురించి మాట్లాడదలిస్తే 'పాకిస్తాన్ తీవ్రవాదం' అని అనండి. అమెరికా తీవ్రవాదం గురించి మాట్లాడేటప్పుడు ఆ దేశం పేరు చెప్పండి. అంతేగాని ముస్లిముల గురించి, ఇస్లామ్ గురించి మాట్లాడడం దేనికి? ఇది కేవలం మత దురభిమానమే. ఓట్ల కోసం జరిగే నీచ రాజకీయం.**

### రాహుల్ వ్యాఖ్యలపై కొందరి స్పందన

* సాక్షి దినపత్రిక, డిసెంబర్ 18-20, 2010

- **హిందువులు కొమ్ములతో కుమ్మేస్తారు.** - *శివసేన అధినేత బాల్ ఠాక్రే*

మెజారిటీ హిందువులు రాహుల్ వ్యాఖ్యలను అసలు పట్టించుకున్నట్లే లేదు. భుజాలు తడుముకున్నది ఓ రాజకీయ పార్టీ మరియు వారి అనుబంధ సంస్థలే. హిందువులకు కొమ్ములేమిటి? ఈ భాష వ్యాఖ్యానించిన వారి స్థాయిని తెలుపుతుంది. రాజకీయ నాయకుల కుట్రలను హిందువులు, ముస్లిములు స్పష్టంగా అర్థం చేసుకున్నారు కనుకనే, మస్జిద్-మందిరం కోర్టు తీర్పు విషయంలో ఏ గొడవలు జరగలేదు. రాజకీయ నాయకుల కుట్రలు కుతంత్రాల వల్లనే మత ఘర్షణలు వస్తాయి గాని, అన్ని మతాలవారు ఈ దేశంలో బాగానే ఉన్నారు. తీవ్రవాదానికి, ఏ మత ధర్మానికి సంబంధం లేదని వారికి బాగా తెలుసు.

- **భారత్‌లోని అమెరికా రాయబారి వద్ద రాహుల్ చేసిన వ్యాఖ్యలు అమెరికా, పాక్ అనుకూల విధానాలను అనుసరించేందుకు కారణమయ్యాయి. *-గుజరాత్ ముఖ్యమంత్రి నరేంద్ర మోడీ***

  రాహుల్ వ్యాఖ్యల వల్లనే అమెరికా పాక్ అనుకూల విధానాలను అనుసరిస్తుందా? అమెరికా కేవలం తనకు ఉపయోగపడే విధానాన్నే ఎప్పుడూ అనుసరిస్తుంది. అందుకోసం ఏ పనికైనా వెనుకాడదు. ఆ మాత్రం కూడా తెలియని ఈయన ఓ రాష్ట్రానికి ముఖ్యమంత్రా? ముస్లిములను ఊచకోత కోయించిన ఈయన గురించి అమెరికా వారికి తెలియదా? రాహుల్ చెబితేనే తెలుస్తుందా?

- **ఇందిరాగాంధీ, రాజీవ్ గాంధీలు ఎల్టీటీఈని పెంచి పోషించారు. దిగ్విజయ్ వద్ద రాహుల్ పాఠాలు నేర్చుకుంటున్నారు. ఆయన నా వద్ద పాఠాలు నేర్చుకుంటే బాగుంటుంది. - *బిజెపి మాజీ నేత ఉమా భారతి.***

  అంటే కాంగ్రెస్ పార్టీవారు ఓ తీవ్రవాద సంస్థను పెంచి పోషించారని బిజెపి వారి నమ్మకం కాబట్టి, వారికి కాంగ్రెస్ ప్రత్యర్థి కాబట్టి వారు కూడా పోటీగా ఓ తీవ్రదాద సంస్థను పెంచి పోషించు కోవాలని అనుకుంటున్నారా? ఏమో మరి! తన దగ్గర పాఠాలు నేర్చుకోమంటున్న ఈమె, సాధ్వి ప్రజ్ఞాసింగ్ ఠాకూర్‌కి పాఠాలు ఎవరు నేర్పారో మాత్రం చెప్పలేదు. ఉమా భారతి శిష్యులెవరో చెప్పమని ఆమెను దిగ్విజయ్ సింగ్ గారు డిమాండ్ చేయడంలో అర్థమేమిటో?

- **హిందూత్వంపై పూర్తి అవగాహన లేని రాహుల్ వ్యాఖ్యలు దేశానికి మంచివి కావు. *ఆర్ట్ ఆఫ్ లివింగ్ వ్యవస్థాపకుడు, పండిట్ రవిశంకర్***

  ఇస్లామ్‌పై పూర్తి అవగాహన లేకుండా 'ఇస్లామిక్ తీవ్రవాదం', ముస్లిములు తీవ్రవాదులు అంటూ కొందరు చేసే ప్రచారాన్ని ఖండించక పోవడం కూడా దేశానికి మంచిది కాదు. రాజకీయ నాయకుల సంగతి అందరికీ తెలిసిందే. కాని ఆధ్యాత్మిక గురువులకు ధర్మం గురించి కనీస అవగాహన ఉంటుంది కదా! ఇస్లామ్, హిందూ మతం మీద ఓ పుస్తకం వ్రాసిన ఈయనకు ఇస్లామ్ గురించి అవగాహన లేదా? దేశ ప్రజలు అందరూ మంచిగా ఉంటేనే దేశం బావుంటుంది. అన్ని మతాలకు గౌరవం కలిగినప్పుడే దేశం బావుంటుంది.

  **మత ధర్మానికి మరియు తీవ్రవాదానికి సంబంధం లేదు.** ఏ మత ధర్మానికి తీవ్రవాదాన్ని అంటగట్టినా **శాంతిబాట** తీవ్రంగా ఖండిస్తుంది. ఆధ్యాత్మిక గురువులు ఇప్పటికైనా మేలుకుని దేశం మేలుకోరి మత ధర్మాలపై జరుగుతున్న దుష్ప్రచారాన్ని ఖండిస్తే చాలా మంచిది.

## సకల లోకాల ప్రభువైన 'అల్లాహ్' సర్వ మానవాళి కోసం అవతరింపజేసిన ఉత్తమ జీవన విధానం - ఇస్లామ్

'ఇస్లామ్' ధర్మం అంటే ఏమిటో తెలుసుకోకుండానే 'ఇస్లామిక్ తీవ్రవాదం' అనేవారు '**అనాగరికులు**'. అందులో ఎటువంటి సందేహం లేదు. ఇస్లామ్ గురించి తెలుసుకున్న రోజున వారంతా తమ అనాగరిక ఆలోచనలకు సిగ్గుతో తలదించుకుంటారు.

### యాసిడ్ దాడులు ఏ మతధర్మం వారు చేస్తున్నారు?

గత కొన్ని సంవత్సరాలుగా అమ్మాయిలపై యాసిడ్ దాడులు జరుగుతున్నాయి. తల్లిదండ్రులు భయపడుతున్నారు. ఇది టెర్రరిజం కాదా? సంతోషంగా బ్రతకవలసిన ఈ అమ్మాయిల జీవితాలను ఈ విధంగా నాశనం చేస్తున్నారు. ఈ యాసిడ్ దాడులు చేసిన వారందరి పేర్లు వ్రాయండి. వారు ఏ మత ధర్మంలో పుట్టారో ప్రక్కన వ్రాయండి. ఆ మతధర్మం వారే యాసిడ్ దాడులు చేస్తారని ఎవరైనా చెప్పగలరా? వేరే మతంలో పుట్టిన వారు ఏ రాక్షసకృత్యమైనా చేస్తే, వారి రాక్షసత్వానికి మరియు ఆ మతానికి సంబంధం లేదు. కాని ముస్లిమ్‌ల విషయంలో మాత్రం మతంతో కలుపుతున్నారు? సిగ్గువేయడం లేదా?

ప్రపంచం చెవిలో అమెరికా పువ్వు

## మొన్న లాడెన్! నిన్న డేవిడ్ హెడ్లీ! నేడు అసాంజే?

- లాడెన్ వంకతో అమెరికా రెండు దేశాలపై యుద్ధం చేసింది. ఆ నాశనాల ద్వారా ప్రపంచాన్ని సర్వనాశనం చేయగల ఏకైక తీవ్రవాదిగా అమెరికా పేరు తెచ్చుకుంది.
- లాడెన్‌ను చుట్టి ముట్టినప్పటికి మా సైన్యాధికారులు అతనిని వదిలేసారని ప్రజల చెవుల్లో అమెరికా పువ్వు పెట్టాలని చూసినా, ప్రపంచ ప్రజలు పెట్టించు కోలేదు. అమెరికా వాడి రాక్షస నీతిని అర్థం చేసుకుంటున్నారు.
- లాడెన్ ఇలా మాట్లాడాడు, అలా మాట్లాడాడు అని ఇక ఎన్ని వీడియోలు చూపించినా ప్రజలు నమ్మడం లేదని, డేవిడ్ హెడ్లీని తెర మీదికి తీసుకు వచ్చారు. హెడ్లీ అమెరికా ఏజెంట్ అని వారి ద్వారానే తెలిసింది. హెడ్లీ విషయంలో అమెరికా తయారు చేసుకున్న స్క్రిప్ట్ సూపర్ ప్లాఫ్ అయి పోయింది.
- హెడ్లీను తీవ్రవాదిగా ఒక పక్క ప్రచారం చేస్తూనే, అతనిని స్వేచ్ఛగా పాకిస్తాన్, ఇండియాలకు తిరిగేలా చేసిన అమెరికా యొక్క కుయుక్తులను భారత నిఘా సంస్థలు పసిగట్టాయి. 'హెడ్లీ'పై అమెరికా విచారణ ఎలా ఉంటుందో కూడా వారు ముందుగానే ఊహించి చెప్పారు. అదే విధంగా జరిగింది.

- హెడ్లీకి మరణశిక్ష విధించాలి. కాని అతనికి అమెరికా సాధారణ శిక్ష కూడా వేయదు. తన దేశంలో టవర్స్ కూల్చివేత సంఘటనలో అనుమానితుడైన లాడెన్‌ను అప్పగించనందుకు ఆఫ్ఘనిస్తాన్‌పై యుద్ధం చేసింది అమెరికా. మన దేశంలో ముంబయి దాడికి హెడ్లీ కారణమని ధృవీకరించబడింది. ఆ హెడ్లీని మన దేశానికి అమెరికా ఎందుకు అప్పగించలేదు? అప్పగించ లేదు కాబట్టి ఆ దేశంపై అమెరికా నీతి ప్రకారం మనం యుద్ధం చేయవచ్చు.
- హెడ్లీ విషయంలో అమెరికాను ప్రపంచ ప్రజలు 'ఛీ' అన్నారు.
- ప్రపంచమంతా అమెరికాను ఎలాగూ 'ఛీ' అని అంటుంది కాబట్టి, వికిలీక్స్ ద్వారా ప్రపంచ దేశాల మధ్య సంబంధాలు పాడు చెయ్యాలని, ఇంతకు పూర్వం లాడెన్ పేరు చెప్పుకుని ఏ విధంగా అమెరికా తీవ్రవాద దాడులు చేసిందో, ఇప్పుడు కూడా అదే విధంగా 'వికిలీక్స్' ద్వారా చేయాలని పథకం వేసిందా?

**'అమెరికా'ను నమ్మిన దేశం నాశనం కాకుండా ఉంటుందా?**

ప్రపంచ ప్రజలు చాలా జాగ్రత్తగా ఉండాలి. 'వికిలీక్స్' అమెరికా పథకమే అయితే చాలా ప్రమాదం. అమెరికా విషయంలో కీడెంచి మేలు ఎంచడం మంచిది. అమెరికాలో ట్విన్ టవర్స్ కూల్చివేతకు బుష్ ప్రభుత్వమే కారణమని ఇంటర్‌నెట్ నిండా ఎన్నో విషయాలు వెలుగు చూశాయి. వాటిని ఎందుకు మీడియా ప్రచురించలేదు? అవి అమెరికా ప్రభుత్వానికి వ్యతిరేకం కాబట్టి ప్రచురించలేదు. అవి నిజమా? కాదా? ఎవరికీ తెలియదు. కాని **ఆ విశ్లేషణలలో కూడా చాలా బలముంది.**

అవి అమెరికా ప్రభుత్వానికి వ్యతిరేకంగా ఉన్నాయి కాబట్టి ప్రచురించలేదు. O.K. మరి వికిలీక్స్ ద్వారా వెలువడే సమాచారం నిజమా? అబద్ధమా? ఇది కూడా ఎవరికీ తెలియదు. అంతేకాదు ఆ సమాచారం కూడా అమెరికా ప్రభుత్వానికి వ్యతిరేకమే. మరి ఇప్పుడు ఎందుకు మీడియా అమెరికాకు వ్యతిరేకమైన విషయాలను ప్రచురిస్తుంది?

ఇందులో ఏదో మోసముంది. అమెరికాకు వ్యతిరేకంగా మీడియా పనిచేయదు. అటువంటప్పుడు అమెరికాకు వ్యతిరేకంగా ఓ వెబ్‌సైట్‌ను ఎలా మెయిన్‌టెయిన్ చేయగలరు? అందుకనే మేము ముందరి సంచికలలో వికిలీక్స్‌పై మా అనుమానాన్ని వ్యక్తం చేశాము.

ఇటీవల ఓ దేశ అధ్యక్షుడు వికిలీక్స్‌పై ఇటువంటి అనుమానాన్నే వెలిబుచ్చాడు. మేము కేవలం విశ్లేషణ ద్వారానే అనుమానిస్తున్నాము. ఓ దేశ అధ్యక్షుడు కూడా అనుమాన పడ్డారంటే, అతని దగ్గర ఏదైనా సమాచారం ఉండి ఉంటుంది.

పరధ్యానంతో ప్రజలు గుడ్డిగా నమ్మడం అలవాటు చేసుకున్నారు. ఓ పెద్ద మొట్టికాయ తగిలితేగాని ఈ లోకంలోకి రారు.

వికిలీక్స్ ద్వారా కొన్ని నిజాలు రావచ్చేమో గాని, ఓ భయంకరమైన ఉపద్రవం కూడా వచ్చే అవకాశం లేకపోలేదు.

అమెరికా ప్రపంచంలో ఏ దేశాన్ని ఏ రూపంలో నాశనం చేస్తుందో?

ప్రపంచ ప్రజలను అమెరికా బారి నుండి కాపాడాలని అల్లాహ్‌ను వేడుకుంటున్నాము.(ఆమీన్)

## చందా వివరాలు

**ఈ సంచిక నుండి**

**'శాంతిబాట' మాసపత్రిక**

**సంవత్సర చందా రూ. 200/- చేయడమైనది**

**విడిప్రతి వెల : రూ. 17/-**

**మనియార్డర్ ద్వారా చందాను పంపవలసిన చిరునామా:**

Velugubaata Educational Society
2-8-31, Kota Bazar, Samalkot - 533440
East Godavari District

**మూడు లేదా అంతకంటే ఎక్కువ చందాలను పంపగోరువారు క్రింది బ్యాంక్ ఎకౌంట్‌లో జమచేయగలరు.**

SBI A/c No. 10428633092, A.U. Campus Branch, Waltair, Visakhapatnam, A/c Holder Name: Nagireddi Srinivasa Rao

**మీరు డిపాజిట్ చేసే మొత్తానికి బ్యాంక్ ఛార్జీ (రూ. 25/-) అదనంగా కలిపి డిపాజిట్ చేయమని కోరుతున్నాము.**

Bank **ద్వారా గాని** Money Order **ద్వారాగాని** **చందా చెల్లించినవారు 9491103017కి** SMS **ద్వారాగాని, కాల్ చేసిగాని వివరాలను తెలియజేయవలసిందిగా కోరుతున్నాము.**




**ప్రతీ స్త్రీ లేదా పురుషునికి తొలి బడి అమ్మ ఒడి. గొప్ప గొప్ప జ్ఞానులు, మేధావుల వెనుక తల్లిదండ్రుల ప్రోత్సాహం ఎంతో ఉంటుంది. తొలి గురువులు తల్లిదండ్రులే. ఆ తరువాతనే, పాఠశాలలో చేరిన దగ్గరనుండి, మిగిలిన గురువులు పరిచయమౌతారు. వీరందరినీ మీరు గౌరవించాలి. అయితే వీరందరికీ జ్ఞానాన్ని ఇచ్చిన సృష్టికర్తే విశ్వమంతటికీ గురువు - ఆయనే 'అల్లాహ్'. ఏ గురువు చెప్పినా అర్థం కాకపోయినా లేక మరేదైనా చెప్పుకోలేని సమస్య మీకొస్తే డైరెక్టుగా అల్లాహ్‌నే అడగండి. ఆయన వింటాడు. మీకు జవాబు కూడా వస్తుంది. ఆరాధ్యుడిని అర్థం చేసుకుంటే మీరే టాప్ రేంకర్స్.**

## ఇల్మ్ [జ్ఞానం] *Knowledge*

మీ తల్లిదండ్రులు మీకు మంచి భవిష్యత్తును కలుగజేయాలని మిమ్మల్ని *LKG* లో జాయిన్ చేసినప్పటినుండే ఆలోచిస్తుంటారు.

మీకు *LKG, UKG* లలో సైతం మంచి మార్కులు వస్తే ఆనందిస్తారు. మార్కులు తక్కువ వస్తే నీరసపడిపోతారు. మంచి భవిష్యత్తు అంటే మీరు ఓ డాక్టరో, ఇంజినీరో కావాలి. మంచి స్థాయిలో ఉండాలి. బాగా సంపాదించి ఐశ్వర్యవంతులు కావాలి. ఇది సగటు తల్లిదండ్రుల కోరిక. వీరి కోరికను తప్పుపట్టడానికి లేదు.

కాని **మంచి భవిష్యత్తు**లో అతి ముఖ్యమైన అంశం - **'పిల్లలు జీవితాంతం సంతోషంగా బ్రతకడం'**. ఈ అతి ముఖ్యమైన విషయాన్ని తల్లిదండ్రులు మరచి పోతున్నారు. స్థాయి, ఐశ్వర్యం వలన సుఖం పొందవచ్చుగాని సంతోషానికి గ్యారంటీ లేదు. అది దైవభీతి వలన మాత్రమే సాధ్యమౌతుంది. కష్టమొచ్చినా, సుఖమొచ్చినా సంతోషం మన మనస్సు నుండి దూరం కాకూడదు.

మనిషిలో జ్ఞానం పెరిగేకొద్దీ దైవభీతి పెరుగుతుంది. దైవభీతి మనల్ని మంచి ఆచరణ వైపు తీసుకు వెళుతుంది. దానివలన ఎల్లప్పుడూ సంతోషం లభిస్తుంది.

మీరంతా బాగా చదవాలి. జ్ఞానం సంపాదించుకోవాలి. ప్రవక్త(స)వారు చెప్పారు, జ్ఞానమనేది ముస్లిమ్ పోగొట్టుకున్న సంపద వంటిది. అది ఎక్కడ దొరికినా ముస్లిమ్ తీసుకుంటాడని చదువుకు ఇస్లామ్ అత్యధిక ప్రాధాన్యత నిచ్చింది. ఖుర్ఆన్ ప్రతీ విషయాన్ని లోతుగా ఆలోచించ మంటుంది.

'ఇస్లాం'యొక్క శిక్షణ ఎంత గొప్పగా ఉంటుందో, చరిత్ర చెబుతుంది. గ్రీకు శాస్త్రవేత్తలు సిద్ధాంతాలతో కాలం వెళ్లబుచ్చుతున్న కాలంలో 'ఇస్లాం' ద్వారా శిక్షణ పొందిన ముస్లిములు సైన్స్‌లో ఓ విప్లవాన్ని తీసుకువచ్చారు. ప్రయోగాలను ప్రారంభించారు.

వారిలో అతి ముఖ్యుడు "**ఇబ్న్ అల్-హైతమ్**". ఈ ముస్లిమ్ శాస్త్రవేత్త ప్రపంచపు తొలి సైంటిస్ట్‌గా గౌరవం పొందారు. ఈయన గురించి 7 & 8 సంచికలలో వివరించాము. ఈయనే ఆప్టిక్స్‌కు పితామహుడు. కాని ప్రపంచ ప్రజలలో చాలామందికి ఈ నిజం తెలియదు.

ఆప్టిక్స్‌కు పితామహుడు న్యూటన్ అనుకుంటారు. ఈ విధంగా పాఠ్య పుస్తకాలలో విద్యార్థులు నేర్చుకుంటున్న ఎన్నో అసత్యాలను ఈ శీర్షికలో తెలియజేసి, వాటితోపాటు అసలు నిజాలు ఏమిటో కూడా మొదటి 7 వ్యాసాలలో తెలియజేశాము. అవి ఇంకా పూర్తి కాలేదు. ఇన్షా అల్లాహ్ పూర్తి చేస్తాము. 'ఆల్‌జీబ్రా'కి పితామహుడు **అల్-ఖ్వారిజ్మి**. ఈయన వ్రాసిన '**అల్-జబర్** వల్ ముఖాబలా' పుస్తకం నుండి '**ఆల్‌జీబ్రా**' అనే పదం ఉత్పన్నమైంది (చూడండి సంచిక 4). ఇబ్న్ హైతమ్ కేవలం ఫిజిక్స్‌లోనే కాదు చాలా సబ్జక్టులలో ప్రయోగాలు చేశారు. ఆయన Physicist, Anatomist, Physician, Psychologist, Astronomer, Engineer, Inventor, Mathematician, Opthalmologist, Philosopher. అల్-ఖ్వారిజ్మి మొదలైన వారంతా ధర్మ పరాయణులే. దైవభీతిగలవారే!

ఏకైక ఆరాధ్యుడైన అల్లాహ్ గురించి వారికి బాగా తెలుసు. ముహమ్మద్(స)వారి బోధనల గురించి కూడా బాగా అధ్యయనం చేశారు. **ఇస్లాం అనేది సంపూర్ణమైన జీవన విధానం.** కేవలం ప్రార్థనలకే అది పరిమితం కాదు. దాని ప్రకారంగా వారు జీవించి ఆధునిక సైన్స్‌కు మాత్రమే కాకుండా, ఎన్నో రంగాలకు పటిష్టమైన పునాదులు వేయగలిగారు.

చిన్నప్పుడు అంకెలు, ఆ తరువాత కూడికలు, తీసివేతలు నేర్చుకుంటే ....... అలా తరగతులు పెరిగేకొద్దీ డిఫరెన్షియల్ ఈక్వేషన్స్, త్రీ డైమన్షనల్ రేఖాగణితం మొదలైన ఎన్నో నేర్చుకుని గణితశాస్త్రంలో ప్రావీణ్యత సాధించడం జరుగుతుంది.

'మేథ్స్' నేర్చుకోవడానికి చిన్నప్పుడు పునాది పడితే, చదువు పూర్తయ్యే

సరికి అందులో ప్రావీణ్యత సంపాదిస్తారు. అంటే ఒక్కసారిగా ఏదీ నేర్చేసుకోలేరు. ధార్మిక జ్ఞానం కూడా అటువంటిదే. చదువు పూర్తయ్యాక చూద్దాంలే అని ఎందరో తల్లిదండ్రులు పిల్లలను ఆ ధార్మిక జ్ఞానానికి దూరంగా ఉంచుతున్నారు.

నేడు ఎందరో మేధావులు, వృత్తి విద్యా నిపుణులు తమ తల్లి దండ్రులను ఇండియాలో వదిలేసి అమెరికా లేదా ఇతర దేశాలకు సంపాదనా నిమిత్తం వెళ్ళిపోతున్నారు. తల్లిదండ్రులపై తమకు ఎంతో బాధ్యత ఉందని వారు గుర్తించడం లేదు. **అవును, ఎలా గుర్తిస్తారు?**

వారికి ఇంజినీరింగ్, సైన్స్ మాత్రమే తెలియడానికి చిన్నప్పటినుండి వారి తల్లిదండ్రులు కష్టపడ్డారుగాని, 'ధర్మం' అంటే ఏమిటో నేర్పించాలని ఏనాడూ భావించలేదు. పిల్లలు తమకు దూరమైన రోజున వారికి జ్ఞానోదయం అవుతుంది. కేవలం డబ్బు సంపాదించడమే మంచి భవిష్యత్తుగా భావించిన తల్లిదండ్రులకు చివరికి పిల్లలు ఇచ్చేది ఆ డబ్బును మాత్రమే. ప్రేమను కాదు.

'ధార్మిక జ్ఞానం' గురించి తెలుసుకుంటే సరిపోదు. తెలిసిన ప్రతీ దానిని ఆచరించాలి. ఈ ఆచరణ చిన్నతనం నుండి మొదలైతే యుక్త వయస్సుకు చేరుకునేసరికి ఉన్నత వ్యక్తిత్వం వస్తుంది. తోటివారు మనల్ని గౌరవిస్తారు.

ఆనాడూ కూడా అదే జరిగింది. మస్‌జిద్‌లే యూనివర్శిటీలు అయ్యాయి. ఓ 1000 సంవత్సరాల క్రితమే మస్‌జిద్‌లలో ఆల్‌జీబ్రా, ట్రిగొనోమెట్రీ, ఇతర సైన్స్‌లను ధార్మిక విద్యతో పాటు నేర్పారు.

జ్ఞానానికి మూలమైన మస్‌జిద్‌లు నేడు కేవలం సలాత్(నమాజ్)కు మాత్రమే పరిమితం అయిపోయాయి.

నేటి ముస్లిమ్‌లలో అత్యధిక శాతం ఇలా చెబుతున్నారు: "మేము మదరసాల్లో పిల్లలను జాయిన్ చేయిస్తే, వారికి ఏ ఉద్యోగమూ రాదు. సమాజ పరిస్థితిని దృష్టిలో ఉంచుకుని నేడు అందుబాటులో ఉన్న కాన్వెంట్‌లలోనే మా పిల్లలను చదవించవలసి వస్తుంది. కాబట్టి మేము ధార్మిక విద్యను నేర్పించలేము."

నిజమే! మీరు పిల్లలను కాన్వెంట్‌లో చదివించడాన్ని ఇస్లామ్ వ్యతిరేకించడం లేదు కదా! చదువును ఇస్లామ్ ప్రోత్సహిస్తుంది. ఆ కాన్వెంట్‌లలో నేర్పని ధార్మిక విద్యను మీరు మీ ఇండ్లలో నేర్పించవచ్చు అని చెబితే, 'పిల్లలకు ఎక్కడ ఖాళీ ఉంటుంది?' ఉదయం వెళ్లిపోతే సాయంత్రం వస్తారు. అలసిపోతారు. పైగా హొమ్‌వర్క్‌లు. ధార్మిక చదువు కూడా చెప్పిస్తే వారికి భారం ఎక్కువై పోతుంది అంటున్నారు.

**ధార్మిక విద్య కొరకు విద్యార్థులు అదనంగా ఎటువంటి వత్తిడికి లోనుకావలసిన అవసరం లేదు.**

అందరూ చేస్తున్నట్లే, మీరు కూడా మీకు ఇష్టమైన కాన్వెంట్‌లో మీ పిల్లలను చదివించండి. మగరిబ్ నమాజ్ సమయానికి, మీ పిల్లలను తండ్రితోగాని లేదా ఇంట్లో ఎవరైనా పెద్దవారితోగాని మస్‌జిద్‌కి వెళ్ళే అలవాటు చేయండి. కేవలం ఓ 20 నిమిషాలు. వారు బాగా రిఫ్రెష్ అవుతారు. ఇంటికి వచ్చాక తన హొమ్‌వర్క్ పూర్తి చేసుకుంటారు.

మస్‌జిద్‌కు వెళ్ళడం వలన సాంఘిక జీవనం అంటే ఏమిటో ప్రాక్టికల్‌గా అర్థమౌతుంది. అశ్లీలమైన మాటలు మస్‌జిద్‌లో మాట్లాడుకునే పరిస్థితే ఉండదు. మస్‌జిద్‌లలో పేదవారు, ఉన్నవారు అనే తేడా లేకుండా భుజం భుజం తగిలేలా సలాత్ చేసే అలవాటు వారిలో అహంకార ధోరణిని దూరం చేస్తుంది.

స్కూలు, ఇల్లు, టి.వి., సినిమాలకు మాత్రమే పరిమితమైన పిల్లలకు సాంఘిక జీవితంపై సరియైన అవగాహన ఉండదు. మస్‌జిద్‌లలో ప్రతీ నమాజ్ చేయడానికి ఓ నిర్ణీత సమయం ఉంది. ఆ సమయం దాటితే అందరితో నమాజ్ చేసే అవకాశం పోతుంది. తరువాత ఒక్కరే చేసుకోవలసి వస్తుంది. ఒంటరిగా కంటే సలాత్(నమాజ్)ను సామూహికంగా చేస్తే పొందగలిగే మేలు ఏమిటో వారికి అర్థమవుతుంది.

నేను, నాది అనే భావనకంటే, 'అందరితో నేను' అనే భావన వారిలో బలంగా నాటుకుంటుంది. అంతేకాకుండా సమయపాలన బాగా తెలుస్తుంది. పరోక్షంగా ఓ క్రమశిక్షణను అలవాటు చేస్తుంది.

రాత్రుల్లు పిల్లలకు కథలు చెబితే చాలా ఆసక్తిగా వింటారు. ప్రవక్తల జీవిత చరిత్ర, ముహమ్మద్(స)వారి జీవిత చరిత్ర, ఖుర్ఆన్‌లో వారికి అర్థమయ్యేటటువంటి విషయాలు చెబుతూ ఉంటే, వారిలో నైతిక విలువలు పెరుగుతాయి.

వారానికి ఒక రోజు ఓ గంటపాటు మస్‌జిద్‌కు పంపించి అరబీ భాషను నేర్పించండి. ఖుర్ఆన్ వాక్యాలను మరియు ముహమ్మద్(స) వారి బోధనలను నేర్చుకునేలా చేయండి.

ఒకవేళ మస్‌జిద్‌లో నేర్పించగలిగేవారు లేకపోతే ఆ ఏరియాలోని ముస్లిమ్‌లందరూ కలిసి, సమీప ప్రాంతం నుండి ప్రతీ ఆదివారం ఓ గంటపాటు మస్‌జిద్‌కు వచ్చి నేర్పేవిధంగా ఓ ఆలిమ్‌ను ఏర్పాటు చేసుకోవచ్చు.

ఈ విధంగా చేయడం వలన శలవురోజైన ఆదివారం నాడు ఓ గంట సమయం మాత్రమే వారు వెచ్చించవలసి ఉంది.

మీ పిల్లలలో టెన్షన్ దూరమవుతుంది. చదువులో బాగా రాణించ గలుగుతారు. వారిలో నైతిక విలువలు పెరుగుతాయి. తల్లిదండ్రులను ఎక్కువగా గౌరవిస్తారు.

ఇదేమిటి? బాలబాలికలకు ప్రత్యేకం అని చెప్పి తల్లిదండ్రులకు చెప్పవలసిన విషయాలు మీకు చెబుతున్నామని అనుకోకండి.

డియర్ చిల్డ్రన్! మీ తల్లిదండ్రులు ఇల్మ్ గురించి ఆసక్తి చూపకపోతే, మీరే వారికి 'ఇల్మ్' (knowledge) యొక్క ప్రాముఖ్యతను తెలియజేసి, మీ తోటి స్నేహితులతో ధార్మిక విద్యను నేర్చుకుని, ఆచరించడానికి ఈ రోజే నిర్ణయం తీసుకోండి.

**జీవితంలో సక్సెస్‌ను సాధించండి.**

ఈ శీర్షికను మీకు నచ్చే విధంగా అందివ్వాలని అనుకుంటున్నాము. కాబట్టి ఈ శీర్షిక ఎలా ఉండాలో మీ పేరెంట్స్ ద్వారాగాని, లేదా వారి అనుమతి తీసుకుని మీరైనా సరే మాకు 9491103017కి ఫోన్ చేసి తెలియజేయండి.

**(మీకు నచ్చే ఎన్నో ఆసక్తికరమైన విషయాలను వచ్చేసంచిక నుండి ఇన్షా అల్లాహ్ అందిస్తాము)**

# ధర్మ సందేశ ప్రచారం

## ఖుర్'ఆన్ మరియు సున్నత్ తెలుగులో

దావా (దావత్ - అల్లాహ్ మార్గంవైపు పిలవడాన్ని) జీవనోపాధిగా చేసుకో కూడదని, వ్యాపారంగా చేసుకో కూడదని, 'దాయీ'గా పిలుపించుకోవడం కంటే 'ముస్లిమ్'గా పిలుపించుకోవడం ఉత్తమమని, దావా అనేది ప్రతి ముస్లిమ్ యొక్క బాధ్యత అని, ఆ బాధ్యతను ప్రవక్త(స)వారు సూచించిన సౌమ్యమైన విధానంలో, మంచి కారెక్టర్‌తో చేయవలసి ఉంది అని ఈ శీర్షికలో అందించిన గత 6 వ్యాసాలలో తెలియజేశాము. అవి మా వ్యక్తిగత అభిప్రాయాలు ఎంతమాత్రం కావు. **ప్రతీ విషయానికి ఖుర్'ఆన్ మరియు హదీస్‌లను ఆధారంగా చూపాము.** మనకు ఖాళీ లేదని, డబ్బిచ్చి ఎవరిచేతో మన సలాత్(నమాజ్)ను చేయించుకుంటే, అది మన ఆరాధన ఏవిధంగా కాదో, అదేవిధంగా ఎవరికో డబ్బు ఇచ్చి మన తరపున అల్లాహ్ మార్గంవైపు పిలవమని చెప్పడం కూడా, మనం పిలిచినట్లు కాదని సోదరులు అర్థం చేసుకున్నారు. తులనాత్మక అధ్యయనాలు మరియు ఇతర గ్రంథాలతో దావా చేయడం వంటి ఇస్లామ్ వ్యతిరేక కార్యక్రమాల గురించి కూడా స్పష్టంగా తెలియజేయబడింది.

7

# కాఫిర్

## అంటే ఎవరు?

*అల్లాహ్ మార్గం వైపు పిలిచే ప్రతీ ముస్లిమ్ ముందుగా కొన్ని అరబీ పదాలపై స్పష్టమైన అవగాహన కలిగి ఉండాలి. లేకపోతే ఎదుటివారి మనస్సు గాయపడే అవకాశముంది. అంతేకాకుండా, ఎవరెవరితో అల్లాహ్ ఏ విధంగా ప్రవర్తించమన్నారో ముందుగా తెలుసుకుంటే మన బాధ్యతను సక్రమమైన పద్ధతిలో నిర్వర్తించ గలుగుతాము. అందుకే కొన్ని ముఖ్య పదాలను ఒక దాని తరువాత ఒకటిగా ఈ శీర్షికలో ఇన్షాఅల్లాహ్ అందిస్తాము.*

సరియైన అవగాహన లేని కొందరు ముస్లిమ్ సోదరులు మరియు సోదరీమణులు మనదేశంలోని ఒక మతవర్గానికి చెందినవారిని 'కాఫిర్'అని చెబుతూ ఉంటారు. కాని ఆ విధంగా పిలవడం మంచి సాంప్రదాయం కాదు. ముందుగా వారిని 'ముష్రిక్‌లు' అని తెలుసు కోవాలి. అంటే బహుదైవారాధకులు.

'షిర్క్' గురించి పాఠకులకు తెలిసిన విషయమే! షిర్క్ అంటే ఏకైక ఆరాధ్యుడైన అల్లాహ్‌కు భాగస్వాములను కల్పించడం. సృష్టికర్తయైన అల్లాహ్‌తో వారిని సమానంగా భావించి ఆరాధించడం లేదా అల్లాహ్‌తో పాటు వారిని కూడా దైవ సమానులుగా ఆరాధించడం. ఆ విధంగా ఆరాధించేవారిని 'షిర్క్' చేసేవారు అని 'ఇస్లామ్' తెలియజేస్తుంది. ఇటువంటి 'షిర్క్'కు పాల్పడేవానిని 'ముష్రిక్' అని అంటారు.

అరేబియాలో అజ్ఞాన కాలంలో అక్కడివారు అల్లాహ్‌ను ఆరాధిస్తూనే, ఇతర విగ్రహాలను కూడా పూజించేవారు. కాబట్టి వారిని 'షిర్క్ చేసే వారని - ముష్రిక్ (బహుదైవారాధకులు) అన్నారు. ముహమ్మద్(స)వారు వారికి సత్యాన్ని బోధించారు. ఆ సత్యాన్ని తెలుసుకున్న తరువాత తిరస్కరించి వారు కాఫిర్లు అయ్యారు.

ఎవరైనా ఓ వ్యక్తిని మీరు 'ముష్రిక్'అని సంబోధిస్తే, ఆ విన్న వ్యక్తి తనను వేరే భాషలో తిడుతున్నారని అనుకోవచ్చు. కాని బహుదైవాలను ఆరాధించే వారిని అరబీలో ఆ విధంగా అంటారని చెప్పాలి. ఒక రకమైన ఆరాధన చేసేవారిని వర్ణించే అరబీ పదమని తెలియజేయాలి.

కొందరు ముస్లిమ్ సోదరులు, సోదరీమణులు సంవత్సరాల తరబడి తమ కుటుంబాలలో ఎప్పుడూ వినబడే కొన్ని పదాలకు అర్థాలను తెలుసుకోరు. అటువంటివారు ముస్లిమ్‌కాని ప్రతీ వ్యక్తిని 'కాఫిర్'అని పిలుస్తున్నారు. ఇది చాలా హేయమైన పని. అటువంటివారి మాటలను అల్లాహ్‌కు మరియు ఆయన ప్రవక్తకు విధేయులైన ప్రతీ ముస్లిమ్ ఖండించాలి.

ముస్లిమ్‌కాని వారిలో ముఖ్యంగా 4 రకాల వ్యక్తులు ఉంటారు. వారు:

1. **ముష్రిక్‌లు** [ఎందరో దైవాలను (విగ్రహాలను) పూజించేవారు]
2. **మునాఫిక్‌లు** [కపట విశ్వాసులు, వీరు ముస్లిముల దగ్గర ఉన్నప్పుడు ముస్లిములని చెప్పుకుంటారు. మరొక మతవర్గం వారి దగ్గరి కెళ్ళినప్పుడు వారి మతానికి చెందినవారని చెబుతారు. ఈ నకిలీ ముస్లిములు చాలా ప్రమాదకారులు. మన రాష్ట్రంలోని ఇటువంటి వ్యక్తుల గురించి పలుమార్లు 'శాంతిబాట'లో ఉదహరించడం జరిగింది.]

**3. కాఫిర్లు** [సత్యాన్ని తిరస్కరించినవారు, సత్యమార్గం నుండి తప్పుకున్నవారు (మార్గభ్రష్టులు)].

**4. అహలెకితాబ్** (గ్రంథ ప్రజలు)

ఒక 'ముష్రిక్'ను అల్లాహ్ మార్గం వైపునకు పిలిచినప్పుడు, అతడు ఆ మార్గాన్ని తిరస్కరించినప్పుడు మాత్రమే 'కాఫిర్' అవుతాడు. **నిజమే!** కాని ఎవరైనా 'ముష్రిక్' వినగలిగే స్థితిలో లేనప్పుడు లేదా ఏదో పనిలో నిమగ్నమై ఉన్నప్పుడుగాని లేదా చిరాకు కోపాలతో ఉన్న స్థితిలో ఏదో నోటికొచ్చింది అతనికి చేప్పేసి, ఆ పరిస్థితిలో అతను వ్యక్తం చేసిన తిరస్కారాన్ని కుఫ్ర్‌గా పరిగణించడం కూడా సరియైనది కాదు.

అంటే అతనికి చెప్పే సత్యం అతనికి స్పష్టంగా అర్థం కావాలి. **ఇవేమీ చేయకుండానే, ముస్లిమేతరులందరినీ కాఫిర్లు అనడం సంస్కారం అనిపించుకోదు.**

ఎటువంటివారిని ఖుర్'ఆన్ 'కాఫిర్'గా అభివర్ణించిందో, అటువంటి వారి గురించి ఈ వ్యాసంలో తెలియజేస్తున్నాము.

## సత్య తిరస్కారి (కాఫిర్)

పరిష్తా (దైవదూత)లు ఎల్లప్పుడూ అల్లాహ్‌ను స్తుతిస్తూ విధేయత చూపుతారు. దైవదూతలు కాంతితో సృష్టించబడ్డారు. జిన్‌లు అగ్నితో సృష్టించబడ్డారు. ఇబ్లీస్ (షైతాన్) జిన్.

మానవులు మట్టితో సృష్టించబడ్డారు. తొలిమానవుడు - ఆదమ్(అ).

సత్యాన్ని తిరస్కరించడ మనేది సాధారణంగా రెండు విధాలుగా జరిగే అవకాశం ఉంది.

1. అజ్ఞానంతో తెలియక తిరస్కరించడం
2. పూర్తిగా సత్యాన్ని నిజమని తెలుసుకున్నాక తిరస్కరించడం.

ఆనాడు అరేబియాలోని 'ముష్రిక్'లను కాఫిర్లుగా పిలవడానికి కారణం - వారికి ధర్మాన్ని సరియైన విధంగా బోధించిన తరువాత కూడా వారు తిరస్కరించడమే కాకుండా హింసకు కూడా పాల్పడ్డారు.

అయితే, ఇక్కడ కొన్ని ముఖ్య విషయాలను గమనించాలి. **వారికి అల్లాహ్ గురించి తెలుసు.** ముహమ్మద్(స)వారి యొక్క నిజాయితీ మరియు గొప్ప శీలం గురించి ఎటువంటి సందేహం లేకుండా తెలుసు. అయినప్పటికీ వారు తిరస్కరించారు.

అప్పటి యూదులు, క్రైస్తవులలో కూడా కొందరు తిరస్కరించారు. వారికి కూడా అల్లాహ్ గురించి మరియు ముహమ్మద్(స)వారి గురించి తెలుసు. తమ గ్రంథాలలోని సూచనలను బట్టి వారు తెలుసుకో గలిగారు. అయినా సరే వారు తిరస్కరించారు. **కారణమేమిటి?** ఆ కారణాలను తరువాత చర్చిద్దాము.

ఇబ్లీస్ (షైతాన్) మొదట్లో 'అల్లాహ్'కు ఎంతో విధేయుడుగా ఉండేవాడు. అంతటి విధేయత కలిగినవాడు, కాఫిర్ (సత్య తిరస్కారి)గా ఎలా మారాడు? తొలి మానవుడైన ఆదమ్(అ)వారిని సృష్టించనంత వరకూ ముస్లిమ్‌గానే ఉన్న ఇబ్లీస్, మానవసృష్టి తరువాతే కాఫిర్ అయ్యాడు. ఖుర్'ఆన్‌లో సూరహ్ 'బఖరా'లో 34వ ఆయత్‌లో ఈ విషయం తెలియజేయబడింది.

> **మరియు మేము దైవదూతలతో : "మీరందరూ ఆదమ్ ముందు సజ్దా (సాష్టాంగం) చేయండి" అని ఆదేశించినపుడు, ఒక ఇబ్లీస్ తప్ప, మిగతా వారంతా సజ్దా చేశారు, అతడు నిరాకరించాడు మరియు దురహంకారానికి గురి అయ్యాడు మరియు సత్య తిరస్కారుల (కాఫిర్ల) లోని వాడయ్యాడు."** (ఖుర్'ఆన్ 2:34)

> **"అప్పుడు దైవదూతలందరూ కలిసి అతనికి సజ్దా చేశారు. ఒక్క ఇబ్లీస్ తప్ప! అతడు గర్వితుడయ్యాడు మరియు సత్య తిరస్కారుల (కాఫిర్ల)లో కలిసిపొయ్యాడు."** (ఖుర్'ఆన్ 38:73-74)

అల్లాహ్‌పై ఎంత విధేయత కలిగి ఉన్నా సరే, ఆయన యొక్క ఆదేశాలలోని ఏ ఒక్క ఆదేశాన్ని తిరస్కరించినా సరే, 'కాఫిర్' అవుతారని పై ఆయత్‌ల ద్వారా స్పష్టంగా తెలుస్తుంది.

ఖుర్'ఆన్‌లో అల్లాహ్ యొక్క ఆదేశాలు ఉన్నాయి. మరియు వాటితోపాటు మన మేలు కొరకు అల్లాహ్ చేసిన హితబోధ కూడా ఉంది. **కాబట్టి అల్లాహ్ యొక్క ప్రతీ ఆదేశాన్ని ముందుగా తెలుసుకోవాలి. ఏ ఒక్క ఆదేశాన్నీ తిరస్కరించకుండా మనం ఆచరించాలి.**

క్రింది ఖుర్'ఆన్ ఆయత్‌ను గమనించండి :

> **"ఈ జ్ఞానం నీకు అందిన తరువాత కూడా ఎవరైనా నీతో అతనిని (ఈసాను) గురించి వివాదానికి దిగితే ఇలా అను : "రండి! మేము మరియు మీరు కలిసి, మా కుమారులను మరియు మీ కుమారులను, మా స్త్రీలను మరియు మీ స్త్రీలను పిలుచుకుని, అందరమూ కలిసి : 'అసత్యం పలికే వారిపై అల్లాహ్ శాపం పడుగాక!' అని హృదయ పూర్వకంగా ప్రార్థిద్దాము"**
> (ఖుర్'ఆన్ 3:61)

పై 'ముబాహలహ్' గురించి ప్రవక్త(స)వారిని అల్లాహుతాలా ఆదేశించారు.

ఈ పై ఆదేశాన్ని దృష్టిలో పెట్టుకుని ఎవరైనా డిబేట్ గురించి వస్తే, ఈ పై వాక్యాన్ని వారికి వినిపించమని, అక్కడితో అది ముగిసిపోతుందని లేకపోతే ఆ డిబేట్ కొన్ని వందల సంవత్సరాలపాటు జరుగుతూనే ఉంటుంది గాని దానికి ముగింపు ఉండదని తోటి ముస్లిమ్ సోదరులను మేము మొదటి నుండీ రిక్వెస్ట్ చేస్తూనే ఉన్నాము. మా మనవిని మంచి మనస్సుతో కొందరు స్వీకరించారు.

తూర్పుగోదావరి జిల్లా, రాజమండ్రిలో ముస్లిమ్ పేరుతో చెలామణి అవుతూ **ఖుర్'ఆన్‌ని మరియు ముహమ్మద్(స)వారిని** కించపరుస్తూ ఓ పాస్టర్ కొన్ని సంవత్సరాలుగా పనిచేస్తున్నాడు. ఈ వ్యక్తి డిబేట్ గురించి మాట్లాడినపుడు, విజయవాడ నుండి ఓ ముస్లిమ్ సోదరుడు పై ఆయత్‌ద్వారా అల్లాహ్ యొక్క ఆదేశాన్ని పాస్టర్‌కి వినిపించాడు. దానితో డిబేట్ జరగలేదు.

అయితే ఆ ముస్లిమ్ సోదరుడు చేసిన పని సరియైనది కాదని 'దాయీ'లుగా పిలువబడే కొందరు ఖండించారు. కాని వారు

ఖండించింది ఆ సోదరుని మాటలను కాదని, ఖుర్ఆన్‌లో అల్లాహ్ తెలియజేసిన ఆదేశాన్నే ఖండిస్తున్నారని వారు ఎందుకు తెలుసుకోలేక పోతున్నారు?

అదే విధంగా అల్లాహ్ యొక్క మరో ఆదేశం :

"ఇలా అను : **"ఓ గ్రంథ ప్రజలారా! మాకు మరియు మీకూ మధ్య ఉమ్మడిగా ఉన్న ధర్మ విషయం వైపునకు రండి. అది ఏమిటంటే: మనం అల్లాహ్ తప్ప మరెవ్వరినీ ఆరాధించ కూడదు, ఆయనకు భాగస్వాములను ఎవ్వరినీ నిలబెట్టకూడదు. మరియు అల్లాహ్ తప్ప, మనవారిలో నుండి ఎవ్వరినీ ప్రభువులుగా చేసుకోరాదు". వారు (సమ్మతించక) తిరిగిపోతే : "మేము నిశ్చయంగా ముస్లిమ్‌లము (అల్లాహ్‌కు విధేయులం), దీనికి మీరు సాక్షులుగా ఉండండి"** అని పలుకు.'' (ఖుర్ఆన్ 3:64)

అయితే పై అల్లాహ్ ఆదేశంలోని సగం ఆదేశాన్ని మాత్రమే అంటే, ''... **ఉమ్మడిగా ఉన్న ధర్మ విషయం వైపునకు రండి.**'' వరకూ చెబుతూ, వారి గ్రంథానికి మరియు ఖుర్ఆన్ గ్రంథానికి పోలికలను చూపించ డానికి ప్రయత్నించి ప్రజలను తప్పుదోవ పట్టించేవారు కూడా ఉన్నారు.

ఆ ఉమ్మడి విషయం ఏమిటో కూడా పై ఆయత్‌లోనే స్పష్టంగా చెప్పబడింది. పై ఆదేశానికి వ్యతిరేకంగానే వీరు పనిచేస్తున్నా సరే, అది అల్లాహ్ ఆదేశంగా నమ్మబలుకుతూ వారు తమను తాము ప్రొఫెసనల్ దాయీలుగా వర్ణించుకుంటున్నారు. మరి అల్లాహ్ ఆదేశాలకు విలువ ఇవ్వని ఇటువంటి వారిని ఏమనాలి? ముస్లిమేతరులను కాఫిర్లుగా భావించే వారు ఓసారి ఆలోచించు కోవలిసి ఉంది.

## విధేయత

ముస్లిములు అల్లాహ్‌కు మాత్రమే విధేయత చూపితే సరిపోతుందా?

అల్లాహ్ ఖుర్ఆన్‌లో ఈ విధంగా చెబుతున్నారు :

**"ఇలా అను : అల్లాహ్‌కు మరియు సందేశహరునికి విధేయులై ఉండండి" వారు కాదంటే! నిశ్చయంగా, అల్లాహ్ సత్య తిరస్కారుల (కాఫిర్ల)ను ప్రేమించడు"** (ఖుర్ఆన్ 3:32)

అల్లాహ్ యొక్క సందేశహరుడు 'ముహమ్మద్(స)'వారికి కూడా విధేయులై ఉండాలి. ముహమ్మద్(స)వారికి విధేయత చూపకపోతే, అటువంటి వారు కూడా కాఫిర్లు అని స్పష్టంగా పై ఆయత్ తెలియ జేస్తుంది.

ఆదమ్(అ)వారికి సజ్దా చేయమంటే, తిరస్కరించి ఇబ్లీస్ 'కాఫిర్' అయ్యాడు. ముహమ్మద్(స)వారికి విధేయత చూపడానికి ఇష్టపడని వాడు 'కాఫిర్' అవుతాడు.

కొందరు ఇలా చెబుతారు: ''మేము ఖుర్ఆన్‌ని మాత్రమే అనుసరిస్తాము. ముహమ్మద్(స)వారి బోధనలను (హదీస్‌లను) అనుసరించము''. వారు నిజంగా ఖుర్ఆన్ గ్రంథాన్ని అనుసరించే వారే అయితే, పై ఖుర్ఆన్ ఆయత్‌ను అనుసరించాలి కదా! **సందేశహరునికి విధేయత చూపాలనే విషయాన్ని ఏ విధంగా వారు తిరస్కరించ గలుగు తున్నారు?**

విధేయత చూపడమంటే చెప్పినది ఆచరించడమే! ముహమ్మద్(స) వారికి విధేయత చూపాలంటే, ముందుగా ఆయన(స) ఏమి చెప్పారో తెలుసుకోవాలి. ఆ తరువాత దానిని పాటించకపోతే ఆయనకు విధేయత చూపినట్లు కాదు. ఆయన(స)కు విధేయత చూపకపోతే వారు 'కాఫిర్లు' అవుతారని పై **ఖుర్ఆన్** ఆయత్ ద్వారా తెలుస్తుంది.

ఈ మధ్యకాలంలో కొందరు కలిమా పూర్తిగా చదివించకుండా, అంటే **'లా ఇలాహ ఇల్లల్లాహ్'** అని మాత్రమే చదివించి, ఆ విధంగా చదివిన వారికి ముస్లిమ్ అని నామకరణం చేస్తున్నారు. కాని ఆ విధంగా సగం కలిమానే చదివించినవారు మరియు ఆ విధంగా చదివినవారు ఇరువురూ ముస్లిమ్‌లు కారు. **'ముహమ్మద్ రసూలుల్లాహ్'** అని స్వీకరించనివారు ఖుర్ఆన్ ప్రకారంగా కాఫిర్లు అవుతారు.

ముహమ్మద్(స)వారికి విధేయత చూపే విషయంలో మరొక ఖుర్ఆన్ ఆయత్‌ను ఇక్కడ గుర్తుచేస్తున్నాము.

**"దైవప్రవక్త మీకు ఇచ్చిన దానిని తీసుకోండి. ఆయన మిమ్మల్ని నిషేధించిన దాని జోలికి పోకండి"** (అల్ హష్ర్ : 7)

క్రింది సహీహ్ హదీస్‌లో ముహమ్మద్(స)వారు గ్రంథప్రజలు చెప్పేది నిజమనిగాని, అబద్ధమనిగాని చెప్పవద్దు అన్నారు. అంటే అలా అనడాన్ని ఆయన(స) మనకు నిషేధించారు.

అబూహురైరా(రజి) ఉల్లేఖనం : గ్రంథప్రజలు 'తౌరాత్'ను హెబ్రూలో చదివి, దానిని అరబీ భాషలో ముస్లిములకు వివరిస్తుండేవారు. అల్లాహ్ యొక్క సందేశహరులు చెప్పారు : ''**గ్రంథప్రజలు చెప్పేది నిజమనిగాని, అబద్ధమని గాని చెప్పవద్దు**. కాని (బదులుగా) చెప్పండి, 'మేము అల్లాహ్‌ను మరియు ఏదైతే మాపై అవతరింపబడిందో దానిని మరియు ఏదైతే మీపై అవతరింప బడ్డాయో వాటిని విశ్వసిస్తున్నాము''.

**(సహీహ్ బుఖారీ, నెం. 7362, సంపుటి 9, పుస్తకం 96, అధ్యాయం:25)**

కాని నేడు డిబేట్లలో మరియు తులనాత్మక అధ్యయనాలలో ద గ్రేట్ అనే బిరుదులతో పిలుపించుకోబడే 'దాయీలు' పై ఖుర్ఆన్ ఆయత్‌కు మరియు పై హదీస్‌కు వ్యతిరేకంగా పనిచేస్తున్నారు. కాబట్టి వీరు అల్లాహ్‌కు మరియు ఆయన ప్రవక్తకు విధేయత చూపిస్తున్నారా? ముహమ్మద్(స)వారు నిషేధించిన విధంగా మనం ఇతర గ్రంథాలపై ఎటువంటి కామెంట్ చేయకుండా ఆయన(స)కు విధేయత చూపాలి.

## అవిధేయత

విధేయత చూపని వ్యక్తుల గురించి క్రింది ఖుర్ఆన్ వాక్యంలో కూడా చెప్పబడింది.

**"నిశ్చయంగా అల్లాహ్‌ను మరియు ఆయన ప్రవక్తలను తిరస్కరించే వారూ మరియు అల్లాహ్ మరియు ఆయన ప్రవక్తల మధ్య బేధభావం చూపగోరే వారూ (అల్లాహ్‌ను విశ్వసించి, ప్రవక్తలను తిరస్కరించేవారూ) మరియు : "మేము కొందరు ప్రవక్తలను విశ్వసిస్తాము, మరి కొందరిని తిరస్కరిస్తాము"అని అనేవారూ మరియు (విశ్వాస-అవిశ్వాసాలకు) మధ్య మార్గాన్ని కల్పించ**

**గోరేవారూ - ఇలాంటివారే - నిస్సందేహంగా సత్య తిరస్కారులు (కాఫిర్లు). మరియు సత్య తిరస్కారుల కొరకు మేము అవమానకరమైన శిక్షను సిద్ధపరచి ఉంచాము.''** (ఖుర్'ఆన్ 4:150-151)

పై ఆయత్‌లో నాలుగు రకాల వ్యక్తుల గురించి చెప్పడం జరిగింది.

1. అల్లాహ్‌ను మరియు ఆయన ప్రవక్తను తిరస్కరించేవారు.
2. అల్లాహ్ మరియు ఆయన ప్రవక్త మధ్య బేధభావం చూపేవారు. (పైన చెప్పుకున్నాం. అల్లాహ్‌కు విధేయత చూపి, ఆయన ప్రవక్తకు విధేయత చూపకపోవడం.)
3. ప్రవక్తలలో కొందరిని విశ్వసించి, మరికొందరిని తిరస్కరించేవారు.
4. విశ్వాసానికి మరియు అవిశ్వాసానికి మధ్య మార్గాన్ని కల్పించ గోరువారు.

**పై వ్యక్తులందరూ ఖుర్'ఆన్ ప్రకారం కాఫిర్లే!**

## ముహమ్మద్(స)వారి ఆగ్రహం

జాబిర్ బిన్ అబ్దుల్లా (రజి) ఉల్లేఖనం : **ఉమర్ బిన్ అల్-ఖత్తాబ్(రజి) తౌరాత్ ప్రతినొకదానిని రసూలుల్లాహ్(స)వారి దగ్గరికి తీసుకువచ్చి అన్నారు: "ఓ రసూలుల్లాహ్(స)! ఇది తౌరాత్ ప్రతి. ఆయన(స) మౌనం వహించారు. ఆయన(ఉమర్-రజి) దానిని చదవడం ప్రారంభించారు. రసూలుల్లాహ్(స)వారి ముఖం (రంగు) మారుతుంది. అబూబకర్ అన్నారు: 'నీ తల్లి నీకోసం శోకించు గాక! రసూలుల్లాహ్(స)వారి ముఖాన్ని చూడవా?' ఉమర్ (రజి) రసూలుల్లాహ్(స)వారి ముఖాన్ని చూచి అన్నారు 'అల్లాహ్ యొక్క ఆగ్రహం నుండి ఆయన సందేశహరుల(స)వారి ఆగ్రహం నుండి నేను అల్లాహ్ శరణు వేడుకుంటున్నాను. అల్లాహ్‌ను ప్రభువుగాను, ఇస్లామ్‌ను ధర్మంగానూ,ముహమ్మద్(స)ను ప్రవక్తగానూ నేను విశ్వసిస్తున్నాను'. అప్పుడు రసూలుల్లాహ్(స)వారు ఇలా అన్నారు : ఎవరి చేతులలో ముహమ్మద్ ప్రాణమున్నదో ఆయన సాక్షి! ఒకవేళ మూసా(అ) వారు మీముందుకు వస్తే, నన్ను వదిలేసి, ఆయనను అనుసరిస్తే, మీరు నిశ్చయంగా సన్మార్గం నుండి తప్పిపోతారు. మూసా(అ) బ్రతికుంటే, నా ప్రవక్త పదవిని తెలుసుకుంటే, ఆయన నన్నే అనుసరిస్తారు'. (తిర్మిదీ, దారిమీ నెం. 115-116)**

పై హదీస్‌లో ఉమర్(రజి)వారు కేవలం 'ఇది తౌరాత్ ప్రతి' అని చెప్పి చదవడం ప్రారంభించారు. దానిని అనుసరిస్తానని ఆయన చెప్పలేదు. ప్రవక్త(స)వారి ఆగ్రహాన్ని చూసి ఏ విధంగా ఉమర్(రజి) స్పందించారో చూశాము. పై హదీస్‌ను రెండు, మూడు సార్లు చదవండి.

మరో సందర్భంలో మరో అనుచరుడు ఏ విధంగా స్పందించారో క్రింది హదీస్‌లో చూడండి.

అబ్దుల్లా బిన్ అబ్బాస్(రజి) ఉల్లేఖనం : అల్లాహ్ యొక్క సందేశహరులు ఓ వ్యక్తి చేతికి బంగారపు ఉంగరాన్ని చూశారు. ఆయన(స) దానిని తీసేసి విసిరేశారు. మరియు చెప్పారు : మీలో ఎవరైనా వెళ్ళి కాలుతున్న బొగ్గుని తీసుకుని వచ్చి మీ చేతిలో పట్టి ఉండగలరా? (ఉంచుకోవడానికి ఇష్టపడతారా?)'' రసూలుల్లాహ్(స)వారు (అక్కడినుండి) వెళ్ళిన తరువాత అతనికి చెప్పబడింది : "నీ ఉంగరాన్ని తీసుకుని దాని నుండి మేలును పొందు (దానిని అమ్ముకోవడం ద్వారా)''. అతను చెప్పాడు : "లేదు, అల్లాహ్ సాక్షి, రసూలుల్లాహ్(స)వారు విసిరేసిన దానిని నేను ఎన్నటికీ తీసుకోను''.

**(సహీహ్ ముస్లిమ్, 5472, పుస్తకం 37, అధ్యా.11, సంపుటి 5)**

బంగారాన్ని పురుషులు ధరించడాన్ని ముహమ్మద్(స)వారు అప్పటికే నిషేధించారు. కాబట్టి నిషేధించిన వాటిని ఆచరణలో చూడగానే ప్రవక్త(స)వారు విసిరేసారు. బంగారాన్ని ధరించడం పురుషులకి హరామ్. కాని స్త్రీలు ధరించవచ్చు. కాబట్టి ఆ ఉంగరాన్ని అతను తన భార్యకు ఇచ్చుకోవచ్చు లేదా అమ్ముకోవచ్చు. కాని ప్రవక్త(స) ఆగ్రహం కలిగించినదానిని వదులుకోవడానికే సిద్ధపడ్డారు.

పై హదీస్‌లు చదివిన తరువాత ముహమ్మద్(స)వారు నిషేధించిన వాటిని చేసే ఏ సోదరుడైనా తగిన విధంగా స్పందించి ఇప్పటికైనా ప్రవక్త(స)వారికి విధేయత చూపిస్తారని ఆశిస్తున్నాము.

**అల్లాహ్ అనుగ్రహం :**

".... అల్లాహ్ అనుగ్రహం పట్ల నిరాశ చెందకండి. నిశ్చయంగా, **సత్య తిరస్కార (కాఫిర్)జాతికి చెందినవారు తప్ప, ఇతరులు అల్లాహ్ అనుగ్రహం పట్ల నిరాశ చెందరు**'' (ఖుర్'ఆన్ 12:87)

**కాబట్టి పై ఆయత్ ద్వారా అల్లాహ్ అనుగ్రహంపై నిరాశ చెందడం కూడా 'కాఫిర్' లక్షణంగా తెలుస్తుంది.**

సాధారణంగా కొంతమంది ఇలా చెబుతూ ఉంటారు :

"ప్రతీరోజూ నమాజ్ చేస్తున్నాము. అల్లాహ్ అంటే ఎంతో నమ్మక ముంది. కాని అల్లాహ్ మాకు కష్టాలు కలుగజేస్తున్నాడు. మా మీద దయలేదు''.

అంటే వీరికి అల్లాహ్ గురించి పూర్తిగా తెలియదా? అల్లాహ్‌ను విశ్వసించామని భ్రమిస్తూ ఈ విధంగా వ్యాఖ్యలు చేస్తున్నారా?

"ఇక అల్లాహ్‌పై అసత్యాలు కల్పించేవాని కంటే, లేదా ఆయన సూచనలను అసత్యాలని తిరస్కరించే వానికంటే మించిన దుర్మార్గుడెవడు? ....'' (ఖుర్'ఆన్ 7:37)

## సత్య తిరస్కారులతో ఎలా ప్రవర్తించాలి?

"ఓ విశ్వాసులారా! మీలో ఎవరైనా తన ధర్మం (ఇస్లామ్) నుండి వైదొలగితే, అల్లాహ్ త్వరలోనే ఇతర ప్రజలను తేగలడు. వారు ఆయనకు ప్రియులైన వారై ఉంటారు. మరియు ఆయనను ప్రేమిస్తారు. వారు విశ్వాసుల పట్ల మృదువుగా, **సత్య తిరస్కారులు పట్ల కఠినంగా ప్రవర్తించే వారునూ**, అల్లాహ్ మార్గంలో ధర్మపోరాటం చేసేవారునూ మరియు నిందించేవారి నిందలకు భయపడని వారునూ అయి ఉంటారు. ఇది అల్లాహ్ అనుగ్రహం, ఆయన దానిని తాను కోరిన వారికి ప్రసాదిస్తాడు. మరియు అల్లాహ్ సర్వోపగతుడు, సర్వజ్ఞుడు. **(ఖుర్'ఆన్ 5:54)**

**కనుక నీవు సత్యతిరస్కారులకు కొంత వ్యవధినివ్వు!** వారిపట్ల మృదువుగా వ్యవహరించు (ఖుర్'ఆన్ 86:17)

సత్యాన్ని తిరస్కరించడమే కాకుండా, దుర్మార్గంతో దౌర్జన్యానికి మరియు హింసకు పాల్పడే వారున్నారు. అటువంటి సత్య తిరస్కారుల విషయంలో కఠినంగా వ్యవహరించాలి. **కాని ఇతర కాఫిర్ల పట్ల మృదువుగానే వ్యవహరించాలని తెలుస్తుంది.**

"ఓ విశ్వాసులారా! **మీ ధర్మాన్ని ఎగతాళిగా నవ్వులాటగా పరిగణించే వారు** పూర్వగ్రంథ ప్రజలైనా, లేదా సత్య తిరస్కారులైనా, వారిని మీ స్నేహితులుగా చేసుకోకండి. మరియు మీరు విశ్వాసులే అయితే అల్లాహ్ యందు భయభక్తులు కలిగి ఉండండి. (ఖుర్'ఆన్ 5:57)

**"మరియు వాస్తవానికి, (అల్లాహ్) మీ కొరకు మీ గ్రంథంలో (ఈ విధమైన ఆజ్ఞ) అవతరింపజేశాడు : "ఒకవేళ మీరు అల్లాహ్ సూక్తులను గురించి తిరస్కారాన్ని మరియు పరిహాసాన్ని వింటే! అలా చేసేవారు, (ఆ సంభాషణ వదిలి) ఇతర సంభాషణ ప్రారంభించనంత వరకు మీరు వారితో కలిసి కూర్చోకండి!" అలా చేస్తే నిశ్చయంగా, మీరు కూడా వారిలాంటివారే! నిశ్చయంగా అల్లాహ్ కపటవిశ్వాసులను మరియు సత్య తిరస్కారులను అందరినీ నరకంలో జమచేస్తాడు"** (ఖుర్'ఆన్ 4:140)

పై ఆయత్‌కి స్పష్టమైన ఉదాహరణ :

కాకినాడ జోకర్, హైదరాబాద్ పిట్టలదొరల దుష్టద్వయం ఖుర్'ఆన్‌పై మరియు ముహమ్మద్(స)వారిపై ఎటువంటి నీచ ఆరోపణలు చేసి, ఎగతాళి చేశారో "**ముహమ్మద్(స)వారిపై ప్రపంచ వ్యాప్తంగా జరుగుచున్న దుష్ప్రచారం**" పుస్తకంలో వివరించాము. కొంతభాగం "**సృష్టికర్త పేరు ఏమిటి?**" పుస్తకంలోనూ వివరించాము.

**ఆ డిబేట్‌లో వారి తిరస్కారాన్ని, పరిహాసాన్ని వింటూ వారి ఎదురుగా కూర్చున్న ముస్లిములు ఎటువంటివారు?**

ఈ ప్రశ్నకు సమాధానం పై ఖుర్'ఆన్ ఆయత్ చెబుతుంది.

పై ఖుర్'ఆన్ ఆయత్ ప్రకారం, వారు కూడా '**పరిహసించే వ్యక్తుల వంటివారే**'నని తెలుస్తుంది.

ఈ పరిహాసానికి, తిరస్కారానికి బాధ్యత వహించవలసినవారు - అటువంటి డిబేట్ల ద్వారా ధనార్జన చేద్దామనుకున్న దుర్మార్గులు. ఇలాంటి వారు దాయీలుగా చెలామణి అవుతుంటే, **ముస్లిమ్ సభ్య సమాజం ఎప్పుడు మేల్కొంటుంది?** ఇటువంటి కార్యక్రమాలు ఆపడానికి ఎప్పుడు ఈ సమాజం ప్రయత్నం చేస్తుంది?

కాబట్టి ఇటువంటి డిబేట్లకు హాజరయ్యేవారు మరియు ఇటువంటి నీచపన్నాగాలను నిరోధించనివారు కూడా ఓసారి ఆలోచించుకోవాలి!

**"మరియు నీవు సత్య తిరస్కారుల (కాఫిర్ల) మరియు కపట విశ్వాసుల (మునాఫిక్‌ల) మాటలకు లోబడకు మరియు వారి వేధింపులను లక్ష్యపెట్టకు మరియు కేవలం అల్లాహ్‌నే నమ్ముకో. మరియు కార్యకర్తగా కేవలం అల్లాహ్‌యే చాలు!** (ఖుర్'ఆన్ 33:48)

పై ఆయత్‌లో అల్లాహ్ ముందుగానే హెచ్చరించినా సరే, ఖుర్'ఆన్ వారించినా సరే లక్ష్యపెట్టకుండా కాఫిర్ల మరియు మునాఫిక్‌ల మాటలకు కొందరు లోబడి పనిచేస్తున్నారు. షైతాన్‌ను ఉద్దేశించి,

**(అల్లాహ్) అన్నాడు : "ఇక ఇక్కడి నుండి వెళ్ళిపో! నిశ్చయంగా, నీవు భ్రష్టుడవు" (ఖుర్'ఆన్ 38:77)**

అల్లాహ్‌కు ఎంతో విధేయుడైన ఇబ్లీస్, అల్లాహ్ యొక్క ఓ ఆదేశాన్ని తిరస్కరించి కాఫిర్‌గా మారిపోయాడు. ఈ షైతాన్ వలే ఎందరో జ్ఞానాన్ని సంపాదించుకుని అల్లాహ్‌పై విధేయత కలిగిన ముస్లిములు కూడా తరువాయి కాలంలో కాఫిర్లుగా మారిపోయి తీవ్ర అవమానాలకు గురియైన సంఘటనలు చరిత్రలో ఎన్నో ఉన్నాయి.

ఈ విధంగా కాకూడదని ఖుర్'ఆన్ ముందుగానే హెచ్చరించింది.

**"ఓ విశ్వసించిన ప్రజలారా! మీరు గ్రంథ ప్రజలలో కొందరి (మాటలు విని) వారిని అనుసరిస్తే! వారు మిమ్మల్ని, విశ్వసించిన తరువాత కూడా సత్య తిరస్కారులు (కాఫిర్లు)గా మార్చి వేస్తారు"** (ఖుర్'ఆన్ 3:100)

పై హెచ్చరికను లెక్కచేయనివారు ఫలితం అనుభవించారు.

క్రింది హదీస్‌లను చదవండి :

సహ్ల బిన్ సాద్(రజి) ఉల్లేఖనం : రసూలుల్లాహ్(స)వారు చెప్పారు, "ఓ వ్యక్తి స్వర్గవాసుల పనులనే చేస్తాడు లేక ప్రజలకు ఆ విధంగా అనిపించేలా చేస్తాడు. అయినప్పటికీ అతడు నరకాగ్నివాసులలో ఒకడవుతాడు. మరియు ఓ వ్యక్తి నరకాగ్ని వాసుల పనులనే చేస్తాడు లేదా ఆ విధంగా ప్రజలకు అనిపించవచ్చు. అయినప్పటికీ అతడు స్వర్గవాసులలో ఒకడు అవుతాడు.

**(సహీహ్ ముస్లిమ్, 6741, పుస్తకం 46, అధ్యా. 1, సంపుటి 7)**

అబూహురైరా (రజి) ఉల్లేఖనం : ఓ వ్యక్తి చాలాకాలం పాటు స్వర్గవాసుల పనులనే చేస్తూ ఉంటాడు, తరువాత అతని పనులు నరకాగ్నివాసుల పనులలోని ఒక పనితో ముగిసిపోతాయి. మరియు ఓ వ్యక్తి నరకాగ్ని వాసుల పనులను చాలాకాలంపాటు చేస్తాడు, తరువాత అతని పనులు స్వర్గ నివాసుల పనులలోని ఓ పనితో ముగిసిపోతాయి.

**(సహీహ్ ముస్లిమ్, 6740, పుస్తకం 46, అధ్యా. 1, సంపుటి 7)**

ఏ మనిషి ఎప్పుడు ఈ లోకాన్ని వీడుతాడో తెలియదు. మరు క్షణంలోనే ఈ లోకాన్ని వీడే పరిస్థితి రావచ్చు. అందుకని మన ప్రతీ ఆచరణను మన జీవితంలో చివరి ఆచరణగానే భావించి, నిషేధించ బడిన వాటికి దూరంగా ఉంటూ, మంచి ఆచరణే మన చివరి ఆచరణ కావాలని, స్వర్గవాసులలోనే మనముండేలా చేయమని, అల్లాహ్‌ను వేడుకుంటున్నాము. (ఆమీన్)

ఓ అల్లాహ్! మమ్మల్ని ఎల్లప్పుడూ ముస్లిమ్‌గానే (అల్లాహ్‌కు విధేయుడుగానే) స్థిరంగా ఉంచు. ఆమీన్!

### తెలుగు భాషలో మాట్లాడితే కాఫిరా?

కొన్ని ప్రాంతాలలో మస్‌జిద్‌లో తెలుగు మాట్లాడేవారిని 'ఉర్దూ' మాట్లాడే ముస్లిములు చులకన చేస్తున్నారని చాలామంది సోదరులు ఆవేదన వ్యక్తం చేశారు. మరికొన్ని ప్రాంతాలలో తెలుగు మాట్లాడితే 'కాఫిర్'తో పోల్చుతున్నారని మా దృష్టికి వచ్చింది. ఇది చాలా దురదృష్టకరమైన విషయం.

మూసా(అ)వారు **హెబ్రూ** భాషలో మాట్లాడారు. ఈసా(అ)వారు **అరమాయిక్** భాషలో మాట్లాడారు. ముహమ్మద్(స)వారు **అరబీ** భాషలో మాట్లాడారు. 'ఉర్దూ' భాషలో ఏ ప్రవక్తగారు కూడా మాట్లాడలేదు. ఎందుకంటే చిట్టచివరి సందేశహరులైన ముహమ్మద్(స)వారు మరణించిన తరువాత ఎన్నో శతాబ్దాలకు తయారైన భాష ఇది. ముహమ్మద్(స)వారు చిట్టచివరి ప్రవక్త కాబట్టి, ఇక మరో ప్రవక్త రావడం జరుగదు. కాబట్టి ఉర్దూ మాట్లాడిన ప్రవక్త ఎవరూ ఉండరు.

'ఉర్దూ' అనే పదానికి అర్థం 'సంత' (market). ఈ భాష ముఖ్యంగా అరబీ మరియు హిందీ భాషలలోని పదాలతో ఏర్పడిన **ఓ భారతీయ భాష మాత్రమే**. 'ఉర్దూ' ముస్లిముల భాష అని ఎవరైనా అనుకుంటే అది వారి తెలియనితనానికి నిదర్శనం.

ముస్లిమ్‌లు ప్రపంచంలో ఏ ప్రాంతంలోనైనా జీవించవచ్చు. ఏ భాషలోనైనా మాట్లాడవచ్చు. 'ఉర్దూ' భాష పుట్టి కొన్ని వందల సంవత్సరాలే అయింది. అయినప్పటికీ ఈ భాషను అభివృద్ధి చేసింది గత 500 సంవత్సరాల కాలంలోనే. తెలుగు మరియు ఉర్దూ భారతీయ భాషలే అయినప్పటికీ తెలుగుభాష పురాతనమైనది.

ఉర్దూ భాష ముస్లిముల భాష అనుకోవడం ఓ పెద్ద అపోహ మాత్రమే! ఈ రోజున ఉర్దూ భాషను ముస్లిములు మాత్రమే కాదు, మునాఫిక్‌లు మరియు కాఫిర్లు కూడా మాట్లాడుతున్నారు. అబూ జహల్ వంటి కాఫిర్లు అరబీ భాషలో మాట్లాడారు. ముస్లిములూ అరబీ భాషలో మాట్లాడారు. మాట్లాడుతున్నారు. కాఫిర్లు అరబీలో మాట్లాడారు కాబట్టి, అరబీ భాష కాఫిర్ భాష అవుతుందా?

ముందుగా ముహమ్మద్(స)వారి గురించి అందరికీ బాగా తెలిసేలా ప్రయత్నించాలి. అప్పుడు సత్యాన్ని అర్థమయ్యేలా చెప్పడం చాలా సులభమౌతుంది.

పై ఖుర్ఆన్ ఆయత్‌లు మరియు హదీస్‌లు అన్నీ చదివాక, ఎవరికివారు ఓసారి ఆలోచించుకుంటే, తాము నిజంగా ముస్లిములేనా? లేక తమలో కూడా కాఫిర్ లక్షణాలు ఉన్నాయా? అనే ప్రశ్నలకు వారి అంతరాత్మే, ఇన్షా అల్లాహ్ సమాధానం చెబుతుంది.

ఈ వ్యాసం చదివాక ప్రస్తుత 'దాయీ'లకు ఖుర్ఆన్ జ్ఞానం ఎంత ఉందో పాఠకులకు స్పష్టంగా అర్థమౌతుందని భావిస్తున్నాము. ఖుర్ఆన్ గ్రంథాన్ని వీలయితే తఫ్సీర్‌తో సహా చదవండి.

'కాఫిర్' విషయానికి సంబంధించి మరికొన్ని ఆయత్‌ల రిఫరెన్స్‌లను ఆసక్తిగలవారి కొరకు క్రింద అందిస్తున్నాము.

ఇన్షా అల్లాహ్, వచ్చే సంచికలో మరో పదం గురించి వివరాలు అందిస్తాము.

**2:**19,24,34,41,89,90,98,104,191,217,250,254,264,286
**3:**13,28,32,100,131,141,147
**4:** 37,101,102,139,140,141,144,151,161 **5:** 44,54,102
**6:** 122,130 **7:** 37,45,50,76,93,101 **8:** 7,14,18
**9:** 2,26,32,37,49,55,85,125 **10:** 2,86 **11:** 19,42 **12:** 37,87
**13:** 14,35 **14:** 2 **16:** 27,83,107 **17:** 8 **18:** 100,102
**19:** 83 **21:** 36 **22:** 44 **23:** 117 **25:** 26,52,55 **26:** 19
**27:** 43 **28:** 48,82,86 **29:** 47,54,68 **30:** 8,13,45 **32:** 10
**33:** 8,48,64 **34:** 34 **35:** 39 **36:** 70 **38:** 4,74 **39:** 32,59,71
**40:** 14,25,50,74,85 **41:** 7,14 **42:** 26 **43:** 24,30 **46:** 6
**47:** 10,11 **48:** 13 **50:** 2 **54:** 8 **58:** 4,5 **61:** 8 **64:** 2
**67:** 20,28 **69:** 50 **70:** 2 **71:** 26 **74:** 10,31 **76:** 4
**78:** 40 **86:** 17 **109:** 1

### ఇన్నాలిల్లాహి వ ఇన్నాఇలైహి రాజిఊన్

మా శ్రేయోభిలాషి మరియు మన ధార్మిక సోదరుడు **డా. ఫరూఖ్ అన్వర్** (విశాఖపట్నం) ఈ డిశంబర్ నెలలో మరణించారు. ఇన్నా లిల్లాహి వ ఇన్నా ఇలైహి రాజిఊన్. మన సోదరుడు నిరాడంబరంగా ఉంటూ ఇస్లామీయ కార్యక్రమాలలో చురుగ్గా పాల్గొనేవారు. మన సోదరునికి స్వర్గంలో ఉత్తమ స్థానాన్ని అనుగ్రహించమని హృదయ పూర్వకంగా అల్లాహ్‌ను వేడుకుంటున్నాము (ఆమీన్). వారి తల్లిదండ్రులకు మరియు భార్యాబిడ్డలకు సహనం వహించే భాగ్యాన్ని ప్రసాదించమని అల్లాహ్‌ను వేడుకుంటున్నాము (ఆమీన్).

**- శాంతిబాట టీమ్**

10

# సహజీవనం

## Living Together

- *నయా బీమారి*
- *పెద్దిల్లు - చిన్నిల్లు*

కాలం గడిచే కొద్దీ మనిషి జ్ఞానాన్ని పొంది, ఆరోగ్యవంతమైన సమాజాన్ని నిర్మించుకోవడానికి సహజంగా ప్రయత్నించాలి. కాని నేడు ఆధునిక మానవుడు జ్ఞానాన్ని కోల్పోతున్నాడు. ఇప్పుడు మన సమాజానికి సోకిన కొత్త రోగం సహజీవనం.

పెళ్ళికాకుండా స్త్రీ, పురుషులు పరస్పరం ఇష్టపడి ఒకే ఇంటిలో కలిసి జీవించడమే సహజీవనం. అయితే ఇది మనకు కొత్తదేమీ కాదని, మన దేశంలో చిన్న ఇల్లు (చిన్నిల్లు) మరియు పెద్ద ఇల్లు (పెద్దిల్లు) తెలిసిన ప్రతీ ఒక్కరికీ ఈ సహజీవనం గురించి తెలిసినదే అనవచ్చు. పెద్ద ఇల్లు అంటే పెళ్ళి చేసుకున్న భార్యతో ఆ ఇంటిలో జీవనం సాగిస్తూనే, మరో స్త్రీతో వేరే ఇంటిలో వివాహం చేసుకోకుండా ఎవరైనా శారీరక సంబంధాన్ని కలిగి ఉన్నప్పుడు, ఆ రెండో ఇల్లు చిన్నిల్లు అవుతుంది.

కాని ఈ సహజీవనానికి మరియు 'పెద్దిల్లు-చిన్నిల్లు' వ్యవహారానికి మధ్య తేడా ఉంది. ఈ తరహా వ్యవహారంలో రెండవ స్త్రీ, ఉంచుకోబడిన స్త్రీగా సమాజంలో గౌరవం లేకుండా బ్రతుకుతుంది. ఈ రెండవ స్త్రీతో సంబంధం చట్టబద్ధమైనది కాదు మరియు కేవలం శారీరక సంబంధం మాత్రమే ఉంటుంది. అటువంటి స్త్రీకి బిడ్డలుంటే, వారు సమాజంలో హేళనకు గురి అవుతారు. ఈ విధంగా కుటుంబం కోసం ఓ స్త్రీతో వివాహం, అదనంగా శారీరక కోరికలు తీర్చుకోవడానికి మరో స్త్రీతో వివాహేతర సంబంధం.

ఈ వ్యవహారంలో వివాహం చేసుకున్న భార్యకి సమాజంలో ఉండే గౌరవంలో ఎటువంటి లోటు రాదు. అదనంగా ఆమెపై జాలి పడతారు. కాని వివాహానికి నోచుకోని ఆ రెండవ స్త్రీని మరియు ఆమె బిడ్డలని సమాజం హీనంగా చూస్తుంది. అంతేకాదు, వారికి ఏ విధమైన భరోసా కూడా ఉండదు. ఏ క్షణంలోనైనా ఆమెను ఆ వ్యక్తి వదిలేయవచ్చు. చట్టంగాని, ఇరుగు పొరుగుగాని ఆమెకు ఏ విధంగానూ సహాయ పడలేరు. ఇటువంటి పరిస్థితి ఏ స్త్రీకి రాకూడదని, ప్రతీ స్త్రీ కోరుకుంటుంది. ఇటువంటి పరిస్థితులకు కొందరు స్త్రీలు తల ఒగ్గడానికి సమాజ పరిస్థితి ఓ ముఖ్యకారణం. అవన్నీ ఇక్కడ చర్చించదలచుకోలేదు.

కాని నేటి తరంలో కొంతమంది ఇటువంటి సంబంధాలనే ఏర్పరచు కోవడానికి ఆసక్తి చూపుతున్నారు. వారు బహిరంగంగా మీడియా ముందు తాము చేసేది సరియైనదేనని చెబుతూ, ఇది ఆధునిక సంబంధమని, పాత సంబంధాలకి నూకలు చెల్లిపోయాయని మాట్లాడుతున్న వీరికి మానసిక పరిపక్వతగాని, జీవితంపై ఓ అవగాహనగాని లేకపోవడమే కారణం.

వయస్సులో ఉండి ఇంటర్ చదివిన తరువాత రకరకాల కోర్సుల కొరకు వేరే ఊర్లలో చదువుకునే అమ్మాయి, అబ్బాయి ఒకే ఇంటిలో ఉండి సహజీవనం చేస్తూ చదవుకోవడం నగరాలలో ఈ మధ్య కాలంలో ప్రారంభమైంది. అయితే ఈ రకమైన సహజీవనాల గురించి వారి తల్లిదండ్రులకు తెలియదు. ఒకవేళ తల్లిదండ్రులు అడ్డుచెప్పినా ఏదో ఒక ఉద్యోగం గ్యారంటీగా వస్తుందనే ధైర్యం వారిని ఎదిరించేలా చేస్తుంది.

ఒకప్పుడు నగరాలలో, పట్టణాలలో పెళ్లికానివారికి ఇండ్లు అద్దెకు ఇచ్చేవారు కాదు. కాని నేడు పెళ్లికాని ఓ యువతి, ఓ యువకుడు వివాహం చేసుకోకుండానే కలిసి ఉండటానికి వచ్చారని తెలిసినా అద్దెకు ఇస్తున్నారు. పెద్ద మొత్తంలో అద్దెల కోసం నైతిక విలువలను గాలికి వదిలేస్తున్నారు ఇంటి యజమానులు.

బాగా చదువుకుని ఓ మంచి కెరీర్ కోసం ఉన్నత చదువుల కోసం వచ్చే ఈ యువత సహజీవనం వైపు ఎందుకు మొగ్గు చూపుతోంది? వివాహ వ్యవస్థకు వీరెందుకు విలువ ఇవ్వడం లేదు? ప్రస్తుత వ్యవస్థలో కుటుంబ వ్యవస్థ పతన దిశగా సాగుతుంది. తల్లిదండ్రులిద్దరూ ఉద్యోగాలు చేస్తున్నారు. ఉద్యోగాలతో అలిసిపోయి ఇంటికి చేరుకునే వీరు యాంత్రికంగా బ్రతుకుతున్నారు. ఇద్దరూ పనిచేయడం వలన లగ్జరీ జీవితం గడపవచ్చు అని ప్రారంభంలో అనుకుంటారుగాని, సుఖాన్ని కోల్పోతున్నామని వారు తెలుసుకునేసరికి సమయం మించిపోతుంది. వీరికి తమ పిల్లల మంచి చెడ్డలు పట్టించుకోవడానికి సమయం దొరకదు.

తల్లిదండ్రులు ఉద్యోగాలకు వెడితే, ఈ పిల్లలు స్కూలు నుండి వచ్చాక వారికి నేస్తం టి.వి., డివిడిలు మొ॥వి. మానసిక పరిపక్వత ఇంకా రాని ఆ పిల్లలను నైతికంగా నాశనం చేయడానికి టి.వి. ఒక్కటి చాలు. 'టెన్త్ క్లాస్, బోయ్స్, బృందావనకాలనీ' వంటి ఎన్నో సినిమాలు నైతిక విలువలు నాశనం చేయడానికి మేమున్నామంటూ ముందుకు వస్తున్నాయి.

చదువుపై దృష్టి కేంద్రీకరించవలసిన వయస్సులో, నైతికంగా ఎదగ వలసిన వయస్సులో, ఆ యుక్త వయస్సులో శారీరక కోరికల వైపు ఆలోచనలు వారిలో ఎక్కువవుతున్నాయి. ఇటువంటి ఆలోచనలను సినిమాలు బాగా పెంచి పోషిస్తున్నాయి.

తల్లిదండ్రుల దగ్గర, మన గురువుల దగ్గర నేర్చుకున్న నైతిక విలువలు రోగ నిరోధక శక్తిలా పనిచేసి, ఇటువంటి ఆలోచనల నుండి కాపాడేవి. కాని నేటి పరిస్థితులు ఆ విధంగా లేవు. జీవితంపై అవగాహన లేకుండా, శారీరక కోర్కెలతో నేటి యువత సహజీవనం వైపు మొగ్గు చూపుతుంది. చట్టం కూడా నెమ్మది నెమ్మదిగా వారిని సమర్థించే దిశలోనే వెళ్తుంది.

పాశ్చాత్య దేశాల నుండి ఈ రోగం ఎయిడ్స్‌లా ప్రపంచమంతా ప్రాకుతుంది. ఈ వ్యాసం కోసం ఎన్నో ఇంటర్వ్యూలు అధ్యయనం చేయడం జరిగింది. 16 సంవత్సరాలు నిండే సరికి, కొన్ని దేశాలలో ఎందరో అబ్బాయిలతో శారీరక సంబంధాలు కలిగిఉండడం సాధారణమై పోయింది. సరదా కోసమే అలా చేస్తున్నామని కొందరు యువతులు చెప్పడాన్ని ఓ సోదరి ఖండించింది. తను కూడా 16 సంవత్సరాల

వయస్సులో సరదా కోసమే ఆ విధంగా చేశానని, కాని దానివలన 'సరదా' కాదు కదా, మానసిక వత్తిడి పెరిగిందని అది తనను డిగ్రేడ్ చేసిందని, అంతకు ముందుకంటే లోన్లీగా మరియు ఎంప్టీయర్‌గా ఫీలయ్యానని ఓ పత్రికకు ఇచ్చిన ఇంటర్వ్యూలో చెప్పారు. ఓ ప్రక్క గర్భవతి అవుతానేమోనని భయంతో నరకం అనుభవించానని చెబుతుంది. ఏ యువతి అయినా సరే, పెళ్లికి ముందు ఓ అబ్బాయితో శారీరక సంబంధం ద్వారా తాను ప్రేమించబడు తున్నాను అని అనుకుంటే అది పొరపాటేనని, అది తనను చీప్‌గా ఫీలయ్యేలా చేస్తుందని చెప్పారు.

కెనడాలో సహజీవనం చేసే ప్రతీ 100 జంటల్లో కేవలం 12 జంటలు మాత్రమే 10 సంవత్సరాల వరకూ కలిసి ఉంటున్నారు. అంతేకాకుండా అక్కడ సహజీవనం చేసే జంటలలో అత్యధిక శాతం 3 సంవత్సరాల లోనే ముగిసిపోతున్నాయి.

**ఇది ఓ హైటెక్ వ్యభిచారం. అఫీషియల్ మరియు డిగ్నిఫైడ్ వ్యభిచారం.**

వీరిలో మానసిక వత్తిడులు ఎక్కువగా ఉంటాయి. ఈ మానసిక వత్తిడుల గురించి మేము ప్రచురించిన 'ముహమ్మద్(స)వారిపై ప్రపంచ వ్యాప్తంగా జరుగుచున్న దుష్ప్రచారం' పుస్తకంలో పేజీలో వివరించాము. ఈ సహజీవనాల్లో ఎక్కువగా నష్టపోయేది స్త్రీలే. ఈ విపరీత మానసిక వత్తిడిలే హింసకు, ఆత్మహత్యలకు కారణాలు అవుతున్నాయి.

పెళ్లికి ముందు సహజీవనం చేసినవారు, ఆ సహజీవనం ముగించు కున్నాక వివాహాలు చేసుకుంటే, అటువంటివారే ఎక్కువుగా విడాకులు తీసుకుంటున్నారని సర్వేలో వెల్లడైంది.

సహజీవనంలో బాధ్యతలుండవు. ఒకరిపై ఒకరికి హక్కులుండవు. జీవితంలో కమిట్‌మెంట్‌కు ఇష్టపడనివారు సహజీవనానికి ఇష్టపడతారు. మెటీరియలిస్టిక్ వ్యక్తులు కంప్లీట్‌గా కమిట్ కావడానికి ఇష్టపడని వ్యక్తులు వివాహం చేసుకోవడానికి మొగ్గు చూపడం లేదు. మానసికంగా గాని లేదా ఆధ్యాత్మికంగాగాని వివాహం వలన పొందే మేలు కేవలం శారీరకంగా కలిసి జీవించినంత మాత్రాన రాదు. వారి మధ్య ప్రేమ ఉండదు. ఒకరికోసం మరొకరు చేసే త్యాగాలుండవు, శారీరక కోర్కెలు తప్ప.

వారు ఎప్పుడు కావాలంటే అప్పుడు విడిపోవచ్చు. విడాకులు తీసుకునే అవసరం లేదు. వారిని నిందించేవారు ఎవరూ ఉండరు. ఒకవేళ అటువంటి సహజీవనంలో, ఒక భాగస్వామికి ఏదైనా జరిగి మరణిస్తే, అతని సంపదపై స్త్రీ భాగస్వామికి ఎటువంటి హక్కు ఉండదు, పురుష భాగస్వామి వీలునామా వ్రాస్తే తప్ప. సహజీవనం శాశ్వతం కాదు కాబట్టి అతడు వీలునామా వ్రాయడు. శాశ్వతమని భావించేవారే అయితే వివాహమే చేసుకునేవారు.

సహజీవనంలో ఉన్నవారికి పిల్లలు పుడితే, ఆ పిల్లలపై వారికి మమకారం కూడా తక్కువే ఉంటుంది.

మనదేశంలో అయితే, ఈ సహజీవనం చేసేవారికి రెండు ఉపయోగాలు కనిపించవచ్చు. వీటిలో ఒకటి కట్నం ఉండక పోవడం, రెండవది విడాకుల ఖర్చు లేకపోవడం.

కాని కొన్ని సంవత్సరాల వారి సహజీవనం, వారిని జీవితాంతం సంతోషానికి దూరం చేస్తుంది.

మానసికంగా ఎదిగినవారు మరియు సంతోషమయ జీవనాన్ని కోరుకున్న వారు సహజీవనం జోలికి పోరు.

**ముందు జాగ్రత్తలు :**

ఎయిడ్స్ రాకుండా కండోమ్ వాడమని పెద్ద పెద్ద హోర్డింగ్‌లతో ప్రభుత్వమే ప్రచారం చేస్తుంది. బాధ్యతతో ముందుగా హెచ్చరించామని గవర్నమెంట్ భావించవచ్చు. కొందరు మేధావులు భావించవచ్చు.

ఇంటికి నిప్పు అంటుకుంటే, ఆర్పడానికి అగ్నిమాపక దళాన్ని ఏర్పాటు చేయడం అభినందించ దగినదే. కాని ఇంటికి నిప్పు అంటుకోకుండా ముందు జాగ్రత్తలు చాలా అవసరం.

కాబట్టి మనుషులలో ముందుగా నైతిక విలువలు పెంచాలి. ఈ నైతిక విలువలను నాశనం చేసే మీడియా (ప్రింట్, ఎలక్ట్రానిక్ మరియు సినిమా)ను కంట్రోల్ చేయాలి.

ప్రజలు చూస్తున్నారు, మాకు డబ్బు వస్తుంది, ప్రభుత్వానికి ఆదాయం వస్తుంది కాబట్టి ఇటువంటి నీచమైన సినిమాలను తీస్తున్నామని నిర్మాతలు చెప్పవచ్చు. అటువంటి సినిమాలు రాకుండా చేస్తే ప్రజలు తిరగబడతారని కూడా సదరు నిర్మాతలు చెప్పవచ్చు.

ప్రజలు ఆ పనిచేయరు. ప్రజలు తిరగబడేటట్లే అయితే వీరందరూ కంట్రోల్‌లోనే ఉండేవారు. ప్రభుత్వ పన్నులు పెంచినా, ఫీజులు పెంచినా, పెరుగుతున్న ధరలను పట్టించుకోకపోయినా, ముందుగా కాస్త ఎగిరెగిరిపడినా, ఆ తరువాత ప్రజలు వాటికి అలవాటు పడిపోతున్నారు.

ఓ 35 సంవత్సరాల క్రితం బూతు సాహిత్యం కలిగిన పుస్తకాలను దొంగచాటుగా పాన్ షాపులలో అమ్మేవారు. పోలీసులు రైడ్ చేసి వారిపై చర్యలు తీసుకునేవారు. కాని దానిని మించిన బూతు సాహిత్యంతో నేడు సచిత్ర వారపత్రికలు వస్తున్నాయి. ఆ విధంగా మనదేశం అభివృద్ధి చెందిన దేశమని అనుకోవాలేమో!

**నైతిక విలువలు పెరిగినప్పుడు సమాజంలోని ఎన్నో మానసిక రోగాలు సమసిపోతాయి.**

స్త్రీ, పురుషులు కలిసిమెలిసి ఓ హద్దులేకుండా తిరగడమే దీనికి కారణమని చెబితే, వారికి స్వేచ్ఛ అవసరం లేదా? అంటారు. ప్రతీ ప్రాణికి స్వేచ్ఛ కావాలి. నిజమే! కాని అది కూడా హద్దులు దాటే విధంగా ఉండకూడదు.

మనకి ఒక కారు ఉండొచ్చు. దానిలో పెట్రోల్ ఉండవచ్చు. నడపడానికి లైసెన్స్ కూడా ఉండవచ్చు. అందువలన మన దేశరోడ్లపై మన కారును నడుపుకునే స్వేచ్ఛ మనకు ఉండవచ్చు. కాని ట్రాఫిక్ జంక్షన్‌లో రెడ్‌లైట్ పడితే కారును ఆపవలసిన బాధ్యత మనపై ఉంది.

తన కారును ఆపే హక్కు ప్రభుత్వ యంత్రాంగానికి ఎవరిచ్చారని భావించి, ప్రతీవారు బ్రేకులు వేయకపోతే ఏమవుతుంది? ఊహించండి.

ఇక్కడ కూడా అదే జరుగుతుంది. మా జీవితాలు మా ఇష్టం అంటూ స్త్రీ, పురుషులంతా ప్రవర్తిస్తే సమాజమంతా చిన్నాభిన్నమై సర్వనాశనమై

సుఖాన్ని కోల్పోతుంది. సృష్టిలో ప్రతీదానికి స్వేచ్ఛ ఉంది. అలాగే నియంత్రణ కూడా ఉంది.

భూమి స్వేచ్ఛగా తిరుగుతుంది. కాని దాని వేగం పెరిగినా, తగ్గినా అదే విధంగా సూర్యుని నుండి వచ్చే వేడి పెరిగినా, తగ్గినా నాశనమే!

సృష్టికర్తయైన అల్లాహ్ అన్నింటికి ఓ నియంత్రణ ఏర్పాటు చేశాడు.

మనిషికి మాత్రం విపరీతమైన స్వేచ్ఛను ఇచ్చాడు. ఆ స్వేచ్ఛను స్వయంగా మనమే నియంత్రించు కోవడానికి మనకు మార్గాన్ని చూపాడు. ఆ మార్గాన్ని అనుసరిస్తే, సామాజిక రోగాల నుండి మనల్ని మనం కాపాడుకోగలుగుతాము.

**స్త్రీ, పురుషులు విచ్చలవిడిగా కలిసి తిరగడాన్ని ఇస్లాం నిషేధించింది.**

పై విషయాన్ని కుహనా మేధావులు మరో విధంగా తప్పుగా చూపిస్తారు. స్త్రీని నాలుగు గోడల మధ్యే బందిస్తారని లేదా మగవానికి బానిసగా చేశారని. అది ఎంతమాత్రం నిజం కాదు.

**స్త్రీలు మస్జిద్‌లకు వెళ్ళడానికి స్వేచ్ఛ ఉంది. పురుషులతో, పురుషుల మధ్య ఉండి సలాత్ (నమాజ్) చేయరు. కాని వారికి ప్రత్యేక ఏర్పాటు ఉంది. విశ్వాసుల మాతృమూర్తి ఆయిషా(రజి)వారు ధార్మిక తీర్పరిగా సేవలందించారు. ముస్లిమ్ స్త్రీలు యుద్ధాలలో సైతం పాల్గొని క్షతగాత్రులకు సేవచేశారు. విద్యను నేర్పే గురువులుగా పనిచేశారు. పొలాలలో వ్యవసాయ పనులు చేశారు. భర్తలకు సలహాలిచ్చారు. భర్తలతో పాటు ప్రయాణాలు చేశారు.**

**యవ్వనం**

ప్రతీ మనిషి జీవితంలోనూ ఇది ముఖ్యమైన దశ. మనిషి తప్పు దారి పట్టడానికి ఎక్కువ అవకాశమున్న దశ ఇది. ఈ యవ్వన కాలంలో జాగ్రత్తగా ఉండడానికి ముహమ్మద్(స)వారు ఆచరణ యోగ్యమైన ఎన్నో బోధనలు చేశారు. వాటిని పాటిస్తే సహజీవనం వంటి కొత్తరోగాలు సమాజంలో ప్రవేశించవు. స్థలా భావం వలన ఆ హదీస్‌లను ఇక్కడ అందించలేక పోతున్నాము. వాటి గురించి క్లుప్తంగా ఇక్కడ చెబుతున్నాము. ఇన్షా అల్లాహ్ పూర్తి వివరాలతో వీటిని మరో వ్యాసంలో అందిస్తాము.

పరస్త్రీపై దృష్టిపడటం సహజమే. అయితే ఆమెపై దృష్టిపడక పూర్వమే దృష్టిని మరల్చుకోమని ప్రవక్త(స)వారు చెప్పారు. అలీ(రజి)వారికి కూడా ఒక ముఖ్యమైన జాగ్రత్తను చెప్పారు. అదేమిటంటే, పరస్త్రీపై అకస్మాత్తుగా దృష్టిపడితే దృష్టిని మరల్చుకోవాలని రెండవసారి చూడవద్దని చెప్పారు. మొదటి చూపు నీదే కాని రెండవది నీది కాదు (అది షైతాన్ చూపు) అని ఆయన(స) ఉపదేశించారు.

పరస్త్రీతో ఎవరూ లేకుండా ఏకాంతంగా ఉండకూడదు. పరస్త్రీతో ఏకాంతగా ఉంటే, అక్కడ మూడవ వ్యక్తి షైతాన్ అవుతాడు.

స్త్రీ ఒంటరిగా ప్రయాణం చేయవలసి వస్తే, ఆమెకు తోడుగా మహ్రమ్ పురుషుడు ఉండాలి. మహ్రమ్ పురుషుడు అంటే ఆమెతో అతని వివాహం ధర్మసమ్మతం కాదు.

స్త్రీ బయటకి వచ్చినప్పుడు తన శరీర సౌష్టవం తెలియని విధంగా ట్రాన్స్‌పరెంట్ దుస్తులనుగాని లేదా పలుచటి దుస్తులనుగాని ధరించ కుండా శరీరాన్ని అల్లాహ్ ఏ విధంగా అయితే కప్పుకోమని ఆదేశించారో, ఆ విధంగా స్త్రీ ఆచరించినపుడు, ఆమెకు రక్షణ మరియు గౌరవం కలుగుతాయి.

"ఎవరైతే తమ పెదాల మధ్య ఉన్న దానిని (నాలుకను), ఊరువుల మధ్య ఉన్న దాన్ని (మర్మాంగాన్ని) కాపాడుకునే బాధ్యత తీసుకుంటారో, వారికి స్వర్గం లభింప జేసే పూచీ నాది." అని ముహమ్మద్(స)వారు బోధించారు. అంటే తన నోటిని అదుపులో ఉంచుకోవాలి. అదే విధంగా భార్యతో తప్ప ఇతరులతో శారీరక సంబంధాన్ని పెట్టుకోకుండా తనను కాపాడుకోవాలి.

సహజీవనం వైపు నేటి యువత అడుగులు వేయడానికి ముఖ్యంగా బాధ్యత వహించవలసింది తల్లిదండ్రులే.

తమ బిడ్డలను గొప్ప స్థాయిలో చూసుకోవడానికి, వేలు లక్షలు పెట్టి కార్పోరేట్ స్కూళ్లలో, కాలేజీల్లో చదివిస్తూ, ఇంజినీరింగ్, మెడిసిన్‌ల పేరుతో వారిని 24గంటలు గ్రైండర్‌లో వేసి రుబ్బినట్లు, వారికి ఎడతెరిపి లేకుండా కోచింగ్‌లు ఇప్పించి, వేరే ఊర్లలో కాలేజీల్లో జాయిన్ చేసిన తర్వాత ఒక్కసారిగా వారు ఎంతో స్వేచ్ఛను ఫీలవుతున్నారు. జైలు నుండి బయటపడిన ఫీలింగ్ ఉంటుంది వారికి.

ఆ సమయంలోనే తప్పటడుగులు పడుతున్నాయి. అందరూ తప్ప టడుగులు వేస్తారని కాదు. వారు మార్గం తప్పే పరిస్థితికి అనుకూలమైన కాలమిదే.

తాము చేసేపనులు చూడటానికి తల్లిదండ్రులు ఉండరు. కాబట్టి వారికి తల్లిదండ్రుల భయం లేదు. చేసేపని తప్పా? లేక ఒప్పా? అని చెప్పేవారుండరు. వారికి తప్పు, ఒప్పు అని ఎలా తెలుస్తాయి? తాము చదువుకున్న సైన్స్‌గాని, మేథ్స్‌గాని ఇవి తప్పు లేదా ఒప్పు అని చెప్పడానికి ఎటువంటి ఈక్వేషన్స్‌ని నేర్పవు.

మనిషికి ఏది తప్పు? ఏది ఒప్పు? అని చెప్పే ధార్మిక విద్య కావాలి. అది ఖరీదైన చదువుకాదు. కాబట్టి తల్లిదండ్రులకు అదంటే చాలా చిన్న చూపు. వారికి ధార్మిక విద్య కూడా, వారి రెగ్యులర్ చదువుతో పాటు నేర్పించి ఉంటే, వారిలో దైవభీతిని కలుగజేసి ఉంటే, నైతిక విలువలను పెంచే ఇస్లామీయ శిక్షణను చిన్నప్పటి నుండి క్రమక్రమంగా ఇచ్చి ఉంటే, తల్లిదండ్రులకు పిల్లల విషయంలో భయపడవలసిన అవసరం ఉండదు.

ఒక విషయం తప్పు అని తెలిశాక, దైవభీతి గలవారు అది చేయలేరు. అంటే చేయడానికి అవకాశాలు తక్కువ. చేయడానికి పూర్తిగా విముఖత చూపించవచ్చు. ఎందుకంటే తల్లిదండ్రులు చూడకపోయినా మరెవరు చూడకపోయినా, అల్లాహ్ చూస్తున్నారనే భయం వారికి ఉంటుంది.

ఏదైతే పిల్లలకు ముఖ్యమో దానినే ఈ రోజు తల్లిదండ్రులు నిర్లక్ష్యం చేస్తున్నారు. ***దాని పర్యవసానమే డ్రగ్స్, డ్రింక్స్, సహజీవనం, వ్యభిచారం మొదలైన ఎన్నో పాపపు పనుల వైపు యువత పరుగిడుతోంది.*** ఈ వ్యాసానికి అనుబంధ వ్యాసాన్ని బాలబాలికల ప్రత్యేక శీర్షికలో చూడండి.

# పాఠకుల అభిప్రాయాలు

**త్యాగం ...**

ఇబ్రాహీమ్(అ), ఇస్మాయీల్(అ) మరియు హాజిరావారి త్యాగం గురించి ప్రామాణిక వివరాలు మరియు వాటిపై చేసిన విశ్లేషణ బాగుందని చాలామంది పాఠకులు తెలియజేశారు. అల్‌హమ్‌దులిల్లాహి రబ్బిల్ ఆలమీన్.

**'శాంతిబాట' పత్రిక ఏ జమియత్‌కు చెందినది?**

'శాంతిబాట' ఇస్లామీయ పత్రిక. ఈ పత్రిక ఓ జమియత్‌కు చెందినది అని కొందరు అపోహపడుతున్నారని, అదే విధంగా కొందరు కావాలని ప్రచారం చేస్తున్నారని, వారికి ఏ విధంగా సమాధానం చెప్పాలని ఓ పాఠక సోదరుడు అడిగారు.

'ఇస్లామ్'గురించి ప్రామాణిక సమాచారాన్ని పూర్తి ఆధారాలతో తెలుగు తెలిసిన ముస్లిములకు మరియు ముస్లిమేతరులకు అందించాలనే సంకల్పంతో అల్లాహ్ పేరుతో ప్రారంభించబడిన పత్రిక ఇది. ఈ పత్రిక ప్రధానోద్దేశ్యం అందరిచేత ఖుర్'ఆన్ గ్రంథాన్ని మరియు ముహమ్మద్(స)వారి బోధనలను చదివించేలా ప్రోత్సహించడం. ఒకే జమియత్‌కు సంబంధించిన మస్‌జిద్‌లు ఒక నగరంలో చాలా ఉంటాయి. ఎందుకంటే ఆయా ప్రాంతాల లోని ముస్లిములకు సౌకర్యంగా వారికి అందుబాటులో మస్‌జిద్ ఉండాలి కాబట్టి. వేర్వేరు ప్రాంతాల మస్‌జిద్‌లలో 'సలాత్' చేసుకునే వీరంతా వేర్వేరు కాదు కదా! వీరంతా ఒకే జమియత్‌కు చెందినవారు. అదే విధంగా వేర్వేరు జమియత్‌లకు చెందినవారు వారి వారి మస్‌జిద్‌లలో 'సలాత్' చేస్తున్నారు. వీరంతా ముస్లిములే! (అల్లాహ్‌కు విధేయులే). వీరందరికీ ఖుర్'ఆన్ ఒక్కటే. వీరందరికీ ప్రవక్త ఒక్కరే. వీరంతా సహీహ్ బుఖారీ, సహీహ్ ముస్లిమ్, అబూదావూద్, తిర్మిదీ, నసాయీ, ఇబ్నెమాజా హదీస్ గ్రంథాలను స్వీకరించిన వారే!

కాబట్టి వీరందరికీ కామన్‌గా (సర్వసామాన్యంగా) ఉన్న ఖుర్'ఆన్ మరియు ముహమ్మద్(స)వారి బోధనలనే 'శాంతిబాట' పత్రిక ద్వారా అందిస్తున్నాము. 'శాంతిబాట' పత్రిక అందరిదీ. 'శాంతిబాట' ఏదైనా ఓ ప్రత్యేక జమియత్‌కు ఒత్తాసు పలికే పత్రిక కాదు. 'ఇస్లామ్' పేరుతో ఇస్లామ్‌కు వ్యతిరేకంగా జరగుతున్న కార్యకలాపాలను ఖండిస్తూ వివరాలను అందించడమే కాకుండా, ముస్లిములపై మరియు ఇస్లామ్‌పై ముస్లిమేతరులలో నెలకొని ఉన్న అపోహలను తొలగించడానికి 'అల్లాహ్' మాకిచ్చిన శక్తిమేరకు ప్రయత్నిస్తున్నాము.

'శాంతిబాట'ను అన్ని జమియత్‌లకు చెందిన సోదరులు చదువుతున్నారు. వారందరూ శాంతిబాటను ఆదరిస్తున్నారు.

ప్రతీ జమియత్ తమకు అనుబంధంగా ఓ పత్రికను నడుపుతుంది. ఆ పత్రికకు దన్నుగా ఆ సంస్థ పనిచేస్తుంది.

మేము ఏ జమియత్ కొరకూ ఈ పత్రికను నడపడం లేదు. అందువల్లనే కొందరు శ్రేయోభిలాషులు ఇలా అన్నారు: 'ఏ సంస్థ సపోర్ట్ లేకుండా, ఏ ఆర్థిక వనరులు లేకుండా పత్రికను ప్రారంభించి ధైర్యం చేశారు'.

మాకు అల్లాహ్‌యే చాలు అనుకున్నాము. అంతకు మించిన ధైర్యం ఇంకేముంటుంది. పత్రిక ప్రారంభంలో చాలా సమస్యలను అల్లాహ్‌పై మాకున్న విశ్వాసంతో ఎదుర్కొనగలిగాము. ఆయన కరుణామయుడు. ఆయన అనుగ్రహం వలన ఒక సంవత్సరాన్ని పూర్తి చేసుకుని, 'శాంతిబాట' రెండవ సంవత్సరంలో అడుగుపెట్టింది. మా గురించి కనీసం తెలియకుండా, మమ్మల్ని చూడకుండా కర్నూలు, గుంటూరు, ప్రకాశం మొదలైన జిల్లాలలో మాపై నమ్మకముంచి ఎందరో సోదరులు చందాదారులను చేర్పించారంటే అల్లాహ్ అనుగ్రహమే అందుకు కారణం.

'లా ఇలాహ ఇల్లల్లాహ్ ముహమ్మదుర్ రసూలుల్లాహ్' అనే వచనం అర్థం చేసుకుని, దానిని అంగీకరించనప్పుడే ఎవరైనా ముస్లిమ్ (అల్లాహ్‌కు విధేయుడు) అవుతాడు. 'అల్లాహ్'ను ఏకైక ఆరాధ్యుడుగా, ముహమ్మద్(స) వారిని ఆయన ప్రవక్తగా స్వీకరించినవారికి, ఖుర్'ఆన్‌లో అల్లాహ్ ఇలా తెలియజేస్తున్నారు:

**"ఓ విశ్వసించిన ప్రజలారా! మీరు అల్లాహ్‌కు విధేయులై ఉండండి మరియు ప్రవక్తను అనుసరించండి మరియు మీ కర్మలను వ్యర్థం చేసుకోకండి."** (ఖుర్'ఆన్ 47:33)

**"ఇలా అను : అల్లాహ్‌కు మరియు సందేశహరునికి విధేయులై ఉండండి" వారు కాదంటే! నిశ్చయంగా, అల్లాహ్ సత్య తిరస్కారుల (కాఫిర్ల)ను ప్రేమించడు"** (ఖుర్'ఆన్ 3:32)

అల్లాహ్‌కు మరియు ఆయన ప్రవక్తకు విధేయత చూపాలంటే, ఖుర్'ఆన్ ద్వారా అల్లాహ్ చెప్పిన మాటలను మరియు ఖుర్'ఆన్ ఆదేశాల ప్రకారం జీవిస్తూ బోధించిన ముహమ్మద్(స)వారి బోధనలను అనుసరించాలి.

వాటినే మేము తెలియజేస్తున్నాము. అయినప్పటికీ 'శాంతిబాట' ఓ ప్రత్యేక జమియత్‌కు చెందినదేనని ఎవరైనా భావిస్తే, అది వారి విజ్ఞతకే వదిలి వేస్తున్నాము. 'శాంతిబాట' పత్రిక చదివితే ఏది నిజమో అర్థమౌతుంది. ఇది వ్యాపార పత్రిక కాదు. ఇందులో ఎడ్వర్‌టైజ్‌మెంట్లు ఉండవు. ఈ పత్రికకు ఏజెంట్లు, డిస్ట్రిబ్యూటర్లు లేరు. దీనికొరకు పనిచేసే ఉద్యోగులు ఎవరూ లేరు. అయితే కొందరు సోదరులు అల్లాహ్ కొరకు మాత్రమే మాకు తమ సంపూర్ణ మద్దతు నిస్తున్నారు. వారికి అల్లాహ్ శ్రేయోశుభాలను కలుగజేయుగాక! (ఆమీన్)

**మీ అభిప్రాయాలను, విమర్శలను కార్డుపై వ్రాసి 'వెలుగుబాట ఎడ్యుకేషనల్ సొసైటీ' ఎడ్రస్‌కు గాని లేదా velugubaata@gmail.com కు పంపండి.**

## శాంతిబాట చందాదారులకు విజ్ఞప్తి

సంవత్సర చందా రూ. 200/-

గత సంవత్సరం రమదాన్ నెలలో చందాదారులుగా చేరిన సోదరసోదరీమణులకు 'శాంతిబాట' 12 సంచికలనూ (ఆగస్ట్ 2009 నుండి జూలై 2010) అందించాము. తరువాయి కాలంలో చేరినవారు కూడా మొదటి నుండి కావాలని కోరితే, తొలి సంచికను కొందరికి అందించలేకపోయాము. వారికి కూడా ఈ సంచికతో ఒక సంవత్సరం పూర్తి అయింది. కేవలం 6 నెలలకు మాత్రమే చందా కట్టిన వారికి కూడా శాంతిబాటను పంపడం ఆపలేదు. మిగతా 6 నెలలకు వారికి ఇష్టమైతే వారికి వీలున్నప్పుడు పంపిస్తారని భావించాము. కాని ఈ సంచిక నుండి వారికి పంపించడం ఆపివేస్తున్నాము. ఆర్థిక భారం బాగా పెరిగిపోవడంతో ఈ నిర్ణయం తీసుకోవలసి వచ్చింది.

సంవత్సర చందా త్వరగా పంపించమని కోరుతున్నాము

రాబోయే సంచికనుండి రెండవ సంవత్సరానికి చందా కట్టిన వారికి మాత్రమే ఇన్షా అల్లాహ్ పత్రికను పంపిస్తాము. ఎటువంటి ఎడ్వర్టైజ్‌మెంట్లు లేకుండా, క్వాలిటీ పేపర్‌తో 1/4 డెమీ సైజులో అందిస్తున్న ఈ పత్రికను తొలి తెలుగు పరిశోధనాత్మక ఇస్లామీయ మాసపత్రికగా మా చందాదారులు, శ్రేయోభిలాషులు అభివర్ణించారు.

200 పేజీల **'ముహమ్మద్(స)వారిపై ప్రపంచవ్యాప్తంగా జరుగుతున్న దుష్ప్రచారం'** పుస్తకాన్ని కూడా అల్లాహ్ దయవలన చేసిన వాగ్దానం మేరకు ఉచితంగా మా చందాదారులకు మొదటి సంవత్సరంలోనే అందించగలిగాము.

ఎటువంటి ప్రత్యేక సంస్థ సహకారం లేకుండా, ఎటువంటి ఆర్థిక వనరులు లేకుండా, కేవలం అల్లాహ్‌పైనే ఆధారపడి, వ్రేళ్ళపై లెక్కపెట్టగలిగే కొద్దిమంది ముస్లిమ్ సోదరులతో ప్రారంభించబడిన ఈ పత్రికను మీరంతా ఎంతగానో ఆదరించారు. కొందరు సోదరులైతే ఇతరులను కూడా చందాదారులుగా చేర్పించారు. ఎటువంటి ప్రయోజనాన్ని ఆశించకుండా, కేవలం అల్లాహ్ కొరకే వారు మాకు సహకరిస్తున్నారు. ఒక సోదరుడైతే 100 మంది కంటే ఎక్కువ సంఖ్యలో చందాదారులను జాయిన్ చేశారు. కేవలం కొద్దిమందినే కలిగి ఉండే 'శాంతిబాట టీమ్' నేడు అనేకమంది శ్రేయోభిలాషులతో చాలా పెద్దదయింది.

అన్ని విధాలా మాకు సహకరిస్తున్న మా చందాదారులకు మరియు మా శ్రేయోభిలాషులకు ధన్యవాదాలు తెలియజేసుకుంటున్నాము.

'శాంతిబాట'లో ఎటువంటి ఉద్యోగులు లేరు. ఏజెంట్లుగాని డిస్ట్రిబ్యూటర్లుగాని లేరు. అందరూ స్వచ్ఛందంగానే చేస్తున్నారు. అందువల్లనే అల్లాహ్ యొక్క శుభాలు 'శాంతిబాట'పై కలిగాయని మా నమ్మకం. ఆ శుభాలవల్లనే శాంతిబాట ద్వితీయ సంవత్సరంలో అడుగు పెట్టగలిగింది.

చదవండి! చదివించండి! ప్రామాణిక ఇస్లామీయ సమాచారాన్ని అందరికీ అందేలా చేయండి.

**రాబోయే సంచికను ప్రింట్ చేయించడానికి ముందుగానే, రెండవ సంవత్సరానికిగాను 200 రు॥ల చందాను పంపించమని మా చందాదారులను కోరుతున్నాము. ఇస్లామీయ జ్ఞానంపై ఆసక్తిగల మీ స్నేహితులకు, బంధువులకు 'శాంతిబాట'ను పరిచయం చేయండి.**

క్రిందటి సంచికలో బ్యాంక్ ఎకౌంట్ నంబర్‌లో తప్పుదొర్లింది. కరెక్ట్ నంబర్ **10428633092**. మనియార్డర్ (M.O.) ద్వారా పంపినట్లయితే మీ ఫోన్ నెంబర్‌తో సహా పూర్తి అడ్రస్ వ్రాసి పంపండి. రెన్యువల్ కొరకు అని వ్రాయండి. బ్యాంక్ ఎకౌంట్‌లో జమచేస్తే, చేసిన వెంటనే **9491103017** నంబర్‌కి ఫోన్ చేసి చెప్పడంగాని లేదా SMS ద్వారా వెంటనే సమాచారం తెలియజేయమని కోరుతున్నాము.

ఇతర దేశాలలో ఉన్నవారికి 'శాంతిబాట'ను అందుబాటులోకి తేవాలని అల్లాహ్ పేరుతో **www.saanthibaata.net** ప్రారంభించాము. ఈ వెబ్‌సైట్ గురించి విదేశాలలో ఉండే మీ బంధుమిత్రులకు తెలియజేయండి. ఇప్పటికి 9 దేశాలలో ఈ వెబ్‌సైట్ దర్శించబడుతోంది.

సంవత్సర చందాను బ్యాంకులో డిపాజిట్ చేయగోరువారు బ్యాంక్ కమీషన్ 25రూ॥లను అదనంగా చేర్చి డిపాజిట్ చేయండి.

**SBI A/C No. 10428633092, Nagireddi Srinivasa Rao, Andhra University Campus, Waltair, Visakhapatnam**

మనియార్డర్ ద్వారా చందా రూ.200/-లు పంపగోరువారు క్రింది ఎడ్రస్‌కు పంపండి:

**వెలుగుబాట ఎడ్యుకేషనల్ సొసైటీ, 2-8-31, కోటబజార్ సామర్లకోట - 533440, తూర్పుగోదావరి జిల్లా**

**Printed by** Md. Athaharullah, **Published by** Md. Athaharullah **Owned by** Velugubaata Educational Society (Regd.No. 569/2008), Samalkot and **Printed at** '*Akash Industries*', G-14, Industrial Estate, Samalkot - 533440 and **Published at** 2-8-31, Kota Bazar, Samalkot - 533440, **Editor:** Md. Athaharullah , Phone : 9347046090, Email: velugubaata@gmail.com, RNI Regd. No. APTEL/2009/29650

SAANTHIBAATA MONTHLY August, 2010
Registered with Registrar of News Papers for India

Samalkot-533440 (East Godavari Dist.)
RNI Reg. No. APTEL/2009/29650

అల్లాహ్, ఏ ప్రాణిపైననూ దాని శక్తికి మించిన భారం వేయడు. తాను సంపాదించిన (పుణ్య ఫలితం) దానికి లభిస్తుంది మరియు తాను చేసిన దుష్కర్మల శిక్ష అది అనుభవిస్తుంది. ఓ మా ప్రభూ! మేము మరచినా లేక తప్పు చేసినా మమ్మల్ని పట్టకు! ఓ మా ప్రభూ! పూర్వం వారిపై మోపినట్టి భారం మాపై మోపకు. ఓ మా ప్రభూ! మేము సహించలేని భారం మాపై వేయకు. మమ్మల్ని మన్నించు, మమ్మల్ని క్షమించు మరియు మమ్మల్ని కరుణించు. నీవే మా సంరక్షకుడవు. కావున సత్య తిరస్కారులకు విరుద్ధంగా మాకు విజయం (సహాయం) నొసగు.

(ఖుర్'ఆన్ 2:286)

అల్లాహ్! ఆయన తప్ప మరొక ఆరాధ్యదేవుడు లేడు. ఆయన సజీవుడు. విశ్వవ్యవస్థకు ఆధారభూతుడు. ఆయనకు కునుకురాదు మరియు నిదురరాదు. భూమ్యాకాశాలలో ఉన్న సమస్తమూ ఆయనకు చెందినదే. ఆయన సమ్ముఖంలో - ఆయన అనుజ్ఞ లేకుండా - సిఫారసు చేయగల వాడెవడు? వారి ముందున్నదీ మరియు వారి వెనుక నున్నదీ అన్నీ ఆయనకు బాగా తెలుసు. మరియు ఆయన కోరితే తప్ప, ఆయన జ్ఞానవిశేషాలలో ఏ విషయమునూ వారు గ్రహింపజాలరు. ఆయన కుర్సీ ఆకాశాలనూ మరియు భూమినీ పరివేష్టించి ఉన్నది. వాటి సంరక్షణ ఆయనకు ఏ మాత్రం అలసట కలిగించదు. మరియు ఆయన అత్యున్నతుడు, సర్వోత్తముడు. [ఆయతల్ కుర్సీ, ఖుర్'ఆన్ 2:255]

ధర్మం విషయంలో బలవంతం లేదు. వాస్తవానికి రుష్ద్ [సన్మార్గం], దుర్మార్గం నుండి స్పష్టంగా కనిపిస్తుంది. కావున కల్పిత దైవం [తాగూత్]ను తిరస్కరించి, అల్లాహ్‌ను విశ్వసించినవాడు, సుస్థిరమైన, ఎన్నటికీ విడిపోని ఆధారాన్ని పట్టుకున్నట్లే. మరియు అల్లాహ్ సర్వం వినేవాడు, సర్వజ్ఞుడు. [ఖుర్'ఆన్ 2:256]

అల్లాహ్ విశ్వసించినవారి సంరక్షకుడు, ఆయన వారిని చీకటి నుండి తీసి వెలుగులోకి తెస్తాడు. మరియు సత్యాన్ని తిరస్కరించినవారి రక్షకులు కల్పిత దైవాలు [తాగూత్], అవి వారిని వెలుగు నుండి తీసి చీకటిలోనికి తీసుకుని పోతాయి. అలాంటివారి నరకాగ్నివాసులు. అందులో వారు శాశ్వతంగా ఉంటారు. [ఖుర్'ఆన్ 2:257]

ఆకాశాలలో మరియు భూమిలో ఉన్నదంతా అల్లాహ్‌దే! మీరు మీ మనస్సులలో ఉన్నది, వెలుబుచ్చినా లేక దాచినా అల్లాహ్ మీనుంచి దాని లెక్క తీసుకుంటాడు. మరియు ఆయన తాను కోరినవానిని క్షమిస్తాడు మరియు తాను కోరినవానిని శిక్షిస్తాడు. మరియు అల్లాహ్ ప్రతీదీ చేయగల సమర్థుడు. [ఖుర్'ఆన్ 2:284]

ఈ ప్రవక్త తన ప్రభువు తరపునుండి, తనపై అవతరింప జేయబడిన దానిని విశ్వసించాడు మరియు [అదే విధంగా] విశ్వాసులు కూడా [విశ్వసించారు]. వారంతా అల్లాహ్‌ను, ఆయన దూతలను, ఆయన గ్రంథాలను మరియు ఆయన ప్రవక్తలను విశ్వసించారు. వారంటారు: "మేము ఆయన ప్రవక్తల మధ్య ఎలాంటి భేదభావాలను చూపము. మరియు మేము [ఆదేశం] విన్నాము మరియు దానిని శిరసా వహించాము, నీ క్షమాభిక్షను అర్థిస్తున్నాము, ఓ మా ప్రభూ! మా గమ్యస్థానం నీ వైపుకే ఉంది. [ఖుర్'ఆన్ 2:285]